ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

129

4. అస్థిముక్క శవం—ఎస్. క్రిష్ణవేణి
19. నెత్తురుకుండ—ఖమిడిపాటి భాస్కర రామారావు.
33. తిరుగులేని సాక్ష్యం—సికిందర్
51. కాఫీలో విషం—వాణిశ్రీ.
76. కొంపలకొరివి—ఎమ్.వి.వి. సత్యనారాయణ.
84. దొంగతనం ప్రమాదం—వసుంధర.
103. చీమ దూరని చిట్టడవి—అంధవరపు మల్లిబాబు.
122. రక్తం తీసిన శవాలు—ఎస్. గీతారాణి
158. చావుభయం—ప్రతాప రవిశంకర్
176. సీక్రెట్ గ్యాంగ్ (సీరియల్)—'సికిందర్'

నవలలు (సప్లిమెంట్)

3. నన్ను నేనే చంపుకున్నా—వసుంధర.
46. ఆఖరి అస్త్రం—వాణిశ్రీ.
79. మూడు దెయ్యాలు—ప్రతాప రవిశంకర్
124. మాయమైన బుల్లెట్—సికిందర్
173. పొగమంచు (సీరియల్)—ముద్దా సురేష్.

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, రచయితలతో ముఖాముఖి, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, పాఠకుల పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు మరెన్నో ఆకర్షణలు!!!

అట్టముక్క శవం

ఎస్. కృష్ణవేణి



ప్రొద్దుటే డీలక్సు హోటలుకి కాఫీ కోసం అని వచ్చిన మస్తాను గుంపుని చూసి దగ్గరకి వెళ్లాడు. నిజానికి మస్తానుకి తెలియనిది కాదు. అయినా కుతూహలాన్ని ఆపుకోలేక అక్కడికి వెళ్ళాడు.

పాండీబజారు మెయిన్ రోడ్డు అది. ఒక శవం పడి

వున్నది. శవం అనక తప్పదుగానీ అది శవం ఆకారంలో లేదు. అట్ట ముక్కలా వున్నది.

ఏ అర్థరాత్రి పడిపోయాడోగానీ దాని మీంచి చాల కారులు లారీలు వెళ్ళిపోవడంవలన అప్పడంలా అణిగిపోయి గుర్తు తెలియకపోయింది. బట్టలు కూడా రక్తం మాంసంలో తడిసి అణిగిపోయి గుర్తు తెలియకుండా పోయింది.

యెన్నో యాక్సిడెంట్సుని చూశాంగానీ ఇంత ఘోరంగా జరగడం చూడలేదని చూసినవారు అన్నారు.

2

"అప్పా! అప్పా! భలే బాగా చేశావ్" అన్నాడు మస్తాను బీడీపొగ వదులుతూ.

"యేం చేశానురా తమ్ముడూ" అంది తంబాకు నములుతూ పూర్వశి.

"రమేష్‌గాడూ! అప్పడం అయిపోయాడు" అంటూ హీ....హీ అంటూ పళ్ళికిలించాడు మస్తాను.

అటుగా వస్తున్న సుమతి ఆ మాట విని "మామా! రమేష్‌కి ఏమైనా అయిందా?" ఆత్రంగా అడిగింది.

"యేమైనా అయిందా? అని నెమ్మదిగా అడుగుతావేం గుంటా...."

"మస్తాన్! నీకు పనిలేదురా" గుడ్లు వురిమింది పూర్వశి.

ఆ వురుములోని అర్థం తెలుసుకొని మస్తాన్ నెమ్మదిగా అక్కడనుండి జారుకున్నాడు.

సుమతి వదలకుండా-"అమ్మా! రమేష్‌కి ఏమైంది?" అని అడిగింది.

"ఏమో! ఏమైందో? యెవడికి తెలుసు? ఈ బ్రోకరు

గాడి వెధవ వాగుడికి అర్థం ఏమిటీ?" అంటూ తంబాకు వూసే నెపంతో అక్కడనుండి వెళ్ళిపోయింది.

సుమతి నిట్టూర్చి తన గదిలోకి వెళ్ళిపోయినది.

3

లోకల్ పేపరు పాండీబజారులోని యాక్సిడెంటు గూర్చి ప్రచురించినది. హతుడు గుర్తు తెలియరాలేదని, యెటువంటి ఆచూకీ తెలియలేదని, బాగా త్రాగడంవలన యాక్సిడెంటులోగా మరణించి వుండవచ్చుని, అభిప్రాయం వెళ్ళబుచ్చి వూరుకున్నారు.

ఇనస్పెక్టర్ పళనివేలు ఆ రోజు వచ్చిన లెటర్సు అన్నీ తీరిగ్గా చదువుతూ వున్నాడు.

చివరి లెటర్‌ను బద్ధకంగా ప్రారంభించి, కుతూహలంగా గట్టిగా చదవడం మొదలెట్టాడు.

"ఇనస్పెక్టర్‌గార్కి,

నమస్కారములు

నా పేరు సుమతి. నేను పూర్వాశి అనే ఆవిడ కంపెనీలో వుంటాను. ఇది టి. నగర్‌లో గణపతి రోడ్డులో వున్నది. అది కంపెనీ అని యెవరికీ తెలియదు విటులకి బ్రోకరులకి తప్ప.

పైకి ఇంటి యజమానురాలు పేరు సీతామహాలక్ష్మమ్మ. భర్త రామానుజం. వ్యాపారం విజయవాడలో అని చెప్పుకుంటారు. నలుగురు కూతుళ్లు అని లోకులకి లెక్క.

ఈ ఇంటిలో మొత్తం పాతికమందిమి వున్నాం. ఇరవై రెండుమంది ఆడవాళ్ళం రాత్రిళ్ళు భోగ్యవస్తువులం. ముగ్గురు స్త్రీలకి గిరాకీలు పలకడంలేదు కాబట్టి, వంటపనికి నియమింపబడ్డారు.

"పోతే; మొన్న పాండీబజారులోని గుర్తు తెలియని

శవం పేరు రమేష్. అతనిని పూర్వాశి చిన్నప్పటినుండి పెంచి పెద్దచేసింది. అనాథ. అందంగా వుంటాడు. ఇంట్లో చదువు చెప్పించినది.

అతనిని స్టూడెంటు మాదిరి అమ్మాయిల కాలేజీల ముందు పంపి వలవిసిరి అందమైన ఆడపిల్లల్ని ప్రేమ అనే పేరుతో వంచించి పూర్వాశి వద్దకి చేర్చడమే రమేష్ వృత్తి. మేమంతా రమేష్ ప్రేమలో పడి వచ్చినవాళ్ళమే.

నీవిలా యెందుకు చేశావ్ అని రమేష్‌ని ప్రశ్నిస్తే, ఇలా చేయడం నాకిష్టంలేక పోయినా అమ్మకోసం చేయక తప్పదు. నేనలా చేయని నాడు నాకు మృత్యువు తప్పదు అని యేడ్చేవాడు మా ముందు.

పూర్వాశి చేతుల్లో నుండి తప్పించుకోలేమని మాకు తెలుసు.

అందుకే మేము యీ వృత్తిలో వున్నా రమేష్‌ని ప్రేమిస్తూనే వుండే వాళ్ళం.

ఓ వారం రోజుల క్రితం రమేష్ అందమైన పిల్లని తీసుకొచ్చాడు. చాల ధనవంతుల పిల్లేగాకుండా మంచి అందగత్తె, అమాయకురాలు. మా అందరిలా ఆ పిల్లని వంచించలేక నిజంగానే రిజిస్టర్ మారేజ్ చేసుకొని సైదా పేట యింటిలో వుంచాడు.

ఆ పిల్లతో లక్షలు సంపాదించాలనే దురాశలో వున్న పూర్వాశికి యిది చాల నిరాశ కలిగించింది.

ఎన్నో విధాలుగా నయాన భయాన చెప్పిచూసింది.

రమేష్ ఆ పిల్లని మాత్రం యీ వృత్తిలోకి దించనని, అలా చేసినట్లయితే ఆ పిల్ల తండ్రికి చెప్పి నిన్ను సర్వ నాశనం చేయిస్తాను అని అన్నాడు.

పూర్వాశి పదులుకున్నట్లే వుండి మొన్న అతనిని పిలిచి,

విందు పేరుతో బాగా తాగించి, అర్ధరాత్రి బయటికి పంపించి వేసింది.

తరచుగా ఆంధ్రానుండి తమిళనాడుకి దొంగ సారా తీసుకొని ఓ లారీ డ్రయివరు వస్తూవుంటాడు. దాని నెం. **APX** 1979. అతని ద్వారా లారీక్రింద త్రొక్కించినది.

మా ఇరవై ముగ్గురు ప్రేమికుడైన రమేష్ ఆత్మకి శాంతి మీరు కలిగించి మాకు ఈ చెర విడిపించండి.

ఇట్లు,
సుమతి."

ఆ సుదీర్ఘ లేఖ చదివి గట్టిగా నిట్టూర్చాడు ఇన స్పెక్టర్ పళనివేలు.

4

అర్ధరాత్రి రెయిడింగ్‌కి వెళ్ళారు.

ముందు వాచ్‌మెన్ అడ్డగించాడు.

కాలింగ్ బెల్ నొక్కితే ఆవలిస్తూ ఓ నలభై ఐదు సంవత్సరాల స్త్రీ వచ్చింది.

వయస్సులో వున్నప్పుడు నిజంగా వూర్వశినే. తంబాకు నమిలి నమిలి పళ్ళు గారపట్టి కొంత అందాన్ని తగ్గించినది.

"పోలీసువారా? మా యింటికా? ఎందుకూ?" అన్నది చాల అమాయకంగా.

సెర్చివారంటు చూపి యింట్లోకి దూసుకుపోయారు.

పెద్ద బంగళా. చాల గదులు వున్నాయి. కానీ అన్నీ ఖాళీగా బోసిగా వున్నాయి.

నరప్రాణి లేదు.

తరువాత ఆమెను ప్రశ్నించడం వల్లను ఎటువంటి ప్రయోజనంలేదని తెలుసు.

తిట్టుకొంటూ అవమానాన్ని దిగమ్రింగుకొని స్టేషన్‌కి

వచ్చిపడ్డారు.

"సార్! సుమతి లెటరు నిజమే అయివుంటుంది" తంగం అన్నాడు.

"అనుకుందాం. గానీ మెస్మరిజంలా ఒక్కరూ లేరు కదా'" ఇనస్పెక్టర్ అన్నాడు.

"ఇందులో ఏదో మోసం వుంది" అరిచాడు ఆవేశంగా తంగం.

"వుండవచ్చు. కానీ కొన్ని సెకండులలో యింత మందిని దాచడం లేక మాయంచేయడం అన్నది విచిత్రం ....అసాధ్యం!" ఇనస్పెక్టర్ అన్నాడు.

"మరి! మనం ఏం చేయాలి?" తంగం అన్నాడు.

"సుమతి లెటరు కోసం ఎదురు చూడాలి. తరువాత APX 1979 ఆంధ్రా లారీ కోసం ప్రయత్నించాలి"

అన్నాడు ఆవలిస్తూ.

టైము నాలుగు గంటలైంది.

తంగం లేచినిలబడ్డాడు.

"ఇంటికి వెళ్తావా?" ఇనస్పెక్టర్ అడిగాడు.

"వూహు! వూర్వశి యింటిముందు మాటువేస్తాను. లోనకి దూరిన వాళ్ళని మాయం చేసిందనుకో! తరువాత బయటికి పంపుతుందిగా!" కసిగా అన్నాడు.

"లాభంలేదు తంగం. దానికి తగ్గ వుపాయం ఏర్పాట్లు కావించుకొనే వుంటుంది. నా మాట విని అనుమానం కల్గకుండా మెదలకుండా వుండిపో! తరువాత ఐడియా యిస్తా" అంటూ రెండు కాళ్లు టేబుల్‌మీద వేశాడు నిద్ర పోవడానికి.

5

ఊర్వశి ప్రళయతాండవం చేయసాగింది.

ఇరవై ముగ్గురు అమ్మాయిలు మొఖాలు వేలాడవేసుకొని నించున్నారు.

మిగతా యిద్దరిమీద ఊర్వశికి అనుమానంలేదు. ఎందుకంటే వాళ్ళ శరీరాలు యెర్రటి ఏగాణీకి పనికిరాదు. బయట వాళ్ళకి ముద్ద అన్నం దొరకదు. కనుక వాళ్ళిద్దరూ చేసివుండరు.

మరి ఎవరి పని?

ఎవరూ మాట్లాడలేదు.

ఊర్వశికి పిచ్చి యెక్కినట్లు వున్నది. పెంచి పెద్దవాడిని చేసి తన వ్యాపారానికి మూలస్థంబంలా వుండే రమేష్‌ని తప్పనిసరిగా చంపించవలసి వచ్చింది. ఏ పిల్లకోసం చంపించినదో? ఏ పిల్లమీద లక్షల రూపాయలు ఆశలు పెట్టుకొందో? ఆ పిల్ల రమేష్ యింటినుంచి మాయం

అయిపోయింది. mar 80(6) (135)

తన కంటికి తెలియకుండా ఎలా జరిగిందో తెలియలేదు.

దెబ్బమీద దెబ్బ అన్నట్లు యిన్నాళ్ళకి పోలీసు రైడింగ్.

అంటే తన కంపెనీ వారి దృష్టిలో పడిందన్నమాటే.

అంటే రోజులు దగ్గరకి వచ్చినట్లే: అందుకే కల్లు తాగిన కోతిలా పిచ్చిగంతులు వేస్తోంది.

అందరినీ శల్యపరీక్ష చేస్తోంది.

అంతు చిక్కడంలేదు.

"వదినా...." అంటూ అబ్దుల్ లోనకి వచ్చాడు.

ఊర్వశి అతనిని చూసి వులిక్కి పడింది. "పగ లొచ్చావేం? లారీ యింటిముందు వచ్చివుందా?" అన్నది కోపంగా.

అబ్దుల్ మంచి నిషామీద వున్నాడు.

వదిన కోపాన్ని లెక్కచేయకుండా "ముందు ఓ గుంటని రూములోకి పంపు. తరువాత ఎన్ని మాటలు అడ మంటే అన్ని ఉడతా" అన్నాడు గదివేపు అడుగులు వేస్తూ.

"ఆగు! సర్వనాశనం అయింది. ముందు నీవు లారీని తీసుకొని యిక్కడనుండి వెళ్ళు" అంది అరుస్తూ.

అబ్దుల్ కళ్లు ఎర్రబడ్డాయి.

"అబ్దుల్ నా యిల్లు పోలీసోళ్ళ దృష్టిలోకి పోయింది. ఏ ముండో గుట్టుయిచ్చింది. దీనిగూర్చి యిచ్చింది. నీవే లారీ యెక్కించి రమేష్‌ని చంపివుంటావని కూడా ఇచ్చి వుంటుంది. నీవు ఇహనుండి యిక్కడికి రాకు" అన్నది దాదాపు ఏడుస్తూ.

"ఏటీ....క్యా....?" అంటూ కళ్లు యెర్రచేశాడు.

అతని శరీరం యావత్తు గడగడా వణుకుతోంది.

రమేష్‌ని గనుక చంపితే, నీవు బ్రతికివున్నంత కాలం

ఫ్రీగా అమ్మాయిలని నీకు యిస్తానని ఊర్వశి ప్రమాణం చేసింది. అందుకే రమేష్‌మీద లారీని ఎక్కించాడు.

ఆ మర్డరు సమసిపోయిందని మాంచి వుషార్‌గా వుండేటమేగాక, తమ వూరిలో తనకి కంటకంగా వున్న శత్రువుని గూడా యీ విధంగానే చంపాలనే ఐడియాతో వున్నాడు.

"ఎలా తెలిసింది?'' భయం భయంగా అడిగాడు.

"ఆడూ! ఆ రమేష్‌గాడూని లవ్వు చేశారు కదారా వీళ్ళు! ఆడు చచ్చినాడని వీళ్ళే యెవరో చెప్పివుంటారు" అంది.

అబ్దుల్లా బుర్ర చురుకుగా పనిచేసింది.

"వదినా! మరునాడు నే వస్తే సుమతి తెగ ఏడ్చింది నా దగ్గర. ఆడికోసం అదే...." అని చెంగున పులిలా ఎగిరి సుమతి జుట్టు పుచ్చుకొని, గుంపులోనుండి యివతలకి లాగి—

"ఏమే! నీవు చెప్పావా?" అంటూ గట్టిగా ఓ చెంప దెబ్బ వేశాడు.

"కెవ్వు"మంది.

"నిన్ను ఎలా తంతానో చూడూ" అంటూ జాకెట్టుని పర్రున చింపాడు.

అందులోనుండి ఒక కాగితం పడింది. అదితీసి విప్పి చదివాడు.

"ఇనస్పెక్టర్‌గార్కి—

నమస్కారములు

మీ రయిడింగ్ ఫెల్యూర్ అయిందికదా! ఎలా అయిందో నే చెప్పనా...."

అని మాత్రం వున్నది.



జరిగినిదేమిటంటే, బాత్ రూములో కూర్చొని వ్రాయడానికి పూనుకొంది. ఇంతలోకి అందరినీ సమావేశం కమ్మనమని ఊర్వశి చెప్పడంవలన అపి కాగితాన్ని పెన్సిలుని జాకెట్టులో దాచుకొని వచ్చింది.

అదిచూసి అబ్దుల్ వెర్రెత్తిపోయాడు.

ఊర్వశి పెద్దగొంతుకతో వొళ్లుమరచి తిట్లు, శాపనార్థాలు ప్రారంభించి—"దీన్ని చంపి పాతేయకపోతే అందరి ప్రాణాలకి ముప్పుతప్పదు మరిదీ" అన్నది ఏడుస్తూ.

అబ్దుల్ అసలికే నిషామీద వున్నాడేమో విచక్షణా జ్ఞానం నశించడంతో ఆమె పీకపట్టుకొని గట్టిగా నులుమసాగాడు.

అమ్మాయిలందరూ కెవ్వుమన్నారు.

సుమతి నిర్జీవంగా కళ్ళూ, నాలిక బయటికిరాగా క్రింద

పడిపోయింది.

"ఈ విషయం బయటికి వచ్చిందా మీ అందరికీ యిదే గతి జాగ్రత్త" అన్నాడు తన చేతులని చాపి భయం కరంగా అబ్దుల్.

6

తమిళనాడు ఆంధ్రాబార్డర్ దగ్గర మాటుపెట్టారు. APX 1979 కోసం.

అది అంతుచిక్కలేదు.

పోతే, సుమతివద్ద నుండి ఏ విధమైన లెటరు రాలేదు.

కాళ్ళుచేతులు విరగకొట్టుకున్నట్లు వున్నది ఇనస్పెక్టర్ పళనివేలకి సార్జంటు తంగంకి.

కానీ దారిలేదు.

తంగం మారువేషంలో వూర్వశి కంపెనీకి వెళ్ళడానికి ప్రయత్నించాడు గానీ అదీ ఫలించలేదు.

"ఇక్కడ అటువంటిదేమీ లేదండి" అని బ్రోకర్లు అనేవారు.

లోన ఏదో జరిగింది. అందుకే చాలా జాగ్రత్తలో వున్నారని వూహించారు.

మఫ్టీలో ఇద్దరు కానిస్టేబుల్సుని పెట్టారు. ఆ ప్రయత్నం వృధా అయింది.

చీమ దోమ కూడా దూరనంత కట్టుదిట్టంగా వున్నది పరిస్థితి.

ఇలా పదిరోజులు గడిచిపోయాయి.

7

బొంబాయి నుంచి పెద్దసేటు వచ్చారని ఆయన సినిమాలు తీస్తారని క్రొత్తహీరోయిన్ కోసం కంపెనీలు తిరుగుతున్నారని, నచ్చితే ఏభై వేలు యిచ్చి అమ్మాయిని

కొనుక్కుపోతారని బ్రోకరువచ్చి వూర్వశికి చెప్పాడు.

ప్రస్తుతాని కన్నీ ఆపి నష్టాన్ని భరిస్తోంది. కానీ బొంబాయి సేటు, ఏభై వేలు అనగానే ఆశ గుటగుటమన్నది.

"నిజంగా సేఠేనా?" అన్నది అనుమానంగా.

"అయ్యో! సేటుగాక. హోటల్ కోరమండల్లో బసచేసి వున్నారు. ఆయన వాట్-69 వచ్చినవాళ్ళకి కాఫీలా ఇచ్చి మర్యాదచేస్తున్నాడు. నాకు బఖీస్ క్రింద వెయ్యిరూపాయలు యిచ్చాడు" అన్నాడు.

ఊర్వశి గుడ్లు తేలవేసింది.

"పిల్ల నచ్చకపోయినా, నచ్చినపిల్లతో యిక్కడ ఒక రాత్రి గడిపితే ఐదువేలు యిస్తాడట" అన్నాడు బ్రోకరు.

ఒక్కరాత్రికి ఐదువేలు అనగానే నచ్చినవాడిమీద కట్నం వచ్చినట్లుగానే అనిపించినది.

ఐదువేలు అంటే మాటలా.

అసలికే వ్యాపారాన్ని కట్టివుంచడంవలన చాల నష్టంగా వున్నది. తిండిఖర్చులు తప్పడంలేదు. ఇలా ప్రాణాలు దక్కించుకోవడానికి యెన్నాళ్లో తెలియడంలేదు. పైగా సేట్ ఈ వూరివాడు కాదు.

ఒక్కరాత్రికి ఐదువేలు!

నచ్చి తీసుకుపోతే యాభై వేలు!

"ఊఁ" అంది చివరికి.

8

"మీ రెంతమంది!" సేట్ ఇంగ్లీషులో ప్రశ్నించాడు.

"ఇరవై ఇద్దరూ?" ఇంగ్లీషులోనే సమాధానం ఇచ్చింది.

సేట్ వులిక్కిపడ్డాడు.

"బ్రోకరు యిరవై ముగ్గురన్నాడే" అనుమానంగా అడిగాడు.

ఆ పిల్ల భయపడి చుట్టూ చూపింది.

"ఏం? అలా చూస్తున్నావేం?"

"ఏవీలేదు?" భయంగానే అన్నది.

"భయంలేదు చెప్పు. నేను హీరోయిన్‌గా నిన్నే సెలక్టు చేసుకుంటాను. నాకు సైయిడ్ హీరోయిన్ కూడా కావాలి" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. హీరోయిన్ అనగానే యెగిరి గంతు వేస్తుందని ఆశించాడు. కానీ చాల నిర్వికారంగా వున్నది. శరీరం గజగజా వణుకుతోంది.

"సార్! నేను బి. ఏ. సెకెండు యియర్ వరకూ చది వాను. తెలుగు, అరవం, హిందీ, ఇంగ్లీషు వచ్చు. నన్ను హీరోయిన్ చేయాకపోయినా ఫరవాలేదు.

మీరు నన్ను యీ చెరనుండి విడిపించి ఎవరింట్లోనైనా దాపపని అయినా యిప్పించండి చాలు. బ్రతుక్కుంటాను" అని వెక్కి వెక్కి ఏడ్చింది.

"నాకు నిజం చెప్తే, నిన్ను తప్పక రక్షిస్తాను" అభయం యిచ్చాడు.

"మా విషయం పోలీసువారికి యిన్ఫర్మేషన్ యిచ్చిం దని మాతో వుండే సుమతిని పీకనులిమి చంపారు" అంటూ బావురుమనబోయే గొంతుకలోని శబ్దం బయటికి రాకుండా చెంగు కుక్కుకొంది.

"వాట్" అంటూ లేచికూర్చున్నాడు సేట్.

ఆ పిల్ల భయంతో గజగజలాడిపోతోంది. ప్రాణభయం మరి. కళ్ళారా ఆ హత్యని చూపింది. ప్రేమవలలో పడి వ్యభిచారి అయింది. ఇంకా ఏం జరుగుతుందోనని భయంతో వణికిపోతోంది.

"ధన్"మని మంచంతోసహా లోనికి కూలిపోయారు.

"ఏమిటిదీ?" సేట్ గర్జించాడు.

"పోలీసు రైయిడింగ్‌గానీ ఏమైనా జరిగితే, మా అమ్మ ఓ మీట నొక్కుతుంది. మొత్తం పాతికమంచాలు అండర్‌గ్రౌండ్‌లోకి దిగిపోయి, నేల మామూలుగా అవుతుంది" అన్నది భయపడవద్దు అన్నట్లు.

ఒకగంట తరువాత మళ్ళీ మంచంతోసహా పైకివచ్చి చేరారు.

సేట్ తనకి అవమానం జరిగిందని, ధామ్‌ధూమ్ అని అరచి ఐదువేలు పూర్వాళి మొహంమీదవిసిరి వెళ్ళిపోయాడు.

ఐదువేలైనా దక్కినందుకు సంతోషించినది.

9

సుమతిని రక్షించ లేకపోయినందుకు ఇనస్పెక్టరుకి తంగానికి చాల విచారంగా వున్నది.

ఐ జి.ని వెళ్ళి కలుసుకొని అన్ని విషయాలు ఇనస్పెక్టర్ పళనివేలు మాట్లాడాడు.

"మనకి రిపోర్టు వచ్చినట్లేగా! సుమతి రక్షించమని విన్నవించుకొంది. ఆమెను రక్షించలేకపోయినా మిగిలిన వారినైనా రక్షించండి. మీ కెంత బలగం కావాలంటే అంత తీసుకోండి" అని ఆర్డరు ఇచ్చాడు.

ఆ రోజు రాత్రికే అన్నిఏర్పాట్లు చేసుకున్నారు.

సుమారు సాయంకాలం నాలుగుగంటలకు—

మిడతల దండులా అందమైన అమ్మాయిల గుంపు ఒకటి టి. నగర్ పోలీసుస్టేషన్‌కి వచ్చింది.

అందులో రాత్రి తాను సేట్‌రూపంలో కలుసుకున్న పిల్లని గుర్తుపట్టాడు తంగం.

అందరూ కలపి, కాళ్ళూ చేతులు నోరు కట్టి లాక్కొ

చ్చారు వూర్వశిని.

రాత్రిపిల్ల ముందుకొచ్చి—"సార్! మేము ఇన్నాళ్ళు యీావిడ చేతిక్రింద మ్రగ్గుతూ వున్నాము. రమేష్ అనే యువకుడి ద్వారా ఆడపిల్లలమీద వలవిసిరి వ్యభిచారంలోకి దించుతుంది యీ ముచ్చురాలు. మా మీద లక్షలు లక్షలు సంపాదించింది.

ఆ రమేష్‌కి యీామెకి తగూవచ్చి లారీద్వారా చంపించి నది. సుమతి పోలీసువారికి అచూకీ యిచ్చిందని సుమతిని చంపి ముక్కలు ముక్కలుగా నరికంచి సముద్రంలో పారే యించింది. ఈ రోజు ఒకపిల్ల పారిపోవడానికి ప్రయత్నిస్తే దెబ్బలు కొట్టింది.

మేము ప్రాణభయంతో పిల్లుల్లాగావున్న వాళ్ళం. ఎదురు తిరిగి బంధించి లాక్కొచ్చాము. అబ్దుల్ అడ్రసు కూడా యిస్తాము.

సార్! వీళ్ళకి శిక్షవేయించి రమేష్ ఆత్మకి, మా సుమతి ఆత్మకి శాంతి కూర్చండి.

సార్! దీని ఆస్తి అంతా మా వొంటిమీద సంపా దించినదే. అది మాకు యిప్పిస్తే మే మంతా ఓ శరణా లయం స్థాపించి మా వంటి అభాగ్యులకి నీడనిస్తూ బ్రతుకుతాం" అన్నది నమస్కరిస్తూ.

మిగిలిన ఆ అభాగినులంతా కన్నీళ్ళతో ఇనస్పెక్టర్‌కి నమస్కరించారు.

ఆ అభాగిని స్త్రీల మొఖాలు చూడగానే ఇనస్పెక్టర్ హృదయం ద్రవించిపోయింది.

"చెల్లీ! నాకు చేతనైనంత వరకూ మీకు సహాయం చేస్తానమ్మా" అన్నాడు కన్నీళ్ళతో.

ఊర్వశి కథ ఆ నాటితో ముగిసింది. □

భమిడిపాటి భాస్కర రామారావు

నెత్తురు కుండ

"మాది సిరిపురం. నా పేరు రఘు. మా పెదనాన్న రాఘవయ్యగారి కొడుకు పదేళ్ళ శ్రీనివాస్‌ను ఎవరో హత్యచేశారు. మా నాన్న రంగనాధంగారిని అరెస్టుచేశారు పోలీసులు."

"మీకు మీకు కుటుంబ కలహాలేమైనా ఉన్నాయా?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్.

"నాకు తెలిపినంతవరకు లేవు."

"మీ పెదనాన్నగారు నిస్సంతుగా చనిపోతే ఆస్తి మీకు దక్కుతుందా?"

"నాకు తెలియదు."

"మీకు తెలియని ఏవైనా కారణాలవల్ల మీ నాన్నగారే హత్యచేసి వుంటారేమో?"

"మానాన్నగారంతటి సౌమ్య స్వభావులు ఆ ప్రాంతాల ఎవరూ లేరు."

"సరే! ప్రక్క గదిలో మా అసిస్టెంట్ సారథి వుంటాడు. మీ అడ్రసు, కేసు వివరాలు అతడికి యిచ్చి వెళ్ళండి."

రఘు సారథికి వివరాలు యిచ్చి వెళ్ళాడు.

2

"గోపాల్! సిరిపురం రాఘవయ్యగారి కొడుకు హత్యకేసు గురించి మాట్లాడాలని వచ్చాను" అన్నాడు డిటెక్టివ్ శిరీష్ స్టేషన్‌లో అడుగుపెడుతూనే.

"రా! కూర్చో! యింతకూ ఎవరి పక్షాన నువ్వు వచ్చింది? రాఘవయ్యగారా? రంగనాధంగారా?" అని అడిగాడు ఇనస్పెక్టర్ గోపాల్.

"రంగనాధంగారి కొడుకు రఘు వచ్చి పరిశోధించమని కోరాడు."

"అలాగా! ఇది క్లియర్ కట్ కేసు. రంగనాధమే హంతకుడని చెప్పడానికి సందేహం ఎంతమాత్రం లేదు-"

"అంత ఖచ్చితమైన నిర్ణయానికి ఎలా వచ్చావు?"

"ఏముంది! వెరీ సింపుల్! ఆస్తి! పాతికెకరాల ఆస్తి!"

"రాఘవయ్య కొడుకు చనిపోయినంత మాత్రాన ఆస్తి రంగనాధానికెలా దఖలు పడుతుంది? రాఘవయ్య ఎవరినైనా దత్తుచేసుకోవచ్చు కదా!"

"నువ్వు చెప్పింది నిజమే! వాళ్ళ తండ్రి ఆస్తి పంపకం చేసేటప్పుడు చిన్న తమాషా అయిన షరతు పెట్టాడు. అన్నదమ్ము లిద్దరిలోనూ ఎవరికేనా సంతానం కలగపోతే రెండవవారి బిడ్డను దత్తు తీసుకోవలపిందేగాని పై పిల్లవాడిని తెచ్చుకోరాదట. అందుకు తప్పినవారికి ఆస్తి హక్కు పోతుందని వ్రాశారట."

"తమాషాగా వుందే! అలా వ్రాయడంలో ఆయన వుద్దేశ్యమేమిటో!"

"తరతరాలుగా వారి కుటుంబంలో ఇద్దరే అన్నదమ్ము లుంటూ, వారిలో ఒకరు నిస్సంతుగా చనిపోవడం జరుగు తోందట. దానితో వారి వంశంలో పూర్వంనుండీ అదే ఆచారం పాటిస్తున్నారని చెప్పాడు రాఘవయ్య."

"రాఘవయ్యకు చివరి కాలంలో కొడుకు పుట్టడంచేత ఆస్తి తమకు కాకుండా పోతుందని రంగనాధం ఈ హత్య చేశాడంటావ్? అంతేనా? నువ్వు చెప్పేది నాకేమీ సమం జసంగా కనిపించడంలేదు గోపాల్! రంగనాధాన్ని అరెస్టు చేయడంలో నువ్వు తొందర పడ్డావేమో?" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

"నేనేమీ తొందరపడలేదు. తగిన రుజువు దొరికాకే అరెస్టు చేశాను."

"ఏమిటది?"

"రాఘవయ్య బావమరది సుబ్బారావు అనకాపల్లిలో వుంటున్నాడు. శ్రీనివాస్ వారం రోజులుగా అక్కడే వుంటున్నాడు. నిన్న రాఘవయ్య పంపించాడని చెపుతూ

ఒక మనిషి సుబ్బారావును కలుసుకుని వుత్తరం ఒకటి యిచ్చాడు. వుత్తరం చూచిన సుబ్బారావు వెంటనే ఆ మనిషితో శ్రీనివాస్‌ను పంపించాడు. ఇదిగో ఉత్తరం" అని డిటెక్టివ్ శిరీష్‌కు అందించాడు వుత్తరాన్ని ఇనస్పెక్టర్ గోపాల్.

"....మనింట్లో పనిచేసే అప్పలస్వామి గ్రామాంతరం వెళ్ళడంచేత ఈ సన్యాసిరావును పంపిస్తున్నాను. ఇతడితో పిల్లవాడిని వెంటనే పంపించవలసింది. వాళ్ళ స్కూలు వారి ఎక్స్‌కర్షన్ ట్రిప్పు అనుకున్నకంటె ముందుగా నిర్ధారణయిందట. రేపే ప్రయాణం. కాన గ్రహించగలవు.

మీ బావ

రాఘవయ్య."

అని వుంది వుత్తరంలో.

"అయితే వుత్తరం తీసుకెళ్ళిన దెవరో తెలిసిందా?" శిరీష్.

"ఆహా! పాత కేడీ నాగేష్. తెచ్చి కొట్లో తోశానులే! వాడే చెప్పాడు తనకీ వుత్తరం ఇచ్చింది రంగనాధం అని."

"చేతివ్రాత పరీక్ష చేయించావా?"

"అక్కడే వచ్చింది చిక్కంతా. మన నిపుణుడు ఇది రంగనాధం వ్రాసింది కాదంటాడు."

"మరి అతడినే ఎలా అరెస్టు చేశావ్?"

"అన్ని రుజువులు సరిపోతున్నప్పుడు చేతివ్రాత అడ్డా! రంగనాధం ఎవరి చేతనైనా వ్రాయించి వుండవచ్చుకదా!"

"సరే! శ్రీనివాస్ శవం ఎక్కడుంది?"

"మార్చురీలో."

"ఒకసారి చూద్దామా?"



"నడు."

ఇనస్పెక్టర్ గోపాల్, డిటెక్టివ్ శిరీష్‌లు హాస్పిటల్‌కు చేరుకున్నారు. మార్చురీలో తెల్లగుడ్డలలో చుట్టివుంది శ్రీనివాస్ శవం. వయసు 10 సం॥లు వుంటాయని ఊహించాడు డిటెక్టివ్ శిరీష్. కంఠం సగంవరకూ తెగి వుంది. మిగిలిన శరీరంపై యే విధమైన గాయాలులేవు. పోస్ట్ మార్టమ్ రిపోర్టు తొందరగా పంపించమని డాక్టరుకు చెప్పి, తిరిగివచ్చారు.

"గోపాల్! శ్రీనివాస్ కంఠం సగంవరకూ తెగివుంది. శవం దొరికినచోట రక్తం మడుగు కట్టి వుండాలి. కాని శవం పరిశుభ్రంగా వుంది. హాస్పిటల్‌కు చేరేలోగా దేహాన్ని శుభ్రం చేశారా?"

"అసలు శవం దొరికినచోటే నెత్తురు మడుగు కట్ట లేదు. ఎక్కడో హత్యచేసి శవాన్ని అక్కడ పారవేశారనే నిర్ధారణకు వచ్చాను."

డిటెక్టివ్ శిరీష్ నుదురు చిట్లించి కొద్దిక్షణాలు మౌనంగా వుండిపోయాడు.

"గోపాల్! లాకప్‌లోవున్న నాగేష్‌తో ప్రయివేట్‌గా మాట్లాడాలి. ఏర్పాటు చేయగలవా?"

నాగేష్‌ను పిలిపించి, ఇనస్పెక్టర్ గోపాల్ బయటకు వెళ్ళాడు.

"నాగేష్! ఇంతవరకూ నువ్వు చిల్లరదొంగతనాల కేసుల్లో మాత్రమే శిక్షింపబడ్డావు. ఇప్పుడు కిడ్నాపింగ్‌తో బాటు హత్యానేరంలో కూడా యిరుక్కున్నావు. నిజం ఒప్పుకోవడం నీకే మంచిది!" అన్నాడు డిటెక్టివ్ శిరీష్ గద్దింపుగా.

"మీరు నన్నేం దబాయించనక్కరలేదు. హత్యతో నాకెలాంటి సంబంధమూ లేదు. నా కా ఉత్తరం ఇచ్చింది రంగనాధమే! పిల్లవాడిని తెచ్చి రంగనాధానికి అందజేశాను. తరువాతేం జరిగిందో నాకు తెలియదు" అన్నాడు నాగేష్ మొండిగా.

"నాగేష్! నీ కా ఉత్తరం యిచ్చింది రంగనాధం కాదు. ఆయన ఆ రోజున ఊళ్ళోనే లేడు. అవసరమైతే ఆయన దానిని రుజువు చేసుకుంటాడు. అప్పుడు నీ పరిస్థితి ఏమిటో ఆలోచించుకో!"

నాగేష్ రెండుక్షణాలు తటపటాయించాడు.

తను చీకటిలో విసరిన రాయి గురితప్పకుండా తగిలినందుకు లోలోపల సంతోషిస్తూ, "నాగేష్ అనవసరంగా అల్లరిపాలుకాకు. సాధ్యమైనంత తక్కువ శిక్ష—అది కూడా జుల్మానా మాత్రమే పడేటట్టు చూస్తాను. ఆలోచించుకో!" అన్నాడు సానునయంగా.

"నిజంగా తక్కువశిక్ష పడేటట్టు చూస్తారా?" అన్నాడు

నాగేష్ ఆశగా.

"నాగేష్! డిటెక్టివ్ శిరీష్ ఆడినమాట తప్పడు. కాని నేను దయచూపిస్తున్నానని మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తే మాత్రం మరిన్ని చిక్కులలో ఇరుక్కుంటావ్! జాగ్రత్త!"

"పల్లపువీధిలో భైరవయ్య అని ఒకడుంటాడు. అతడు గ్రహబాధలకు చికిత్సచేస్తాడు. అయిదురోజుల క్రితం భైరవయ్య నన్ను కలుసుకుని, నాగేష్ 10 సం॥ల వయసు కుర్రాణ్ణి సంపాదించాలి" అన్నాడు.

"ఎక్కడ దొరుకుతాడు?" అన్నాను.

"ఎక్కడ దొరికేది మేమే చెబుతాం. ఎత్తుకు రావలసిన పనికూడా లేదు. రాజాగా దొరబాబులా తేవచ్చు. తగినంత డబ్బిస్తాం" అని చెప్పాడు.

"ఎప్పుడు?" అడిగాను నేను.

"నేను కబురుచేసినప్పుడు" అని చెప్పి, మొన్న రాత్రి కబురుచేశాడు. నేను భైరవయ్య యింటికి వెళ్ళాను. భైరవయ్య గది చీకటిగా వుంది. ఆ గదిలో భైరవయ్యతో బాటు మరో ఆసామి కూడా వున్నాడు. తెల్లని పంచె, లాల్చీ వేసుకున్నాడు. భైరవయ్య నాతో యిలా చెప్పాడు.

చూడు నాగేష్! ఈయన రంగనాధంగారు. వీరి అన్నగారి కొడుకు అనకాపల్లిలో మేనమామ యింట్లోవున్నాడు. నువ్వు రేపు ఏ వేళనయినా బయలుదేరి అనకాపల్లి వెళ్ళాలి. చీకటిపడ్డాక ఆ కుర్రవాణ్ణి యిక్కడకు తీసుకురావాలి. ఈ ఉత్తరం ఇస్తే సుబ్బారావు నీతో పిల్లవాణ్ణి పంపిస్తాడు. అని ఒక ఉత్తరం యిచ్చాడు.

మరిచేవు సుమా! నిన్ను ఎవరు పంపారని అడుగుతే రాఘవయ్యగారు పంపారని చెప్పాలి. తెలిసిందా? అన్నాడు.

కొంత అడ్వాన్సు యిచ్చాడు. అది తీసుకుని అక్కడనుండి వచ్చేశాను.

డబ్బు చేతిలో పడటంతో దోసు యెక్కువైంది. తెల్లవారి లేచేవేళకు పదకొండు అయింది. ఆదరాబాదరా బయలుదేరి అనకాపల్లి చేరుకున్నాను.

సాయంత్రం ఆరు ఘంటాక అడ్రసు ప్రకారం వెళ్ళి ఉత్తరం యిచ్చాను. సుబ్బారావు పిల్లవాడిని నాతో పంపించాడు. తీసుకెళ్ళి భైరవయ్యకు అప్పచెప్పాను. ఆ సమయానికి క్రితం రాత్రి చూపిన ఆసామీ కూడా అక్కడే వున్నాడు. రావలసిన డబ్బు తీసుకుని వచ్చాను. తరువాత ఏం జరిగినదీ నాకు తెలియదు." అని ముగించాడు నాగేష్.

3

డిటెక్టివ్ శిరీష్ సాయంకాలం 5 గం॥ అయాక పల్లపు వీధికి బయలుదేరాడు.

ఇప్పుడు శిరీష్‌ను యెవరూ గుర్తుపట్టలేరు. మోకాళ్ళు దిగీ దిగని పంచె. మాసిన బనీను. చెవిలో చుట్ట. మధ్య మధ్య నెరసిన బొద్దు మీసాలు. తలకు తుండుగుడ్డ. కాళ్ళకు సాదా అకు చెప్పులు. ఇదీ అతని వేషం. తిన్నగా భైరవయ్య యింటికి చేరుకున్నాడు.

భైరవయ్య యింటి ముంగిటనే వున్నాడు. నల్లగా కండలు తిరిగిన దేహం. మెలితిరిగిన మీసాలు. ఎర్రని కళ్ళు. మెడలో తాయెత్తు. జబ్బలకు వెండి దండ కడియాలు. చూడగానే భయం కలిగేటట్లున్నాడు. డిటెక్టివ్ శిరీష్‌వైపు చూచి—

"ఎవరు కావాలి?" అన్నాడు. ఉరుమురిమినట్లుంది కంఠం.

"భైరవయ్య బాబుకోసం వచ్చాను బాబో!"

"నేనే భైరవయ్య. ఏమిటి పని?"

"దండాలు భైరవయ్య బాబో! దండాలు! నాను మింది నుంచెల్ఫో వచ్చాను బాబో! నా పేరు శీరయ్య. నా కొడుకు రోగంతో మంచాన పడున్నాడు బాబో! పెద్దాసుపత్రిల్లో మందిప్పిచ్చినా నయం కాలేదు బాబో! ఇంకీడు బతకడు. తీసుకు నెల్ఫోయి రారా అన్నారు బాబో డాకటేర్లు. కాని మా ఊరోల్లు ఓరొరే! శీరయ్యా! ఇదేదో గెహం అయ్యుంటాదిరా అని అంటే తమకాడ కెల్ఫోవచ్చాను బాబో! ఇక తమ దయ. తమరెంత అడిగితే అంతా యిచ్చుకుంటాను బాబో!" అన్నాడు.

"అయిదువందలవుతుంది."

"తమ దయ బాబో!"

"సరే! నీ పిల్లవాడికి వచ్చిన భయం ఏమీలేదు. ఇంతకూ వాడి వయసెంత?"

"ఎనిమిదేలు బాబో!"

"బాగుంది. నే చెప్పినట్టు చేస్తావా?"

"చిత్తం!"

"నీ పిల్లవాడి వయసు పిల్లవాడిని ఒకడిని తేవాలి!"

"ఎందుకు బాబయ్యా!"

"ఎందు కేమిటిరా! వాడిచేత అమ్మవారికి పూజ చేయించాలి. తరువాత నేను చెప్పినట్టు చేయాలి."

"చిత్తం బాబో! నానేటి సెయ్యాలి బాబో!"

"ముందు పిల్లవాణ్ని తీసుకురా! ఏం చెయ్యాలో తరువాత చెపుతా."

"చిత్తం బాబో!" అని చెప్పి శిరీష్ వెనుదిరిగాడు.

డిటెక్టివ్ శిరీష్‌కు వూరు అవతల అడవి మధ్య అమ్మవారి ఆలయం వున్నట్లు చటుక్కున గుర్తు వచ్చింది.

కారులో బయలుదేరాడు.

చెట్ల మధ్య ఒక ఆలయం కనబడింది.

శిథిలావస్థలో ఉంది ఆలయం. ఆలయ ముఖద్వారం సగం విరిగివుంది.

మెల్లగా గుడిలో ప్రవేశించాడు డిటెక్టివ్ శిరీష్.

ఎదురుగా నిలువెత్తున వుంది కాళికా విగ్రహం. చాచిన ఎర్రని నాలుకతో భయంకరంగా వుంది విగ్రహం. విగ్రహం ముందు భాగంలో బలిపీఠం వుంది. పీఠం మీద ఎర్రని అక్షతలు కొద్దిగా వాడిన పూలు కనిపించాయి. ఈ మధ్యనే పూజ ఏదో జరిగి వుండవచ్చనుకున్నాడు.

విగ్రహాన్ని సమీపించాడు.

విగ్రహం చేరువలో ఒక త్రిశూలం వుంది. విగ్రహం పాదాల ముందు కూడా పువ్వులు, అక్షితలు వున్నాయి. వాటి మధ్య అర్థరూపాయంత పరిమాణంలో నల్లని మరకలు కనపడ్డాయి. రక్తం కావచ్చుననుకున్నాడు. జాగ్రత్తగా గీకి జేబులోని ఒక కాగితంలో పొట్లం కట్టాడు.

తల పంకిస్తూ బయటకు వచ్చాడు. ప్రాంగణంలో నలు మూలలా తిరిగి చూచాడు.

ఒకచోట నేల తవ్విన జాడలు కనిపించాయి. అక్కడ ఒక తెల్ల జేబురుమాలు కనిపించింది. తీసి చూచాడు. ఒక మూల 'R' అన్న అక్షరం మరొకమూల నల్లజీడితో వేసిన చాకలి గుర్తు కనిపించాయి. రుమాలు జేబులో భద్రపరిచాడు.

నేల త్రవ్వడానికి ఏదేనా దొరుకుతుందా అని చూచాడు. గుడిలో త్రిశూలం గుర్తుకు వచ్చి దానితో నేలను త్రవ్వసాగాడు.

చాలా సులువుగానే త్రవ్వబడుతోంది నేల. ఒక అడుగు



లోతైనా త్రవ్వకుండానే బయటపడింది ఒక కుండ.

దానిలో గడ్డకట్టిన నెత్తురు వుంది.

ఆ నెత్తురు కుండను పరీక్షకోసం పంపించేసి తిరిగి యింటికి చేరుకున్నాడు డిటెక్టివ్ శిరీష్.

"సారథీ! ఈ జేబు రుమాలు తీసుకో! మూలనున్న చాకలి గుర్తునుబట్టి, వెంటనే ఇది యెవరిదో తెలుసుకుందుకు ప్రయత్నించు."

ఛోటా డిటెక్టివ్ ఈలవేసుకుంటూ హుషారుగా బయలుదేరి ఊరి చాకళ్ళమీద పడ్డాడు. కావలసిన వివరాలు తెలుసుకుని వచ్చాడు.

"బాస్! ఈ రుమాలు రాజుగారిది. రాఘవయ్యగారు, రంగనాథంగారు వుంటున్న వీధికి మూడో వీధిలో వుంది ఆయన ఇల్లు. ఇప్పుడు వాళ్ళ యింటిమీదుగానే వస్తున్నాను.

"బాస్! మరో విషయం. రాజుగారి అబ్బాయి గోపీ, శ్రీనివాస్ ఈడు వాడే. శ్రీనివాస్ హత్యచేయబడిన రాత్రే మరణించాడట. యిల్లంతా శోక సముద్రంలా వుంది" అని చెప్పాడు.

డిటెక్టివ్ శిరీష్ "గుడ్ వర్క్!" అని సారథి భుజం తట్టి

"సారథీ! యినస్పెక్టర్ గోపాల్‌ను బ్లడ్ రిపోర్టు తీసుకొని వెంటనే రమ్మని ఫోన్ చెయ్యి" అన్నాడు.

4

ఆ రోజు సాయంత్రం భైరవయ్యను, రాజును అరెస్టు చేశారు.

"అసలు భైరవయ్య మీద నీకెలా తోచింది?" అన్నాడు ఇనస్పెక్టర్ గోపాల్ తాపీగా సిగరెట్ వెలిగించుకుంటూ.

"మార్చురీలో శ్రీనివాస్ శవం చూచాం కదా! కంఠం సగంవరకూ కోయబడివుంది. డాక్టరు రిపోర్టును బట్టి పదునైన ఆయుధంతో జాగ్రత్తగా కొయ్యడంవల్ల రక్తం పోయి ప్రాణం పోయిందని వుంది. గుళ్ళో దొరికిన రక్తం శ్రీనివాస్ బ్లడ్ గ్రూప్‌తో సరిపోయింది.

మామూలుగా హత్యచేసే వారయితే పొడుస్తారు, లేదా నరుకుతారు. కాని ఇది అందుకు భిన్నంగా వుంది. పైగా శవం దొరికినచోట రక్తంలేదని నువ్వు చెప్పావు. దాంతో యిది ఏదో బలి తంతు అయివుంటుందా అనిపించింది. మనం నాగరికతలో ఎంత పురోగమించినా మూఢాచారాలు ఇంకా మనను వీడలేదు కదా! మారువేషంలో భైరవయ్యను కలుసుకున్నాను. నా అనుమానం బలపడింది.

రంగనాధంగారిని కలిశాను. భైరవయ్యకు వాళ్ళకు స్పర్థలేమైనా వున్నాయా అని అడిగాను. భైరవయ్య,

రాఘవయ్య దగ్గర బదులు పుచ్చుకుని బాకీ ఎగకొట్టడానికి ప్రయత్నించగా ఆ ఆటలు సాగనివ్వక బలవంతంగా వసూలుచేశారట. దానిమీద భైరవయ్య "హ్రాం! హ్రీం!" అని హేతకం చెయ్యబోగా రంగనాధంగారు నాలుగు ఉతికి తిక్క తీర్చారట.

అప్పటికి ఏమీ చెయ్యలేక భైరవయ్య మండిపడి "ఒరే! మీ అన్నదమ్ము లిద్దరి తీటా తీర్చకపోతే నా పేరు భూతాల భైరవయ్య కాదురా! చూసుకోండి నా తడాఖా?" అని బెదిరించాడట.

ఇది జరిగి కూడా చాలాకాలం అయిందట. భైరవయ్య ఎంత భూత మాంత్రికుడయినా ఒక కోడిని కొయ్యడానికి కూడా భయపడతాడట. యిది కూడా రంగనాధంగారే చెప్పారు.

కాబట్టి భైరవయ్య స్వయంగా పిల్లవాణ్ని చంపే ప్రసక్తి రాదు. యెవరిచేతనయినా చంపించాలి. దానికీ కారణాలు ఆరాతీశాను.

రాజుగారి కొడుకు అయిదేళ్లుగా తీరని వ్యాధితో బాధ పడుతున్నాడని తెలిసింది. పెద్ద పెద్ద వైద్యులంతా పెదవి విరిచారు. ఈ మధ్య భైరవయ్య చుట్టూ తిరుగుతున్నాడని తెలిసింది. సరే! యింతకూ రాజు స్టేట్‌మెంట్ తీసు కున్నావా?" అని ముగించాడు డిటెక్టివ్ శిరీష్.

ఇనస్పెక్టర్ గోపాల్, డిటెక్టివ్ శిరీష్‌కు థ్యాంక్స్ చెప్పి స్టేట్‌మెంట్ అందించాడు.

"నా కొడుకు గోపీ, శ్రీనివాస్ ఈడు వాడే! వాడికి పట్టిన రోగాన్ని స్పెషలిష్టులు కూడా నయం చెయ్యలేక పోయారు. నా బుద్ధి పెడత్రోవను బట్టి, భైరవయ్యను ఆశ్రయించాను. వాడికి రాఘవయ్య రంగనాధాలతో కక్ష

వుందని తెలిసి కూడా వాడి మాయలో పడ్డాను.

వాడు చెప్పినట్లే ఫోర్జరీ ఉత్తరం వ్రాశాను. అమ్మవారి గుడిలో నా చేతులారా శ్రీనివాస్ పీక కోసి, రక్తాన్ని కుండలో పోసి, వాడు చెప్పినట్లు అమ్మవారికి నివేదనచేసి ఆలయం ఆవరణలో పాతిపెట్టాను.

ఒక అమాయకుడి ప్రాణం తీసిన పాపం ఊరికే పోతుందా? ఆ రాత్రే నా గోపీ కూడా శ్రీనివాస్ దగ్గరకే వెళ్ళిపోయాడు. నా లాంటి పంచమహాపాతకుడు ముల్లోకాల్లోనూ కంచు కాగడావేసి వెతికినా దొరకడు.

రాజు."

తెలివిగా దొరికిన అవకాశాన్ని వినియోగించుకుని హత్యకు పురికొల్పిన నేరానికి భైరవయ్య మీద, ముక్కుపచ్చలారని బాలుణ్ని అమానుషంగా పొట్టను పెట్టుకున్నందుకు రాజుమీద కోర్టులో కేస్ ఫైల్ చేశాడు ఇనస్పెక్టర్ గోపాల్. □

అంతిమ ప్రయాణం?

సేఠ్ చమన్‌లాల్ మరణశయ్యపై ఉన్నాడు. అతని పరివారమంతా అతని మంచం చుట్టూ నిల్చుని ఉన్నారు. అతడి డ్రైవరు కూడా అక్కడే నిల్చుని ఉన్నాడు.

సేఠ్‌జీ కొంచెం బలం కూడదీసుకుంటూ అందరినీ చూస్తూ—"ఇక నేను వెళ్ళే సమయమైంది. జాగ్రత్తగా ఉండండి" అన్నాడు.

"కారును బయటకు తీయమంటారా సేఠ్‌జీ—?" అడిగాడు వెంటనే డ్రైవరు.

—బొగాపురం నాగేశ్వరరావు, మల్కకల్.

ఉదయం 11 గంటలకు డిటెక్టివ్ లాల్ పోస్ట్ చూస్తున్నాడు.

జాన్, లాల్ పనుల్ని పట్టించుకోకుండా సీరియస్‌గా అందమైన భాషలో గర్ల్‌ఫ్రెండ్‌కి ఉత్తరం టైపు చేస్తూ తంటాలు పడుతున్నాడు.

ఇంతలో ఫోను మ్రోగడం, కీ బోర్డుమీద జాన్ చేతి వేళ్ళు ఆగిపోవడం, రిసీవర్ అందుకోవడం క్షణంలో జరిగి పోయాయి....

"హల్లో, దిసీజ్ జాన్ హియర్!" అవతలి కంఠం విని, ముఖం చిట్లించి మళ్ళీ అన్నాడు జాన్: "అవును, యిక్కడే వున్నాడు.... దేనికి? అలాగా?....ఓహ్, నాతో చెప్పకూడదా? ఎందుకు? ...ఏమిటీ! నేను డిటెక్టివ్‌ని కానా! మీరు చాలా తప్పుగా భావిస్తున్నారు మాడమ్!...."

లాల్, జాన్ మాటలు శ్రద్ధగా వింటున్నాడు. జాన్ కాస్సేపు అవతలి మాటలు విని, వాదిస్తుండగా అతని ముఖం హఠాత్తుగా యెర్రబడింది.

"ఏమంది?" అడిగాడు లాల్.

"నోర్మూసుకొని రిసీవర్ నీ కిమ్మంది—డామిట్!"

జాన్ కసురుకుని రిసీవర్ విసిరాడు.

లాల్ రిసీవరందుకొని, "హల్లో, నేను లాల్‌ని మాట్లాడుతున్నాను. మీ రెవరు?" అన్నాడు.

"నా పేరు విమల. మీరు త్వరగా వచ్చి నన్ను రక్షిం చండి!" గట్టిగా అర్చింది అవతలి కంఠం, "త్వరగా రండి! క్షణం ఆలస్యం చేసినా పోలీసులు నన్ను పట్టుకుపోతారు! చెయ్యని నేరానికి బలిపశువుని చేస్తారు! లాల్! త్వరగా రండి, ప్లీజ్!"

లాల్ ముందుకువంగి అన్నాడు, "మిమ్మల్ని పోలీసు లెందుకు పట్టుకున్నారు? ఏం జరిగింది?"

"వీళ్ళకు పిచ్చిపట్టింది! నన్ను చాలా అసభ్యంగా ట్రీట్ చేస్తున్నారు! నేను ఆడదాన్ని —ఏమీ చేయలేని దాన్ననీ వాళ్ళధైర్యం! కాని—మీరు! మీరు వచ్చి....వీళ్ళ సంగతి చూస్తే—"

"ఆగండి, విమల. రిసీవర్ ఇన్‌స్పెక్టర్ చేతికివ్వండి!"

"ఇన్‌స్పెక్టర్ అన్నీ అబద్ధాలు కూస్తాడు!"

"పోలీసులు అబద్ధపుకేసులు బనాయించరు—కోర్టులో నవ్వులపాలవుతారు. రిసీవర్ అతనికివ్వండి!"

కొన్ని క్షణాల తర్వాత క్రైమ్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణన్ గొంతు పలికింది:

"గుడ్మార్నింగ్, లాల్! మీరు విమలను రక్షిస్తారా! ఆశపడకండి! సాక్ష్యాల్లోకెల్లా తిరుగులేని సాక్ష్యం మృతి చెందినవాడి సాక్ష్యం. మీరు దాన్ని బ్రద్దలుకొట్టి కొత్త పునాదులు వేయలేరు!"

లాల్ కళ్ళు విశాలమయ్యాయి: "హల్లో, కృష్ణన్. మీరు ఛాలెంజి చేస్తున్నట్లున్నారు! ఎలాటి సాక్ష్యం గురించి మీరు మాట్లాడేది? నోటిమాటా? చేతివ్రాతా? లేక ఏదైనా సంకేతమా?"

"చేతివ్రాత—హతుడు చనిపోతూ వ్రాశాడు—చనిపోతూ యెవరూ అబద్ధం చెప్పరు. ప్రక్కన సాక్షికూడా వున్నాడు."

లాల్ అన్నాడు, "హతుడు వ్రాశాడని మీ రెలా నమ్ముతున్నారు? ఆ సాక్ష్యం ప్రక్కనవున్న సాక్షి యెందుకు సృష్టించకూడదు? హతుడి దస్తూరీకి ప్రాముఖ్యం యివ్వకండి! చివరిశ్వాస వదుల్తూ వ్రాసేవ్రాతలు గజిబిజిగా వుంటాయి—ఎవరైనా సులభంగా వ్రాయవచ్చు."

"కానీ—హతుని ప్రక్కనవున్న సాక్షి అతని తండ్రి. తప్పుడుసాక్ష్యం సృష్టించే అవసరం అతనికి లేదు!" అన్నాడు కృష్ణన్.

"సరే, ఆ సాక్ష్యంవల్ల విమల ఏమవుతుంది?"

కృష్ణన్ నవ్వి అన్నాడు, "హంతకురా లవుతుంది.

చక్కా కోర్టుకెళ్ళి జడ్జీ వేసే బిల్లును జైల్లో చెల్లిస్తుంది."

"విమల హంతుడికేమవుతుంది?"

"ధర్మపత్ని అవుతుంది."

"అయితే ఆమె నిర్దోషి."

"ఎందుకు నిర్దోషి?"

"ధర్మపత్ని భర్తకు ద్రోహం తలపెట్టదు. ఒకసారి పురాణాలు తిరగేసి తెలుసుకోండి!"

"దిసీజ్ టూ మచ్! పిచ్చిగా మాట్లాడుతున్నారు! మీతో మాట్లాడే అవసరం నాకు లేదు! ఇందులో మీరేమీ చెయ్యలేరు!" అర్చాడు కృష్ణన్.

లాల్ నెమ్మదిగా అన్నాడు: "ఆవేశపడకండి, యిన్స్పెక్టర్. మనం శత్రువులమా ఏమిటి? మనమధ్య ఈర్ష్యా ద్వేషాలులేవు. అవునా? మీ నుండి ఇలాంటి ట్రీట్‌మెంట్ ఆశించం."

కృష్ణన్ అన్నాడు: "ఐయాం సారీ. ఈ కేసులో మీరు జోక్యం చేసుకొనడం నా కభ్యంతరం కాదు. గానీ మీ కుప యోగంలేదు. స్పష్టంగా తేలిపోతున్న కేసు...."

లాల్ నిట్టూర్చి అన్నాడు, "దయచేసి మేం వచ్చేవరకు ఆగండి. విమలను యింకా రెచ్చగొట్టకండి. ఆమె మా సహాయం అర్థించింది. ఆమెను రక్షించడానికి మేమేం చేయగలమో చూద్దాం. రిసీవర్ ఆమెచేతి కివ్వండి...."

"హల్లో, విమల! మీరు గాభరాచెందకండి. మేం వెంటనే వస్తున్నాం. ముందు నాకో విషయం చెప్పండి: మీ ఖర్చు, మా శ్రమా తగ్గుతాయి. నిజంగా మీరేమీ చెయ్యలేదా?....సరే, మీరు దేవుడ్ని సాక్షిగా ఎన్నుకున్నారు. వాడ్ని మీరు బలవంతంగా సాక్షిని చేస్తే తర్వాత తిరగబడతాడు జాగ్రత్త!"

లాల్ అడ్రసు విని, థాంక్స్ చెప్పి రిసీవర్ పెట్టేశాడు.

"జాన్! కేసేమిటో దార్లో చెప్తాను. ముందు నా వెంట నడువ్!"

2

అశోక్‌నగర్‌లో ఒక యింటిముందు కారుదిగి లోనికి నడుస్తోంటే, ద్వారం దగ్గరవున్న సార్జెంట్ పలకరించాడు.

"గుడ్మార్నింగ్ సర్. లోనికెళ్ళండి. వాళ్లు మీ కోసమే యెదురుచూస్తున్నారు."

డిటెక్టివ్‌లు యింట్లోకి ప్రవేశించి ఒక గదిలోకెళ్లారు. అక్కడ కృష్ణన్‌తో బాటు పాతికేళ్ళ విమల, యాభై ఏళ్లు పైబడ్డ మరో వ్యక్తీ వున్నారు.

"కమాన్ ఫ్రెండ్స్!" కృష్ణన్ అన్నాడు, "ఈయన హతుడితండ్రి, విమల మామగారు—కామేశ్వరరావు."

లాల్ గదిలో చుట్టూచూసి, "శవం ఏది?" అన్నాడు.

"అఫ్జల్‌గంజ్ మార్చ్యురీలో."

లాల్ ముఖం యెర్రబడింది, "మేం వచ్చేలోపున తరలించేశారా?"

కృష్ణన్ నవ్వాడు. "మీరిక్కడ విమలని చూడ్డానికి వచ్చారు. శవం చూడాలనుకొంటే కాస్త ముందు రావలసింది—సరూర్‌నగర్‌లో మిస్టర్ రావ్ ద్రాక్షతోటకు."

"హత్య అక్కడ జరిగిందా?"

"అవును. ద్రాక్షతోటలో శవం—కంఠం నుంచి తలలోకి బుల్లెట్ గాయం—ధారగా కారిన రక్తం నేలలో యింకి యింకా అలాగే వుంది. కాబట్టి హత్యాస్థలాన్ని స్పష్టంగా గుర్తించవచ్చు."

లాల్ విమలను చూశాడు. ఆమె లాల్‌ని దీనంగా చూసింది.

"లాల్! ఈ హత్య నేను చెయ్యలేదని ఎలా చెప్పాలి? నా మాట లెవరు నమ్ముతారు? ఆయన చనిపోతూ నా మీద పగ తీర్చుకొన్నాడు!"

"మీ మధ్య సంబంధాలు పగ రగిలేంతగా చెడి పోయాయా?"

విమల విసురుగా అంది: "పగ! అదెలా పుట్టింది! ఆయన ఓర్వలేనితనంలోంచి! ఆయన మూర్ఖత్వంలోంచి! నేను అందంగా వుంటానని యెన్నడూ అనుకోను! కానీ నేను చాలా అందగత్తెనని పొగడుతుంటాడు! నా లాటి భార్య తనకు దొరకడం అదృష్టమని గర్వపడతాడు. మురిసిపోతాడు.

"అంతలోనే నా అందం ఇంకెవరి స్వంతం అవు తుందోనని యెక్కడలేని దిగులు! నేను రెక్కలు కట్టుకొని యెవరి గూటిలో వాలుతానోనని చెప్పలేని విచారం!

"నేను చదువుకున్నదాన్ని. స్త్రీ పురుష విచక్షణ లేకుండా సోషల్‌గా తిరగటం అలవాటు. అలా తిరిగినంత మాత్రాన కారెక్టర్ దెబ్బతింటుందా? నా అందం చెదిరి పోతుందా? ఎప్పుడూ మా యిద్దరిమధ్య యిదే వాదన. కీచు లాటలలో నేను విసిగి-విసిగి-విసిగి—ఒక్కోసారి చచ్చి పోవాలన్పించేది!

"కానీ— మగవాళ్ళ నైజం నాకు తెలుసు" విమల ఆగకుండా యింకా చెప్పుకుపోతోంది. "అందమైన భార్య లభిస్తే సుఖసంతోషాలు పంచుకోవటం చేతగాక సాడిస్టు లుగా మారిపోయి అనుక్షణం అనుమానాలతో వేధిస్తుం టారు! నే నిలాంటి వలయంలోనే చిక్కుకొన్నాను. రెండేళ్లు సహించాను. ఇంకెంతకాలం సహించను? మాన సిక క్షోభకు మించిన శిక్ష ఏముంది?

పేరు టైగర్! పోలీసులుండే చోటు
పసిగట్టి తెలుపుతుంది!!

"అందుకే విడాకులతో బయటపడాలనుకొన్నాను" అంది విమల ఆవేశం అణచుకొంటూ, "ఆ విషయం ఆయనకు చెప్పాను. విడాకులతో పరువుతీస్తావా అనర్చాడు. ఈ గొడవ మూడురోజులుగా సాగుతోంది! కానీ-ఇంతలో యిలా జరిగింది! విడాకులకు బదులు విధవనై జీవితాంతం మరోశిక్ష అనుభవించడానికి సిద్ధంగా వున్నాను. మీరు నన్నెలా రక్షిస్తారు, మిస్టర్ లాల్?"

లాల్ కృష్ణన్ వైపు తిరిగాడు.

"అసలు జరిగిందేమిటి ఇన్‌స్పెక్టర్?"

కృష్ణన్ భారంగా నిట్టూర్చి, మౌనంగా తలవంచుకొని కూర్చున్న కామేశ్వరరావుని చూశాడు. ఆ తర్వాత అన్నాడు:

"రావుగారి కుమారుడు సుధీర్‌తో విమలకు రాత్రి ఘర్షణ జరిగింది. చాలా పెద్దగా కేకలు, అరుపులూ వీధి అంతటా వ్యాపించాయి...."

రావ్ వాళ్ళని శాంతపర్చడానికి శాయశక్తులా ప్రయత్నించి విఫలమయ్యారు. సుధీర్ ఉద్రేకంతో వూగిపోతూ, విమలమీద చేయిచేసుకున్నాడు. ఆ తర్వాత తండ్రి అడ్డగించినా ఆగకుండా కారెక్కి ఆవేశంగా వెళ్ళిపోయాడు."

"ఎక్కడికి?"

"ద్రాక్షతోటకు. విమలతో గొడవ జరిగిన రోజు అతనక్కడికి వెళ్ళిపోవడం పరిపాటి. అలానే రాత్రి కూడా వెళ్ళి అక్కడే పడుకున్నాడు. రావ్, విమల యింట్లోనే వుండిపోయారు. అంత గొడవ జరిగినా, సుధీర్ కొట్టినా, విమల ఏడ్వలేదు. ఆమె రావ్‌ని కోపంతో తిట్టి, అలాటి కొడుకుని కన్నందుకు దూషించింది. మొగుడు కొడితే మూలకూర్చొని ఏడ్వడానికిది తాతలనాటి కాలం కాదని— గదిలోకెళ్ళి ధడాలున తలుపులేసుకొంది."

"ఆ తర్వాత?"

"రాత్రి ఏమీ జరగలేదు. ఈ ఉదయం ఆమె లేచి రావ్‌కి తెలియకుండా సరూర్‌నగర్ కెళ్ళింది—తొమ్మిది గంటలకు. అప్పుడు ద్రాక్ష తోటలో సుధీర్ కేబిన్‌రూంలో కూర్చొని అక్కడ పనిచేసే మనిషి రాజుతో మాట్లాడుతున్నాడు. ఇంతలో విమలను చూసి అతను తటాలున బయటకొచ్చి కొట్టబోయాడు.

"రాజు మధ్యలో వెళ్ళి నివారించబోతే, అతన్ని దూరంగా విసిరి లాగి తన్నాడు. రాజు భయపడి అక్కడి నుంచి పారిపోయి యిక్కడకొచ్చి రావ్‌తో చెప్పాడు.

"రావ్ వెంటనే ఆటోలో అక్కడికెళ్ళేసరికి సుధీర్ నేలమీద బోర్లా పడివున్నాడు. విమలలేదు. సుధీర్ తల చుట్టూ రక్తం మడుగుకట్టింది. అతని ప్రక్కన రివాల్వర్ వుంది. రావ్ గాభరాగా వెళ్ళి సుధీర్‌ని తట్టి పలకరించాడు.

సుధీర్ ఆగమని చేత్తో సైగచేశాడు.

"అతని కంఠంలో రంధ్రం ఏర్పడింది. ఆ రంధ్రం తలపైవరకూ వుంది. అతను మాట్లాడే స్థితిలో లేడు. 'నిన్నిలా యెవరు చేశారు సుధీర్?' అని రావ్ అడిగారు. అతను మళ్ళీ సైగలు చేశాడు. రావ్ గ్రహించి వెంటనే జేబులోంచి కాయితం, కలం తీసిచ్చాడు."

"ఆ తర్వాత?"

"సుధీర్ అలాగే పడుకొని, తల నేలకానించి, అదుపు తప్పుతున్న చేత్తో కాయితంమీద వ్రాశాడు...."

"ఏం వ్రాశాడు?"

"విమల షూట్‌చేసిందని" కృష్ణన్ ఆ కాయితం తీసి చూపించాడు, "ఆ తర్వాత వెంటనే అతను ప్రాణాలు విడిచాడు. రావ్ మాకు ఫోన్‌చేసి, హత్యగురించి చెప్పారు. మేం శవాన్ని మార్చ్యురీకి పంపి, విమలను అరెస్ట్ చెయ్యడానికిక్కడ వచ్చాం."

లాల్ అంతా విని జాన్‌ని చూశాడు.

జాన్ విమలను అడిగాడు, "మీ రక్కడికి రివాల్వర్ తీసికెళ్లారా?"

ఆమె అడ్డంగా తలూపింది, "లేదు."

"ఆ రివాల్వరెవరిది?"

"ఆయనదే."

"ద్రాక్షతోటకు మీ రెందుకెళ్లారు?"

"ఆయన్ని పిలవడానికి. ఆయనకు ఆవేశం ఎక్కువ. నా ప్రతిమాటా ఆయన్ను రెచ్చగొడ్తుంది. రాత్రంతా నాకు నిద్రపట్టలేదు—ఆయన గురించే ఆలోచించాను. అసలాయనతో ఘర్షణపడకుండా లాయర్ సహాయంతో దావా వేస్తే బాగుంటుందనుకొన్నాను.

"అందుకే అక్కడికెళ్ళాను. అంతా మర్చిపొమ్మని చెప్పి ఇంటికి తీసుకురావాలనుకున్నాను. కానీ—నన్ను చూసి ఆయన—పెద్దగా అరుస్తూ కొట్టారు. రాజును కూడా కొట్టారు. అతనక్కడ నుంచి పారిపోయాడు. తర్వాత నేను కూడా వచ్చేశాను."

"సరే, ఇన్‌స్పెక్టర్, మనం ఒకసారి శవాన్ని చూద్దాం. అంతవరకు విమలను నా బాధ్యతమీద వదిలేయండి. ఏమంటారు?" అన్నాడు లాల్.

కృష్ణన్ యిబ్బందిగా చూసి, అనాలోచితంగా తలూపాడు.

3

అఫ్జల్‌గంజ్ మార్చ్యురీలో డిటెక్టివ్‌లు కారు దిగి, శవాల గదిలోకి నడిచారు.

కృష్ణన్ టేబిల్‌మీద వున్న శవాన్ని గుడ్డ తొలగించి చూపించాడు.

సుధీర్ శవం తలనుంచి మొండెంవరకు రక్తసిక్తమై వుంది. కంఠంనుంచి తలలోకి ఊర్ధ్వముఖంగా ఏర్పడ్డ బుల్లెట్ రంధ్రం స్పష్టంగా కన్పిస్తోంది. బుల్లెట్ ప్రయాణించిన దిశను లాల్ జాగ్రత్తగా గమనించాడు. బుల్లెట్, కంఠంలో ఏటవాలు దిశలో, భూతలంనుంచి కొంత కోణంలో ప్రయాణించింది. కంఠం దగ్గర ఏర్పడ్డ రంధ్రం చుట్టూ ఆయిల్, గన్‌పౌడర్‌ల అవశేషాలు కన్పిస్తున్నాయి....

లాల్ మెదడులో ఓ మెరుపు మెరిసింది. ఇంతలో డాక్టర్ రఘునాథ్ ప్రవేశించాడు.

"గుడ్మార్నింగ్ డాక్టర్!" లాల్ అన్నాడు.

డాక్టర్ చెప్పాడు. "చావు రివాల్వర్ షాట్ వల్ల



సంభవించింది. ఇన్‌స్పెక్టర్ నాకో బుల్లెట్ చూపించారు. అది హతుడి కంఠం నుంచి తలగుండా దూసుకెళ్ళి బయట దూరంగా పడింది. చావు తక్షణం సంభవించలేదు. సాధారణంగా తలలో గుండు దూరితే కొన్ని క్షణాల్లో చావు సంభవిస్తుంది. ఈ కేసులో బుల్లెట్ బయటికి దూసుకు వెళ్ళడంవల్ల చావుకు కొంత వ్యవధి పట్టివుండవచ్చు— ఇది నా రఫ్ అయిడియా. నిశ్చితాభిప్రాయం పోస్టుమార్టమ్‌లో."

"అంటే—బుల్లెట్ తలలో ఇరుక్కుంటే చావు తక్షణం సంభవిస్తుందా?" జాన్ అడిగాడు.

"అవును—అతి సున్నితమైన మెదడు భాగాలు బుల్లెట్‌ని తమలో ఇముడ్చుకోలేవు. వాటికంత శక్తి లేదు."

"మరి—బుల్లెట్ బయటికి దూసుకెళ్ళినప్పుడు మెదడులో కణాలు విచలించి పోతాయి కదా? ఆ క్షణంసేపు

షాక్‌ని తట్టుకొనే శక్తి మనిషికుంటుందా?"

"వుండవచ్చు, వుండకపోవచ్చు. అది శరీర తత్వాల మీద—బుల్లెట్ తాకిన భాగాల మీద ఆధారపడి వుంటుంది. అయితే ఈ కేసులో హతుడు ఆ గాయాన్ని సుమారు ఇరవై నిమిషాలసేపు తట్టుకోగల్గాడు."

"ఎలా చెప్తున్నారు?"

"హత్యా స్థలానికి హతుడు తండ్రి వెళ్ళి సాక్ష్యాల సేకరించగల్గాడు గనుక."

"ఆల్ రైట్, ఇప్పుడు మనం కూడా హత్యా స్థలానికి వెళ్దాం!" అన్నాడు లాల్.

"ఇప్పుడు దేనికి?" కృష్ణన్ అడిగాడు.

"ఈ హత్యలో రివాల్వర్ ఉపయోగించిన తీరు నా కనుమానం కల్గిస్తోంది—"

4

సరూర్‌నగర్‌లో కామేశ్వరరావు ద్రాక్షతోట అయిదెకరాల విస్తీర్ణంలో వుంది.

పక్షుల మధురమైన కూతలతో, పడమరవైపు నుండి వీచే చల్లని గాలితో వాతావరణం అహ్లాదకరంగా వున్నా: కొన్ని గంటల క్రితం హత్యజరిగిన ఆ ప్రాంతంలో ఎవరికైనా గుండెలదురుతాయి—డిటెక్టివ్‌లకీ, పోలీసులకూ తప్ప.

తోటమధ్యలో కేబిన్‌కి పదడుగుల దూరాన, సుధీర్ దేహంనుండి స్రవించిన రక్తం యింకా అలాగే వుంది—నేలలో యింకి, క్రమంగా నల్లబడుతూ.

అందరూ అక్కడికి చేరుకున్నారు.

లాల్ ఆ స్థలాన్ని పరీక్షగా చూశాడు.

రక్తపుమడుగు ప్రక్కన నేల చెదిరివుండటం కన్పి

స్తోంది. దాన్ని క్రింద కూర్చొని ఇంకా పరీక్షగా చూశాడు.

"వెల్ శవస్థితి ఎలా వుంది?"

"రక్తపు మడుగులో తల వుంది. కాళ్ళు గేటువైపు కున్నాయి." కృష్ణన్ అన్నాడు.

"బోర్లా పడివుందా?"

"అవును."

"రివాల్వర్ ఎక్కడ వుంది?"

నేల చెదిరిన భాగానికి కొంత దూరంలో చూపించాడు కృష్ణన్. అది శవస్థితి ప్రకారం కుడిచేతివైపు వుంది.

లాల్ లేచి నిలబడి అందర్నీ నవ్వుతూ చూశాడు:

"పూర్ సుధీర్! అబద్ధపు సాక్ష్యంతో భార్యను హంతకు రాల్నిచేసి కసి తీర్చుకోవాలనుకున్నాడు!"

"ఏమిటి మీరనేది?" ఆతృతగా అన్నాడు కృష్ణన్.

"సుధీర్‌ని విమల షూట్ చెయ్యలేదు. ఎవరూ చేయ లేదు. ఇది ఆత్మహత్య."

"మిస్టర్ లాల్! విమల మెప్పు పొందడానికి ఎత్తులు వేస్తున్నారా?"

"మాక్కావల్సినది విమల మెప్పు కాదు. నిందితుని విషయంలో న్యాయం."

కృష్ణన్ పక పక నవ్వాడు: "న్యాయమా; యెలా చేకూరుస్తారు? హతుడి సాక్ష్యం చూశారా? దాన్ని దేవుడు కూడా అబద్ధమని నిరూపించలేడు!"

లాల్ చిన్నగా నవ్వి, వదులుగా వున్న కృష్ణన్ నడుము బెల్టుని బిగిస్తూ అన్నాడు: "యిన్‌స్పెక్టర్, ప్రఖ్యాత బాలస్టిక్స్ నిపుణుడు ఛార్లెస్ వాంబర్గ్ యేమంటాడో తెలుసా?"

"ఏమంటాడు?"

"ఆయుధం అబద్ధం చెప్పదు: ఆయుధం ప్రయోగించి

నప్పుడు యేర్పడిన గాయం, ఆయుధం ఉపయోగించిన తీరును వెల్లడి చేస్తుంది.

హత్యకేసులో ఆయుధం ప్రయోగించిన తీరుకు యెక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి. కోణం, దూరం, లక్ష్యం, శక్తి, వీటిని జాగ్రత్తగా; సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే కేసు కొంతవరకు సఫలం కావచ్చు.

"తుపాకి ప్రేల్చడమంటే తుపాకి మందులో వుండే వినాశకరమైన శక్తిని తుపాకి ప్రేల్చిన వ్యక్తినుండి లక్ష్యము వరకూ దూసుకుపోతున్న గుండుద్వారా సంక్రమణం చేయడం అన్నమాట.

"ఇప్పుడు—ఈ కేసులో హత్యకు కారణమైన రివాల్వర్ బుల్లెట్‌లోని వినాశకరమైన శక్తి గురించి చెప్పుకుందాం."

లాల్ ఒక్కక్షణం ఆగి, అందరినీ చూసి మళ్ళీ అన్నాడు:—

"బుల్లెట్ శక్తి, దాని వేగం—బేస్ పౌడర్‌లో వుండే రేణువుల సంఖ్య, వాటి బరువు, బుల్లెట్ వ్యాసార్థం, ఆకృతి మొదలైనవాటిమీద ఆధారపడి వుంటాయి.

"ప్రతి బుల్లెట్ తన ప్రయాణ కాలంలో గాలి నిరోధానికి కొంత వేగం కోల్పోతుంది. ఈ వేగం దూరాన్ననుసరించి వుంటుంది. వేగం యెంత హెచ్చుగా వుంటే తాకిడి అంత తీవ్రంగా వుంటుంది.

"ఆ తర్వాత లక్ష్యానికి తాకి లోనికి చొచ్చుకుపోగల శక్తి ప్రధానంగా దాని ఆకృతిమీద ఆధారపడివుంటుంది. శంఖాకారంలో మొనదేలివుంటే సులువుగా చొచ్చుకుపోతుంది. ఇలా చొచ్చుకుపోయినప్పుడు దేహంలోని కణజాలం హైడ్రాలిక్ షాక్‌కి గురవుతుంది.



"అయితే, ఈ కణజాలం మెత్తని కణాలతో ద్రవంతో కూడినదై వుండాలి. ఉదాహరణకు ఒక సాధారణ-22 బుల్లెట్‌ను రసాలూరే ఆపిల్ పండులోకి షూట్ చేస్తే అది అన్ని వైపులా విచ్చుకుపోయి చెల్లా చెదురవుతుంది. అదే ఆలుగడ్డలో షూట్ చేస్తే కేవలం రంధ్రం మాత్రమే ఏర్పడుతుంది."

లాల్ మాటలు డాక్టర్, యిన్‌స్పెక్టర్ శ్రద్ధగా వింటున్నారు.

"డాక్టర్, ఇక ఈ కేసులో రివాల్వర్ ప్రయోగించిన కోణం గురించి చెప్పుకుందాం. బుల్లెట్ గాయం కంఠంలోంచి నిలువుగా తలలోకి ఏర్పడింది. బుల్లెట్ వెళ్ళే మార్గంలో అడ్డంకులు లేనంత దూరం సూటిగానే పోతుంది. ఎక్కడైనా అడ్డంకి యెదురైతే అది ప్రయాణించిన దూరం తక్కువవున్నకొద్దీ ఛేదించుకొని వెళ్ళే శక్తి యెక్కువవుతుంది. ఈ కేసులో బుల్లెట్ కంఠంలోంచి యేమాత్రం వంపు లేకుండా సూటిగా కపాలాన్ని ఛేదించు

కొని బయట పడిందంటే, అది ప్రయాణించిన దూరం చాలా తక్కువని తెలిసిపోతోంది."

"అవును."

"వెల్, ఇక్కడ హతుడి కంఠం—బుల్లెట్ రెండు వేర్వేరు లక్ష్యాలు. రెండు లక్ష్యాలు ఒకదాన్ని ఒకటి తాకినప్పుడు వాటి మధ్యకోణం దేనిమీద ఆధారపడి వుంటుంది?"

"అవి ప్రయాణించి తాకిన దిశమీద."

"హతుడి కంఠంలో బుల్లెట్‌గాయం ఏ దిశలో వుంది?"

"ఏటవాలు దిశలో."

"పై నుంచా క్రిందినుంచా?"

"క్రిందినుంచి."

"గాయంగురించి యింకా చెప్పండి."

"గాయం చుట్టూ గన్ పౌడర్ తాలూకు నుసివుంది. ఆయిల్ మరకలు కూడా వున్నాయి. ఇంకా జాగ్రత్తగా చూస్తే—గాయం చుట్టూ బ్యారెల్‌వల్ల చర్మంలో ఏర్పడ్డ గాటు కూడా కన్పిస్తుంది."

"వెరీవెల్!" అన్నాడు లాల్, కృష్ణన్ వైపు తిరిగి "ఇన్‌స్పెక్టర్, రివాల్వర్‌కూ హతుడికీ మధ్య దూరం యెంతవుందో వూహించగలరా?"

"డాక్టర్ మాటల్నిబట్టి క్లోజ్‌రేంజి అని అర్థమవుతోంది—దూరం శూన్యం!"

జాన్ వెంటనే అర్చాడు: "అయితే? సుధీర్ రివాల్వర్ కంఠానికి ఆనించి ట్రిగ్గర్ లాగాడా? ఆ పని విమల యెందుకు చెయ్యకూడదు?"

"విమల యేమీ చెయ్యలేదు. బుల్లెట్ భూతలానికి ఏటవాలు దిశలో, 45 డిగ్రీల కోణంలో ప్రయాణించింది.

ఇన్‌స్పెక్టర్, బుల్లెట్ ఆకృతి యెలా వుంది? మొనదేలి వుందా?"

"లేదు—గుండ్రటి తలం."

లాల్ ముఖంలో విజయగర్వంతో కూడుకొన్న మంద హాసం చోటు చేసుకుంది.

"లుక్ జంటిల్‌మెన్! ఒక్కసారి ఈ నేలను చూడండి. హత్య—నో—ఆత్మహత్య జరిగిన స్థలం! రక్తపు మడుగు ప్రక్కన మట్టిలో స్పష్టంగా కన్పిస్తున్న రివాల్వర్ బట్ గుర్తు! చూస్తున్నారా? అదెలా ఏర్పడింది?"

"ఎలా?" కృష్ణన్ అడిగాడు.

"సుధీర్ ఇక్కడ బోర్లా పడుకొని రివాల్వర్ నేలమీద నిటారుగా వుంచి, బ్యారెల్ మీద కంఠం ఆనించాడు. అతను చాలాసేపు చావో బ్రతుకో తేల్చుకోడానికి సందేహించాడు. అందుకే గాయం చుట్టూ బ్యారెల్ వత్తిడివల్ల గాటు యేర్పడింది—చివరికతను ట్రిగ్గర్ లాగేశాడు. బుల్లెట్ తలం గుండ్రంగావున్నా అది ప్రయాణించిన దూరం బహు తక్కువ కాబట్టి సులువుగా కంఠంలోంచి తలలోకి, ఆ తర్వాత బయటికి దూసుకెళ్ళింది—

"కానీ—డాక్టర్—అతను ఇరవై నిమిషాలు బుల్లెట్ గాయాన్ని భరించడాని మీరే ఆధారంతోనూ నిరూపించ లేరు. దేహంలో మెదడు అతి సున్నితమైన భాగం. మెదడులో బుల్లెట్ దూరితే ఒకటి, రెండు నిమిషాలకన్నా బ్రతకడం కష్టం.

"ఈ సంఘటన రావ్ ఇక్కడికి చేరుకున్న కేవలం రెండు నిమిషాల క్రితమే జరిగింది. రివాల్వర్ షాట్ అతను తప్పక విని వుంటాడు. కాని, కుమారుడి మాటలు

తెలుసుకున్నాక ఆ విషయం చెప్పకూడదని నిశ్చయించు కున్నాడు."

"ఎందుకు?"

"తను షాట్ విన్నట్టు చెప్తే, విమల షూట్ చేసి వుంటే, ఆ పరిసరాల్లోనే ఆమె అతని కంటపడి పట్టుబడి పోతుంది. కాని—ఆమె అతను రాకముందు పావుగంట క్రితం వెళ్ళిపోయింది కాబట్టి కుమారుడి సాక్ష్యం అబద్ధ మవుతుంది. సుధీర్ అబద్ధం వ్రాశాడని అతనికి తెలుసు. అయినా కుమారుడి చావుకు పరోక్షంగా కారణమైన కోడలిమీద ఆ విధంగా కసి తీర్చుకోవాలనుకున్నాడు."

"కానీ — సుధీర్ ప్రాణాలెందుకు తీసుకున్నాడో అర్థంగావడంలేదు!" అన్నాడు కృష్ణన్.

"భార్య విడాకులకోసం కోర్టుకెక్కి ఇంటి పరువు వీధి పాలుకావడం అతను భరించలేడు. ఆమె నిర్ణయం మార్చు కోదు, అతను ఒప్పించలేడు. కనుక చావే శరణ్య మను కున్నాడు. ఛస్తూ భార్యమీద పగ తీర్చుకోవాలనుకున్నాడు. కాబట్టి, ఇన్‌స్పెక్టర్, మీరా హతుడి సాక్ష్యాన్ని నమిలి మ్రింగేయండి!" అన్నాడు లాల్. □

ముక్కు మూసుకున్న విగ్రహం?

"ఇక్కడున్న ఈ మంత్రిగారి విగ్రహం ముక్కెందుకు మూసుకున్నారు."

"ఈ వీధికి వచ్చినప్పుడల్లా ఆయన ముక్కు మూసు కొని వచ్చేవారట. అందుకని ఇలా విగ్రహాన్ని స్థాపిం చారు."

—చాగాపురం నాగేశ్వరరావు, మల్లికల్.

కోట్లలో విషం

వాణిశ్రీ

ఇనస్పెక్టర్ జయసింహ హత్యజరిగిన స్థలానికి వెళ్ళేసరికి ఉదయం పది దాటింది.

జనం గుంపుగా శవంచుట్టూ మూగివున్నారు.

గట్టుమీద నిల్చుని క్వారీలోకి చూశాడు. దాదాపు వంద గజాలు లోతుగావుంది క్వారీ. సన్నగాకొట్టి గుట్టలుగా

పేర్చిన కంకర-లోడింగ్ చెయ్యడానికి సిద్ధంగా వున్నాయి.

రాళ్ళు కొట్టే పనివాళ్ళు పని యింకా మొదలు పెట్టి నట్లుగాలేదు. స్పాట్‌లో శవం వుండగా చూస్తూ పనిచెయ్య బుద్ధికావడం లేదనుకున్నాడు.

శవం బోర్లా పడివుంది.

'కుర్రవాడే' అనుకున్నాడు.

క్వారీలోకి దిగడానికి పనివాళ్లు ఏర్పాటుచేసుకున్న కాలి దారివుంది. ఇనస్పెక్టర్ నెమ్మదిగా దిగసాగాడు. ఒకటి రెండుసార్లు బూటు జారింది. 'అలవాటు లేనివాళ్లు దిగడం కష్టమే' అనుకున్నాడు.

ఇనస్పెక్టర్ని చూసి శవంచుట్టూ నిల్చున్నవాళ్ళు జరిగి దారి యిచ్చారు.

"ఎవరు నాకు ఫోన్‌చేసింది?" ప్రశ్నించాడు.

తెల్లటిషర్టు, పంచె కట్టుకున్న మనిషి ముందుకు వచ్చి "నేనే సార్?" అన్నాడు.

అతనికి ఏభై ఏళ్ళుంటాయి. కళ్ళకి భూతద్దాల్లాంటి కళ్లద్దాలున్నాయి. మనిషి నల్లగావున్నాడు. చాలసేపు ఎండలో నిల్చోని వుండడంవల్ల ముఖం పీక్కుపోయి వుంది.

"మీ పేరేనా ముకుందరావు?"

"అవును సార్!"

"మిల్క్ ప్రాజెక్టులో ఎకౌంటెంట్ కదూ!"

"అవును సార్!"

"ఇక్కడ శవంవున్న సంగతి ఎవరు చెప్పారు మీకు?"

"గంగులు."

"గంగులు ఎవరు?"

"అడుగో అతనే సార్!" చెయ్యెత్తి చూపించాడు. నల్లగా దృఢంగావున్న పాతికేళ్ళ కుర్రాడు కనిపించాడు.

"గంగులూ యిలా రా!" ముకుందరావు కేకవేశాడు.

గంగులు పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వచ్చాడు.

"శవాన్ని ముందు చూపింది నువ్వేనా?"

"అవునయ్యా! రోజూ పొద్దున్నే ఆరింటికల్లా చద్దన్నం మూటకట్టుకుని వస్తుంటాను. అట్లాగే ఈ రోజూ వచ్చాను. పైనుంచి చూపి యెవరో నిద్రపోతున్నారనుకున్నాను. తీరా వచ్చి చూస్తే నెత్తుర్లో వుండాడు. పరుగెత్తి వెళ్ళి ముకుందరావుగారితో చెప్పాను" అన్నాడు గంగులు.

"ముకుందరావుగారు నీకు తెలుసా?"

"గంగులు మా మిల్క్‌ప్రాజెక్టులో కొన్నాళ్ళు పని చేశాడు సార్!" ముకుందరావు అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ జయసింహ సిగిరెట్ వెలిగించి శవాన్ని పరీక్షగా చూశాడు.

అతనికి నిండా పాతికేళ్లు వుండవు. కర్లింగ్ హెయిర్. శరీరం యెర్రగావుంది. ముఖం సరిగా కన్పించడంలేదు.

"ముకుందరావుగారూ ఇతను మీ ఫ్యాక్టరీలోనే పని చేస్తున్నాడా?" ప్రశ్నించాడు ఇనస్పెక్టర్.

"డెయిలీ వేజెస్‌మీద పని చేస్తున్నాడు."

"ఎంత కాలం నుంచి?"

"దాదాపు రెండు నెలలనుండి."

"ఇతని పేరు."

"మురళి సార్! చాలమంచి కుర్రాడు. డెయిలీ వేజెస్‌లో పనిచేస్తున్నా ఆఫీసులోనే పని చేయించుకుంటున్నాం."

"ఎందుకని?"

"చదువుకున్న కుర్రాడు కదా అని."

"ఎంతవరకూ చదువుకున్నాడు?"

"బి. ఏ."

"ఐ. సీ."

మిల్కు ప్రాజెక్టులో పనిచేసే వాళ్లు చాలమంది శవాన్ని చూడటానికి వస్తున్నారు, పోతున్నారు.

"అతన్ని గురించి మీకు తెలిసింది చెప్పండి" అన్నాడు ఇనస్పెక్టర్.

"నాకు అతన్ని గురించి యెక్కువ తెలియదు సార్! మంచివాడు. చెప్పిన పని శ్రద్ధగా చేసేవాడు."

"అదికాదు నేను అడిగేది. ఎలా ప్రవర్తించేవాడు? అతనికి విరోధులు ఎవరైనా వుండేవారా?"

"ఏమోసార్! అతను మా కింకా కొత్తవాడు. అతను ఎవరితోనూ పోట్లాటపెట్టుకున్నట్లు నా దృష్టికి రాలేదు."

"విరోధులు వుండడానికి పోట్లాటలు పెట్టుకోనవసరం లేదు. ఏ ఆడపిల్లతోనైనా సంబంధం వుంటే చాలు. ఆటోమాటిక్‌గా శత్రువులు తయారవుతారు."

ముకుందరావు కొస్త తడబడ్డాడు.

"ఆ విషయాలు నాకు తెలియదు సార్!"

"అతని అడ్రస్ మీకు తెలుసా? వాళ్ళ వాళ్ళకి తెలియజేశారా?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"కరెక్టు అడ్రెస్ తెలియదు సార్! వాళ్ళనాన్న, అమరేశ్వరరావు లాయర్‌వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడని మాటల సందర్భంగా చెప్పాడు. అది గుర్తొకొచ్చి టెలిగ్రాం యిచ్చాను."

ఇంతలో పైన జీప్‌వచ్చి ఆగిన శబ్దం వినిపించింది.

సర్కిల్ ఇనస్పెక్టర్, ఫోటోగ్రాఫర్, కానిస్టేబుల్సు వస్తూ కనిపించారు.

జయసింహా సెల్యూట్‌చేసి వివరాలు చెప్పసాగాడు.

ఫొటోగ్రాఫర్ వివిధ కోణాల్లో శవాన్ని ఫొటోలు తీయ



సాగాడు.

ఫార్మాలిటీస్ పూర్తయినాక శవాన్ని మార్చురీకి పంపించారు.

2

హోటల్ దుర్గా కౌంటర్లో కూర్చున్న నాగరాజు హడావుడిగా వచ్చిన రాయప్ప చెప్పిన విషయం విని ఎగిరి పడ్డాడు.

"ఈజిట్?" ఆశ్చర్యంతో అన్నాడు.

"అవున్నా! మురళి శవాన్ని టాక్సీలో తీసుకొచ్చారు. ఇంకొక గంటలోనే స్మశానానికి తీసుకెళ్తారు. ఎక్కువసేపు వుంచడానికి వీల్లేదనీ, చెడిపోయిందనీ వాళ్ళ బావగారు అంటూవుంటే విన్నాను" అన్నాడు డిటెక్టివ్ రాయప్ప విచారంగా.

"ఎందుకు చచ్చిపోయాడట! నాకు నమ్మబుద్ధిపుట్టడం లేదు" అన్నాడు నాగరాజు.

"ఎవరు నమ్మినా నమ్మకపోయినా యిక మురళిలేడు అనేది నిజం. ఆలస్యం చెయ్యకు పోదాం. వివరాలు

అక్కడకు వెళ్తేగాని తెలియవు" అంటూ తొందర పెట్టాడు రాయప్ప.

మురళి వాళ్ళింటికి వెళ్ళేసరికి అతని అంతిమయాత్రకు సన్నాహాలు చేస్తున్నారు బంధుమిత్రులు.

ఇంట్లో వాళ్ళంతా హృదయవిదారకంగా యేడుస్తు న్నారు.

చెట్టంత కొడుకుని పోగొట్టుకుని గుండెలు పగిలేలా విల పిస్తున్న మురళి తల్లిదండ్రుల్ని చూసి నాగరాజుకి ఏడుపు ముంచుకొచ్చింది. ఎంత నిబ్బరంగా వున్నా రాయప్పకి కన్నీరు ఆగలేదు.

స్మశానానికి వెళ్ళి వచ్చేసరికి సాయంకాలమైంది.

ఇద్దరూ ఇంటికి వెళ్ళలేదు.

సరాసరి హోటల్ దుర్గాకి వచ్చారు.

రూమ్ నెంబర్ వన్ ఖాళీగానే వుంది; అన్నీ నిండితేనే గాని అది ఎవరికీ ఇవ్వరు.

నాగరాజు రూమ్ తెరచి బాత్‌రూమ్‌లో కెళ్ళి స్నానం చేశాడు. ఆ తర్వాత రాయప్ప స్నానం చేసివచ్చాడు. లుంగీలు కట్టుకుని కూర్చున్నారు. లాండ్రీ మనిషి వచ్చి బట్టలు పట్టుకెళ్ళాడు.

ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు మాటలు మర్చి పోయిన మనుష్యుల్లా.

"మురళి బావ చెప్పిందంతా వింటే నాకు వండర్ అని పించింది" అన్నాడు నాగరాజు.

"నేను షాక్ తిన్నాననుకో."

"అదంతా నిజమే నంటావా?"

"డాక్టర్ అబద్ధపు రిపోర్టు ఎందుకిస్తాడు?"

"వాడిని హత్య చేసేంత శత్రువులు ఎవరు?"

"ఆ విషయం అక్కడికి వెళ్తే తెలుస్తుంది—" అన్నాడు రాయప్ప ఏదో ఆలోచిస్తూ.

3

మురళిని హత్య చేసిన క్వారీకి వెళ్లారు నాగరాజు, రాయప్ప.

గట్టుమీద నుంచి చూస్తూ నిల్చున్నారు.

పెద్ద పెద్ద రాళ్ళను చిన్న చిన్న ముక్కలుగా కొట్టి కుప్పలు పోస్తున్నారు కూలీలు.

"రాయ్! హంతకుడు తెలివిగానే ప్రవర్తించాడు కాని ముందే విషప్రయోగం చేసి చంపడంవల్ల హత్య చేశారని పోలీసులు తెలుసుకోగలిగారు."

"విషప్రయోగం చెయ్యకుండా విసిరేస్తే చచ్చిపోతాడని గ్యారంటీ ఏముంది? అందుకని చంపి క్వారీలోకి విసిరేశారు" అన్నాడు రాయప్ప.

"ఇన్‌స్పెక్టర్ జయసింహ సలహా ప్రకారం మిల్క్ ప్రాజెక్టులో ఎకౌంటెంట్ ముకుందరావుని కలుసుకుంటే కొంత సమాచారం దొరుకుతుంది."

"పోలీసుల కంటే మనకి ఎక్కువ చెప్తాడా? తనకి తెలిసింది ఏదో చెప్పేశాడు గదా!"

"ఏం చెప్పాడు నా ముఖం. అందులో పనికొచ్చే ముక్క ఒక్కటీ లేదు."

"అయితే ఏం చేద్దాం?"

"మిల్క్ ప్రాజెక్టులో మురళి పనిచేసిన రెండు నెలలలో క్లోజ్‌గా మూవ్ అయిన వాళ్ళెవరో తెలుసుకుంటే వుపయోగం వుంటుంది. ఏదైనా క్లూ దొరకవచ్చు."

"వాడు యింట్లోంచి వెళ్లిపోయి దాదాపు—ఆర్నెల్లు గడిచింది. మిల్క్ ప్రాజెక్టులో రెండు నెలల నుంచి

మాత్రమే పని చేస్తున్నాడని ఇన్‌స్పెక్టర్ జయసింహ చెప్పాడు. అంతకు ముందు నాలుగు నెలలు యెక్కడున్నాడు?"

"పాయింట్!" అన్నాడు నాగరాజు.

"సరే ముందు ముకుందరావునే కల్సుకుందాం" అన్నాడు రాయప్ప.

అక్కడికి దాదాపు రెండు ఫర్లాంగుల దూరంలో వుంది మిల్క్ ప్రాజెక్టు.

చుట్టూ ముళ్ళతీగెతో ఫెన్సింగ్. చుట్టు ప్రక్కలంతా ఎడారిలాంటి ప్రదేశం. దూరంగా తాటిచెట్లు గుబురుగా కనిపిస్తున్నాయి. కొన్నిమైళ్ళ దూరాన వున్న కొండలు నున్నగా మెరుస్తున్నాయి.

ముకుందరావు తలెత్తి చూసి "ఎవరు కావాలి?" అన్నాడు.

"మీతోనే పనుండి వచ్చాం."

ముకుందరావు తల వూపి "ప్లీజ్ టేక్‌యువర్ సీట్!" అతని సీటు యెదురుగా వున్న కుర్చీలు చూపించాడు.

నాగరాజు విజిటింగ్ కార్డు ముకుందరావుకి అందించాడు.

'రాయప్ప బి. ఏ., ప్రైవేట్ డిటెక్టివ్' అని వుంది దానిమీద.

"గ్లాడ్ టూ మీట్ యూ!" అన్నాడు ముకుందరావు నాగరాజుతో చెయ్యి కలిపి.

"నా పేరు నాగరాజు. ఆయన అసిస్టెంట్‌ని!" అన్నాడు.

ముకుందరావు రాయప్పతో గూడా చెయ్యి కలిపి "చెప్పండి" అన్నాడు.

"మురళి హత్యకేసు ఇన్వెస్టిగేట్ చేస్తున్నాం."

"ఐ. సీ." తల వూపాడు.

"మీరు మాతో సహకరించాలి."

"విత్ ప్లెజర్." అన్నాడు ముకుందరావు.

"మీరు ఇన్‌స్పెక్టర్ జయసింహతో చెప్పిన వివరాలు మేం తెలుసుకున్నాం. ఇంకా ఏవైనా తెలిస్తే చెప్పండి" అన్నాడు రాయప్ప.

"అతను పట్టుమని రెండు నెలలు పని చెయ్యలేదు. అంతకంటే నేనేం చెప్పగలను?"

"తెలిసిందే చెప్పండి."

"మీకు ఏం కావాలో అడగండి."

"అతను వాళ్ళ నాన్నతో గొడవపడి ఆర్నెల్ల క్రితం ఇల్లు వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. ఎక్కడ వుంటున్నాడో తెలియజెయ్యలేదు. వాళ్ళ నాన్నకే కాక క్లోజ్ ఫ్రెండ్స్‌కి సైతం లెటర్స్ రాయలేదు. మీ ఫ్యాక్టరీలో రెండు నెలల నుంచి మాత్రమే పని చేస్తున్నాడని మీరు అంటున్నారు. యిక్కడకు రాకముందు యెక్కడ పని చేశాడు? మీకేవైనా తెలిస్తే చెప్పండి."

ముకుందరావు పెదవి విరిచాడు.

"అతను ఆ విషయాలు నాకు చెప్పలేదు. అంతే కాకుండా అతను కృష్ణమూర్తి ద్వారా వచ్చాడు. అతనికి తెలిసి వుండాలి ఆ వివరాలు." అన్నాడు ముకుందరావు.

"కృష్ణమూర్తి ఎవరు?"

ముకుందరావు సమాధానం చెప్పకుండా బెల్ కొట్టి అటెండర్ని పిలిచాడు.

"వీరిని కృష్ణమూర్తిగారి దగ్గరికి తీసికెళ్ళు" అన్నాడు ముకుందరావు.

4

కృష్ణమూర్తి మిల్కు కాన్‌లు అన్‌లోడింగ్ చేయిస్తూ హడావుడిగా వున్నాడు.

అటెండర్ అతని దగ్గిరగా వెళ్ళి ముకుందరావు పంపించాడని వీళ్ళని చూపించాడు.

అతను దగ్గరికి వచ్చి "ప్లీజ్ వెయిట్!" అన్నాడు.

"దట్సాల్ రైట్. మీరు పని కానివ్వండి." అన్నాడు నాగరాజు.

లారీ వెళ్ళిపోయిన తర్వాత వచ్చాడు కృష్ణమూర్తి.

రాయప్ప చెప్పిందంతా విని "మురళిని, వెంకట్ పరిచయం చేశాడు." అన్నాడు కృష్ణమూర్తి.

"వెంకట్ ఎవరు?"

"నాకు క్లోజ్‌ఫ్రెండ్. మోడరన్ స్టోన్ చిప్స్ ఫ్యాక్టరీ ప్రొప్రయిటర్."

రాయప్ప నిట్టూర్చాడు విసుగ్గా.

"లొకేషన్ చెప్పండి. వెళ్ళి కలుసుకుంటాం" అన్నాడు నాగరాజు.

"పెదపాలెం దగ్గర్లోనే. ఇక్కడికి నాలుగుమైళ్ళుంటుంది. మెయిన్‌రోడ్డు ప్రక్కనే కనిపిస్తూనే వుంటుంది లెండి. వెంకట్ అక్కడే వుంటాడు. నేను పంపించానని చెప్పండి" అన్నాడు కృష్ణమూర్తి.

రాయప్ప వెళ్ళబోతుంటే నాగరాజు అతని చెయ్యి పట్టుకుని ఆపి "మురళిని హత్యచేయడానికి యెవరికి అవకాశం వుంటుందో మీకేదైనా ఐడియా వుందా?" అన్నాడు.

కొంచెంసేపు మాట్లాడకుండా వుండిపోయాడు.

"అదే నాకు అర్థంకాకుండా వుంది" అన్నాడు.

"అతను ఇక్కడ బసచేసిన రెండునెలల్లోనూ ఎవరితో

నైనా క్లోజ్‌గా మూవ్ అయ్యేవాడా? ప్లీజ్ దాచకుండా చెప్తే ఏదైనా క్లూ దొరుతుకుంది."

"నాతోనే క్లోజ్‌గా వుండేవాడు."

"అలాగా!" అన్నాడు రాయప్ప.

"అతనికోసం యెవరైనా వచ్చిపోతూవుండడం మీరు గమనించారా?"

లేదన్నట్లు తలవూపాడు కృష్ణమూర్తి.

"అతను యెక్కడ వుండేవాడు?"

"నా రూమ్‌లోనే. నా కింకా పెళ్ళికాలేదు" అన్నాడు కృష్ణమూర్తి.

"అయితే అందరికన్నా మీకే ఏదైనా తెలియడానికి అవకాశం వుంది" అన్నాడు నాగరాజు.

"ఎంత ఆలోచించినా అర్థం కావడంలేదు. మురళి హత్యావార్త విని షాక్ తిన్నాను" అన్నాడు కృష్ణమూర్తి.

"ఎనీ లౌ ఎఫైర్" అనుమానంగా అన్నాడు రాయప్ప.

కృష్ణమూర్తి అటూ ఇటూ చూసి "అరుణ తనని ప్రేమిస్తున్నదని ఒకసారి నాతో అన్నాడు" నెమ్మదిగా

అన్నాడు.

"అరుణ ఎవరు?"

"మనసులో వుంచుకోండి."

నాగరాజు, రాయప్ప తలలు వూపారు.

"ఆఫీసులో టైపిస్టు. మీరు చూసేవుంటారు."

"యస్. సన్నగా, ఎర్రగా వుంది" అన్నాడు నాగరాజు.

"ఆ అమ్మాయే. ఎకౌంటెంట్ ముకుందరావు కూతురు."

"ఐ.సీ." అన్నాడు రాయప్ప.

"ముకుందరావుకి తెలుసా ఆ సంగతి?" ప్రశ్నించాడు నాగరాజు.

"నేను అంతగా పట్టించుకోలేదు ఆ సంగతి."

"అరుణని ఇంకెవరైనా ప్రేమిస్తున్నారా?"

"జగన్నాధరావు అని క్లర్కు వున్నాడు మా ఆఫీసులోనే. అతనికి అరుణని ఇవ్వాలని ముకుందరావు అనుకుంటున్నట్లూ, కాని అరుణకు అతనంటే ఇష్టంలేదని చెప్పుకుంటూ వుంటారు."

"అరుణకు అతనంటే యెందుకిష్టంలేదు?"

"అతను బాగుండడు. ఎలాగోలా పెళ్ళిచెయ్యాలనీ, మొగాడికి అందం యేమిటనీ వాళ్ళనాన్న వుద్దేశ్యం" నవ్వాడు కృష్ణమూర్తి.

"ఈ విషయంలో జగన్నాధరావుని అనుమానించవచ్చా?" అన్నాడు రాయప్ప.

కృష్ణమూర్తి ఇబ్బందిగా చూశాడు.

"అతని ప్రవర్తన యెలా వుంటుంది?" ప్రశ్నించాడు నాగరాజు.

"రఫ్‌గానే వుంటాడు. పొలైట్‌నెస్ తెలియదు. వెనుక

ఆస్థిపాస్తులున్నవాడట. అందుకే గర్వం."

"జగన్నాథం ఎవరో చూపించండి మాకు."

"ఆఫీసులోకి వెళ్ళి చూడండి. అరుణకు యెదురు సీట్లోనే కూర్చుని వుంటాడు. నల్లగా లావుగా వుంటాడు. హిప్పీక్రాపు. చారల బ్లూ కలర్ షర్టు టక్ చేసుకుని వున్నాడు."

"నేను వెళ్ళి చూసివస్తా!" అని నాగరాజు ఆఫీసులోకి వెళ్ళి కాసేపటికి తిరిగి వచ్చాడు.

"థాంక్స్ కృష్ణమూర్తిగారూ!" అన్నాడు రాయప్ప.

"సీ.యూ!" అని ఇద్దరూ కాంపౌండ్ వాల్ దాటి వచ్చేశారు.

రోడ్డుమీదకు వచ్చేవరకూ మాట్లాడుకోలేదు. ఇద్దరూ ఆలోచనలో పడ్డారు.

"ఏం చేద్దాం?" ప్రశ్నించాడు రాయప్ప.

"జగన్నాథరావుని అనుమానించాల్సిన పరిస్థితులువున్నాయనిపిస్తోంది."

"అరుణ మురళిని ప్రేమిస్తున్న సంగతి జగన్నాథరావుకి తెలిసిందా? తెలిస్తే ఆ సంగతి ముకుందరావుకి తప్పకుండా చెప్పివుండాలి. ఆయన కూతుర్ని మందలించి, మాట వినకపోతేగదా అంత సాహసం చెయ్యాల్సింది. గోటితోపోయ్యేదానికి గొడ్డలి వుపయోగిస్తారా ఎవరైనా?"

"మనం అరుణని టాకిల్ చెయ్యాలి. ఆమె ద్వారా కరెక్టు ఇన్ఫర్మేషన్ తెలుస్తుంది."

"ఓ. కే. ఆమె లంచ్ కి వెళ్ళేటప్పుడు టాకిల్ చేద్దాం."

లంచ్ టైమ్ లో ఆఫీస్ స్టాఫ్ ఒక్కొక్కరే వస్తున్నారు.

అరుణ గేటు దాటగానే రాయప్ప ఆమెకు విష్ చేసి, తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు.

ఆమె ఆ కార్డులో అక్షరాలు చదువుతూ నిల్చుండి పోయింది.

"ఫాదర్‌తో మాట్లాడుతున్నప్పుడు మిమ్మల్ని చూశాను" అంది అరుణ.

"ఎక్స్క్యూజ్‌మీ! కొంచెంసేపు ఆ చెట్టు క్రింద నిల్చుందామా!" అన్నాడు రాయప్ప.

ఆమె తలవూపి చెట్టుక్రిందకు నడిచింది.

"మురళి మర్డర్‌కేస్ ఇన్వెస్టిగేట్ చేస్తున్నాం. మురళి నాకు క్లోజ్‌ఫ్రెండ్. వాడిని చంపినవాడిని యెలాగైనా పట్టుకుని వురికంబం యెక్కించాలని పట్టుదలతో వచ్చాను. మీరు సహకరించాలి."

మురళిమాట వినగానే ఆమెముఖం నల్లబడిపోయింది. విచారంతో కృంగిపోతున్నదానిలా తల వంచుకుంది.

"మీరు వాడిని యెంత ప్రేమించారో నాకు తెలుసు" అన్నాడు రాయప్ప.

అరుణ తలెత్తి ఆశ్చర్యంగా చూపింది.

"వాడు లెటర్స్‌లో ఆ విషయాలు రాస్తూ వుండేవాడు. మీ ఫాదర్‌కి ఇష్టంలేదని విచారపడేవాడు."

ఆమె వింటూ నిల్చుంది.

"జగన్నాథరావుకిచ్చి మీ పెళ్లి చెయ్యాలని మీ ఫాదర్ నిర్ణయించుకున్నారట. నిజమేనా?"

ఆమె తల వూపింది.

"మురళిని మీరు ప్రేమిస్తున్న సంగతి మీ ఫాదర్‌కి తెలుసా!"

తెలుసునన్నట్లు తల వూపింది ఆమె.

"మీరే చెప్పారా లేక ఆయన తెలుసుకున్నాడా?"

"నేనే చెప్పాను."

"ఏమన్నారు ఆయన?"

"కులాంతర వివాహానికి ఒప్పుకోలేదు."

"ఎన్నాళ్ళయింది యిది జరిగి—?"

"పదిహేను రోజులైందనుకుంటాను."

"మీరు ఆయన మాట వినకుండా మురళిని రహస్యంగా పెళ్ళిచేసుకుంటారేమోనని, భయపడి అతన్ని మర్డర్ చేయించాడేమో?"

"నో...." గట్టిగా అంది అరుణ.

"అలా జరగడానికి వీల్లేదంటారా?"

"లేదు. మా ఫాదర్ అటువంటివాడు కాదు."

రాయప్ప నవ్వాడు.

"పోనీ జగన్నాధరావు చేయించడానికి అవకాశం వుందా?"

"ఏమో?" అంది అరుణ.

"పోనీ మీ కెవరిమీదైనా అనుమానం వుందా?"

"లేదు."

"మీరు భయపడకండి. నిజం చెప్పండి. మీ ఫాదరే హంతకుడైతే తప్పించుకోలేడు."

ఆమె భయంగా చూసింది.

"నో సార్! ఆయన అంతదూరం పొయ్యేమనిషి కాదు" అంది ఆమె.

"సరే! నిజం నిలకడమీద తెలుస్తుంది" అన్నాడు రాయప్ప, ముందుకు కదులుతూ.

5

వెంకట్ కాఫీ తెప్పించాడు.

ముగ్గురూ సిప్‌చేస్తూ కూర్చున్నారు.

"మురళిని నాకు బ్యాంక్ మేనేజర్ ధర్మారెడ్డి పరిచయం చేశాడు. కుర్రాడు చురుగ్గా వుండేవాడు. నాకు చాలా హెల్ప్‌ఫుల్‌గా వుండేవాడు. కాని ఏం లాభం? లౌక్యం తెలియదు. ఉద్రేక స్వభావం కలవాడు. అందుకే అతన్ని వదులుకోవలసి వచ్చింది. ఒక్కచోట వుండేవాళ్ళలో గొడవలొస్తే అంత తొందరగా పోవు. అందులో శాయన్న తాగుబోతు. మంచివాడు కాదు" అన్నాడు వెంకట్.

"శాయన్న యెవరు?"

"మేస్త్రీ. అదుగో అటు చూడండి. ఆ ఎర్రచీర కట్టుకన్న ఆవిడ ప్రక్కన నిలబడి చుట్ట కాల్చుకుంటున్నాడు వాడే."

ఇద్దరూ అటువైపు చూశారు.

నల్లగా దున్నపోతులా వున్నాడు శాయన్న.

స్టోన్ క్రషింగ్ మెషిన్ పెద్ద శబ్దం చేస్తోంది.

కూలీలు చిప్స్ మోసుకొచ్చి లారీకి లోడ్ చేస్తున్నారు.

"అతనికీ మురళికీ గొడవ యెందుకొచ్చింది?"

"నేనూ అప్పుడు లేను. గొడవంతా అయిన తర్వాత తెలిసింది. శాయన్నకి యిద్దరు భార్యలు. పెద్దభార్య దాదాపు అతని వయస్సుదే. పెద్దపిల్లలు గూడా వున్నారు. రెండో భార్యకి యిరవై దాటివుంటాయి. ఇంకా పిల్లలు లేరు. సవతులిద్దరికీ పడదు.

శాయన్న చిన్నభార్యతో యెక్కువ వుండడం, పెద్ద భార్యకి ఈర్ష్య కలిగించింది. అందుకే సవతిమీద లేనిపోనివి చెప్పి శాయన్నకి అనుమానం కలిగించేది. వాడొక మొద్దవతారం. ఇక కొంచెం తాగితే మనిషికాదు. పెద్ద భార్య చెప్పుడు మాటలు విని చిన్నభార్యని కొడుతూ వుంటాడు. అది సర్వసామాన్యమైన విషయం.

ఒకరోజు అలాగే జరిగింది. తాగివచ్చి శాయన్న చిన్న భార్యని కొడుతుంటే ఆమె ఏడుస్తూవుంది. శాయన్న యెందరు చెప్పినా వినడంలేదు. అప్పుడు మురళి వెళ్లి జోక్యం కలిగించుకున్నాడు. ఆడదాన్ని కొట్టడానికి సిగ్గు లేదా? మనిషివా? పశువ్వా? అని కేకలేశాడట.

నా పెళ్ళాన్ని నేను కొట్టుకుంటాను చంపుకుంటాను, అని శాయన్న మురళిమీద యెదురుతిరిగాడు. ఇద్దరూ తన్నుకున్నారు. బాగా తాగివుండడం వలన శాయన్న బలవంతుడైనా ఓటమి తప్పలేదు. మిగిలిన కూలీలు వాళ్ళని విడదీశారు.

నేను వచ్చేసరికి సద్దుమణిగింది. కాని శాయన్న క్రూరుడు. తనని అవమానించిన వాడిని వదిలిపెట్టడు. నాకు తెలుసు వాడిసంగతి. అందుకే మిల్క్ ప్రాజెక్టులో కృష్ణమూర్తి ద్వారా డెయిలీ వేజెస్‌లో అయినా సరేనని మురళిని అందులో ప్రవేశపెట్టాను. కంటిన్యూ చేసివుంటే

ఏదైనా వేకెన్సీ వచ్చినప్పుడు క్లర్క్ అవ్వడానికి అవకాశం వుండేది. క్వాలిఫికేషన్ వుందిగదా!"

వెంకట్ చెప్పిందంతా విన్నతర్వాత రాయప్ప అనుమానం శాయన్నమీదకి పోయింది.

మనిషిని చూస్తే డోంట్ కేర్ మాష్టర్‌లా పెద్దగూండాలా వున్నాడు. మురళిలాంటి అర్భకుడు తనని అవమానించడం సహించలేక అవకాశం చూసుకుని చంపేశాడేమో?

కాని శాయన్నలాంటి మొరటివాడు విషంయిచ్చి చంపే తెలివి ప్రదర్శిస్తాడా? ఏ కత్తితోనో చంపుతాడు లేదా పీక పిసుకుతాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" ప్రశ్నించాడు వెంకట్.

"ఏం లేదు" అన్నాడు రాయప్ప.

"నాకు తెలుసు మురళిని చంపడానికి శాయన్నకు అవకాశం వుందా లేదా అని ఆలోచిస్తున్నారు" వెంకట్ నవ్వుతూ అన్నాడు.

"హంతకుడు దొరికేవరకూ అందరూ అనుమానితులే గదా?" అన్నాడు రాయప్ప.

"ష్యూర్?" అన్నాడు వెంకట్.

"మీరేం అనుకుంటున్నారు?" ప్రశ్నించాడు రాయప్ప.

"నాకు మురళి హత్య ఒక మిష్టరీలావుంది. శాయన్నను అనుమానితుల జాబితాలో జేర్చవచ్చు. కాని, మురళి ఇక్కడ్నుంచి వెళ్లిపోయి రెండునెలలు అయింది. అంత పగపట్టినవాడు రెండునెలలు యెందుకు ఓపిక పడతాడు?" అన్నాడు వెంకట్.

"మీరు చెప్పింది నిజమే. కాని శాయన్న కంటికి మురళి కనిపించినప్పుడు మర్చిపోయిన పగ తిరిగి రేగే ప్రమాదం వుండొచ్చు గదా!" అన్నాడు రాయప్ప.

"శాయన్నని పిల్చి అడిగితే!" అన్నాడు నాగరాజు.

"వద్దు" అన్నాడు వెంకట్.

"ఏం?"

"వాడు మిమ్మల్ని కేర్ చెయ్యడు. పోలీసులద్వారా అడిగించండి" అన్నాడు వెంకట్.

"గుడ్ ఐడియా!"

"బ్యాంక్ మేనేజర్ ధర్మారెడ్డిగారిని కలుసుకుంటాం. వారి ఇంటి అడ్రస్ చెప్పండి" అన్నాడు రాయప్ప.

"కొత్తపేటలో నేతాజీ స్టాచ్యూ వుంటుంది. దానికి కుడిచేతివైపు వీధిలో నాలుగో ప్లాట్ అనుకుంటాను. వెళ్తే ఈజీగా తెలుసుకోవచ్చు" అన్నాడు వెంకట్.

ఇద్దరూ సెలవుతీసుకుని, కొత్తపేట వెళ్లి ధర్మారెడ్డిని కలుసుకున్నారు.

"నేను డిటెక్టివ్ రాయప్పని. మురళి మర్డర్ కేసు ఇన్వెస్టిగేట్ చేస్తున్నాం. మురళిని మీరు వెంకట్‌కి పరిచయం చేశారని తెలిసింది. ఆ విషయం మాట్లాడ్డానికి వచ్చాం" తనను తాను పరిచయం చేసుకుంటూ అన్నాడు రాయప్ప.

"అవును. పాపం మురళిని మర్డర్ చేశారట! విన్నాను. మంచి కుర్రాడు. కనీసం మెసంజర్ జాబ్ అయినా యివ్వమని యెన్నోసార్లు అడిగాడు" అంటూ చైర్స్ చూపించాడు ధర్మారెడ్డి.

"మురళి మీకు యెలా పరిచయం?" ప్రశ్నించాడు రాయప్ప.

"నాకు పరిచయంలేదు. డాక్టర్ సుజాతగారి దగ్గరనుంచి లెటర్ తెచ్చుకున్నాడు. నేను ఏమీ హెల్ప్ చేయలేక పోయాను. వెంకట్ మా కష్టమర్. అతనికి నమ్మకమైన

కుర్రాడు కావాలని తెలిపి, మురళిని సజెస్టుచేశాను. వెంకట్ దగ్గిర పని చేస్తున్నాడనే అనుకుంటున్నాను యిన్నాళ్ళూ. కాని అక్కడ మానేసి మిల్కు ప్రాజెక్టులో జేరాడనీ, మర్డర్ చేయబడ్డాడనీ తెలిసి వండ రయ్యాను. పూర్ ఫెలో!"

రాయప్పకి నీరసం ముంచుకొచ్చింది ధర్మారెడ్డి చెప్పిందంతా విని. డాక్టర్ సుజాత ఎవరో! అనుకున్నాడు.

"డాక్టర్ సుజాతగారి అడ్రెస్ చెప్పండి" అన్నాడు నాగరాజు.

ధర్మారెడ్డి స్లిప్‌మీద రాసిచ్చాడు.

ఆయనవద్ద సెలవు తీసుకుని బైటపడ్డారు.

"ఈ రోజుకి యిక లాభం లేదు...." అన్నాడు రాయప్ప.

"రూమ్‌కి వెళ్ళిపోదాం. రిలాక్స్" అన్నాడు నాగరాజు.

6

రాయప్ప చెప్పిందంతా విని "హూ ఈజ్ మురళి?" అంది డాక్టర్ సుజాత.

ఇద్దరూ తెల్లబోయారు.

ఆవిడకు మతిమరుపు ఎక్కువేమో అనుకున్నారు.

ధర్మారెడ్డికి లెటర్ రాసిచ్చిన సంగతి చెప్పాక గుర్తొచ్చింది ఆమెకు.

"ఓ. అతనా!" అంది.

"గుర్తొచ్చాడా?"

"ఆఁ....అయితే యేం కావాలి మీ కిప్పుడు....?" అంది.

"ఆర్నెల్ల క్రితం అతను ఇంట్లో పోట్లాడి వచ్చేశాడు. ప్రస్తుతం మిల్కుప్రాజెక్టులో డైలీవేజెస్‌లో పని చేస్తూ



మర్డర్ చేయబడ్డాడు. అతను మీకు యెలా తెలుసో కావాలి మాకు."

"నేను ఆర్నెల్ల క్రితం విజయవాడ నుంచి బస్సులో వస్తున్నాను. అతనూ అదే బస్సులో ప్రయాణం చేస్తున్నాడు. నా వెనుకసీట్లో కూర్చున్నాడు. ఈ వూరు రాగానే నేను బస్సు దిగి హడావుడిగా రిక్షా యెక్కి ఇంటికి వెళ్దామని బయలుదేరాను. అతను పరిగెత్తుకుంటూ వచ్చి బస్సులో నేను మర్చిపోయిన హేండ్ బ్యాగ్ తెచ్చి యిచ్చాడు.

అతని సిన్సియారిటీ చూసి నాకు ముచ్చట వేసింది. అతని గురించి వివరాలు అడిగాను. తనొక నిరుద్యోగి అనీ జాబ్‌కోసం ట్రై చేస్తున్నాననీ, ఎంత చిన్నదైనా చేస్తాననీ అన్నాడు. నాతోపాటే యింటికి తీసికెళ్ళాను. తర్వాత ధర్మారెడ్డిగారికి లెటర్ రాసిచ్చాను, ఏదైనా జాబ్ చూపించమని. అంతే. ఆ తర్వాత అతను నాకు కన్పించ

లేదు" అంది డాక్టర్ సుజాత.

డాక్టర్ సుజాతవద్ద గూడ ముఖ్యమైన సమాచారం దొరకనందుకు నిరుత్సాహం కలిగింది.

"పోనీలే. మళ్ళీ ఆమె ఎవర్నయినా రిఫర్ చేస్తుందేమోనని భయపడ్డాను" అన్నాడు రాయప్ప.

"మనం ఇన్‌స్పెక్టర్ జయసింహని కలుసుకుందాం ఒకసారి. ఏదైనా ఇన్ఫర్‌మేషన్ తెలిపి వుండొచ్చు" అన్నాడు నాగరాజు.

"సరే పద" అన్నాడు రాయప్ప.

వీళ్ళని చూస్తూనే "వెల్‌కమ్ యంగ్ డిటెక్టివ్స్" అన్నాడు ఇన్‌స్పెక్టర్ జయసింహ నవ్వి "అయితే కేసు మొదటికే వచ్చిందన్న మాట" అన్నాడు.

"అలాగే వుంది చూస్తుంటే" అన్నాడు రాయప్ప.

"ఇంతకీ మీరు మురళి రూమ్ పరిశోధించారా?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

రాయప్ప, నాగరాజు ఒకళ్ళ ముఖం మరొకళ్ళు చూసుకున్నారు.

"లేదు. కృష్ణమూర్తి రూమ్‌లోనే వుంటున్నాడని చెప్పాడు. అందుకని రూమ్‌కి వెళ్ళ లేదు" అన్నాడు రాయప్ప.

"మీ కొక క్లూ ఇస్తాను. ఫాలో అయితే ప్రయోజనం వుండొచ్చు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఏమిటి సార్?"

"హత్య శనివారం రాత్రి జరిగింది. శనివారం మురళి మిల్క్ ప్రాజెక్టులో డ్యూటీకి వెళ్ళలేదు. అతనికోసం ఆ వుదయం యెవరో వస్తే రూమ్‌లోనుంచి వెళ్ళిపోయాడు. మళ్ళీ తిరిగిరాలేదు. ఆ రాత్రి అతని హత్య జరిగింది. విష

ప్రయోగం జరిపి క్వారీలోకి విసిరేశారు. మర్నాడు ఉదయం గంగులు మొదటిసారి చూశాడు శవాన్ని."

"శనివారం వుదయం అతని కోసం వచ్చిన వాడెవరో తెలుసుకోవాలి. అంతే గదా!" అన్నాడు రాయప్ప.

"యస్.!'

"మురళి కోసం వచ్చిన మనిషిని చూపింది ఎవరు?"

"శేషగిరిరావు అని వాళ్ళ రూమ్ యెదురుగా వున్న ఇల్లు. అతను ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. రాత్రి లేటుగా యింటికి వచ్చి ఉదయం పదింటికి ముఖం కడుక్కుంటూ చూశాడట. మురళితో ఎవరో మాట్లాడుతున్నారట రూమ్‌లో."

"మనిషి ఎలా వుంటాడట?"

"వివరంగా చెప్తాను. కొంచెం లావుగా వున్నాడు. వయస్సు నలభై వుండొచ్చు. తలమీద వెంట్రుకలన్నీ నల్లగా వున్నాయట. కాని మధ్యలో తెల్లటి గీతలా వెంట్రుకలు తెల్లబడ్డాయట...." అన్నాడు యిన్‌స్పెక్టర్ జయసింహ.

నాగరాజు ఆశ్చర్యంతో బిగుసుకుపోయాడు.

"ఇన్‌స్పెక్టర్! అతను నాకు తెలుసు" గట్టిగా అన్నాడు నాగరాజు.

జయసింహ నివ్వెరపోయి "ఈజిట్?" అన్నాడు. సంతోషంతో మెరిశాయి అతని కళ్లు.

"యస్!....ఇన్‌స్పెక్టర్!" ఉత్సాహంతో అన్నాడు నాగరాజు.

రాయప్ప ఆశ్చర్యానికి అవధులు లేవు.

హంతకుడు యింత తేలిగ్గా దొరికిపోతాడని అతను

వూహించలేదు. ఎన్నిరోజులు శ్రమ పడాలో అనుకున్నాడు. ఇది వూహించని పరిణామం.

7

మురళికి తను కాఫీలో విషం యిచ్చి చంపాననీ, ఆ తర్వాత శవాన్ని క్వారీలోకి విసిరేశాననీ ఒప్పుకున్నాడు బ్రహ్మానందం.

బ్రహ్మానందం మురళి బావ. పేరుకు తగినవాడే. పేకాట వ్యసనంతో ఆస్థంతా కరిగించుకున్నాడు. చిన్న వుద్యోగం చేస్తూ మామగారింట్లోనే వున్నాడు.

మురళి తండ్రి ప్లీడరు గుమాస్తా. అతి కష్టంమీద సంసారం లాక్కొని వస్తున్నాడు. మురళి ఆయనకి ఒక్కడే కొడుకు. బి. ఏ. ప్యాసై రెండేళ్ళు గడిచినా ఎక్కడా వుద్యోగం దొరకనందుకు విసుక్కునేవాడు. తనతోపాటు వచ్చి పని నేర్చుకోమని పోరాడు. ప్లీడరు గుమస్తా పని మురళికి ఇష్టం లేదు.

ఒకరోజు తండ్రీ కొడుకులు ఘర్షణపడ్డారు. మురళి చెప్పకుండా వెళ్ళిపోయాడు. అది జరిగి ఆర్నెల్లయింది.

ఈ లోపల జరిగిన విశేషం ఏమిటంటే, మురళి మేనత్త చనిపోతూ తన ఆస్థి అంతా మేనల్లుడికి రాసిచ్చింది. దాదాపు లక్షరూపాయల సంపద. ఆమెకు పిల్లలు లేరు. అనుకోకుండా బ్లడ్ క్యాన్సర్ వచ్చి నెల లోపులో చని పోయింది.

ఆమె వితంతువు. పైగా పిల్లలు లేరు. అందుకే ఆమె తన ఆస్థి మేనల్లుడికి రాసిచ్చింది. అన్నగారి పేరుతో వీలు నామా రాస్తే అతను అందులో కొంత భాగం అల్లుడికి గూడ ఇస్తాడేమోనని ఆమె సందేహించింది. బ్రహ్మానందం అంటే ఆమెకు ఇష్టం లేదు.

మురళి లేకుండా వుంటే ఆ ఆస్థి అంతా తన భార్యకి, తద్వారా తన చేతికి వచ్చివుండేది గదా అని విచారించాడు బ్రహ్మానందం.

కాని ఈ సంగతులేమీ మురళికి తెలియవు.

మురళి యెప్పటికీ రాకుండా వుంటే బాగుండునని ఆలోచించాడు బ్రహ్మానందం. ఏదైనా స్థిరమైన వుద్యోగం సంపాదించిగాని ఇంటిముఖం చూడనని ప్రతిజ్ఞ చేసి వెళ్ళాడు మురళి. ఈ రోజు కాకపోయినా రేపైనా తిరిగి వస్తాడు గదా! అసలు రాకుండా చేసే మార్గం ఏమిటి? అని తీవ్రంగా యోచించి చివరకి తనే మూడో కంటికి తెలియకుండా చంపడానికి నిర్ణయించుకున్నాడు. ఎలాగో మురళి వునికి కనిపెట్టి తను అనుకున్నది సాధించాడు.

కాని అతనికి ఆ ఆస్థి అనుభవించే గీత లేదు.

అందుకే యావజ్జీవిత ఖైదు విధించారు. □

"చక్కిలిగింతలు"

"ఏయ్ జయా! తొందరగా రా" అన్నాడు దాసు గట్టిగా.

"ఎందుకూ ఏమైందండి" అని గాభరాతో వచ్చింది జయ ఇంట్లోని పని విడిచి.

"కొంచెం చక్కిలిగింతలు పెట్టు."

"చక్కిలిగింతలా? ఇదేం కోరికండీ? ఇప్పుడా? ఎందుకూ?"

"అబ్బ పెట్టవే, మాంచి జోక్సు రాయాలి. పత్రికలో పడితే అందరూ నవ్వేలా ఉండాలి!" అన్నాడు ఆ జోక్సు రచయిత దాసు.

—చాగాపురం నాగేశ్వరరావు, మల్దకల్.

కోపలకొలిమి

యం. వి. వి. సత్యనారాయణ

పాఠకుల పరిశోధన పోటీ-94

(బహుమతి రు.50/-లునగదు)

"హవ్వ....నీ జిమ్మడ! నీకేం పోయే కాలమే! ఆడ పడచును మన్నించాలని కూడా నీకు మర్యాదా, మన్ననా

తెలియదే!" తిట్లకి లంకించుకుంది రాజమ్మ.

సరస్వతి పమిట బిగించింది. కళ్లు ఎఱ్ఱచేసింది. చేతులు వేగంగా త్రిప్పుతూ, నోరు నొక్కుకుంది

"నువ్వు ఆడపడుచువా? ఆడరాక్షసివా? మొగుడు చచ్చి ఇల్లుపట్టానని సిగ్గులేక ఈ యింటి కోడలివైన నన్ను ఆరళ్ళు పెడతానని ఎవడికైనా రాసిచ్చావా? నీ నాలుక తెగిపడితే బాగుండునే! నీకు ఎటూ సంసారంలేదు. చేసుకునే వాళ్ళని చూచి సంతోషించే యోగ్యత అయినాలేదు. పాడుముండా?" తిట్టింది సరస్వతి.

కొంపలు ముట్టుకున్నట్టు గగ్గోలుగా అరుస్తూ రాజమ్మ నెత్తి బాదుకుంది. "నన్ను ముండ అంటావేం? నీ పొగరు కూల్చ! నీ నోటికి ఎంతవస్తే అంత! నిన్ను....నా అన్న రానియ్యి" ఎదురు తిట్టు తిట్టింది.

"నీ అన్నయ్య!" ఈసడించింది సరస్వతి. "ఎరువు అన్నయ్య కూడా అన్నయ్యేనా? సిగ్గులేదా? ఎక్కడో మారుమూల సంబంధం వెతుక్కుని యిల్లుపట్టావు. అన్నయ్యట!"

"హవ్వ....ఎక్కడో ఏమిటి? మా పిన తల్లి కొడుకు గాదు నీ మొగుడు. అసలు వాడిని రానియ్యి. నిన్ను వరికించి వుప్పుపాత పారవేయకపోతే!"

"ఆఁ వేయకేం? వేశావుగదా! నీ అన్నగారి మొదట పెళ్ళాన్ని కిరసనాయలు పోసి తగలపెట్టావు కదూ!"

"నే....నా?"

"లే....దు....నేను! కుంపటి దగ్గర వంటచేసేటప్పుడు వెనకపాటు కిరసనాయిలు ఒంపి నిప్పుముట్టించి అగ్ని ప్రమాదంలో చనిపోయినట్టు చెప్పలేదే పాడుముండా! చచ్చి నీ మొగుడు సుఖపడ్డాడు. వాడినికూడా చంపే

వుంటావు."

"ఆ(! ఆ(!" రాజమ్మ నేలమీద పడిపోయింది. ఉలుకూ పలుకూ లేదు. నిమిషాలు గడుస్తున్నాయి.

"లేవే....లే....నీ నంగనాచి వేషాలు నా దగ్గర కాదు గానీలే....ఎవడూ రాడు నిన్ను మేలుకొలిపి లేపడానికి" సరస్వతి రాగాలాపనలో అభినయంచేసింది. ఆ అభినయంలో వుండిపోయి గుమ్మంవద్ద అలికిడి కావడం ఆమె గమనించలేదు.

"ఏమయింది? ఏం జరిగింది? రాజు అలా పడిపోయిం దేమిటి?" ఆత్రంగా లోపలికి అడుగుపెట్టాడు గోవింద రావు.

"ఏం జరగాలి మీ చెల్లెలికి? తను ఏమైనా అంటే పడాలి. ఎదుటివాళ్ళు అంటే వెంటనే మూర్ఛ రోగం ముంచుకువస్తుంది. నటనకేం తక్కువ? కొంపల కొరివి?" యెకసక్కెంగా అంది సరస్వతి.

"సరసూ!" అరిచాడు గోవిందరావు, వొంగి రాజమ్మ నాడి చూస్తూ.

"ఏం? మీ చెల్లెలు నన్ను అంటే సహించగలరు గానీ, నేను అంటే సహించలేరా? కొంపల కొరివి కాకపోతే మన సంసారంలో నిప్పులు పోయాలని ఎందుకు ప్రయత్నం చేస్తోంది? మీరు వచ్చాక నన్ను చంపిస్తుందట! మీ చెల్లెలిని యింటిలోంచి బయటకు నెట్టరేం?"

"నోర్ముయ్....రాస్కెల్....తిని కూర్చోలేక ఇద్దరూ జగడం వేసుకుని నా ప్రాణం తీస్తున్నారు."

రాజమ్మ తనంత తనే లేచి కూర్చుంది.

"ఇద్దరనీ ఎందుకు అంటావు? నీ పెళ్ళాన్ని ఒక్కతెనూ అంటే కరుస్తుందా?" అంది రాజమ్మ.



"ఏం తల్లీ! మూర్ఛ రోగం అప్పుడే ముగిసిపోయిందేమిటి? త్వరగా లేచిపోయావు?" మూతి తిప్పింది సరస్వతి.

రాజమ్మ ముందుకు దూకి సరస్వతి కొప్పు అందిపుచ్చుకుంది. సరస్వతి పిడికిలి బిగించి బలంగా విసిరింది. రాజమ్మకి బుగ్గన సమ్మెటలా తగిలి పళ్ళు కదిలినట్టయింది.

"అమ్మో! చంపేశావే!" అరచి రాజమ్మ కూలబడిపోయింది.

గోవిందరావు తలపట్టుకుని నిట్టూర్చి అంతలోనే రెట్టించిన కోపంతో ఆడవాళ్ళిద్దరి జుత్తూ పట్టుకుని బలంగా గుంజసాగాడు. సరస్వతి గోవిందరావు కాళ్ళు పట్టుకు గుంజసాగింది. గోవిందరావు నేలమీద పడ్డాడు. అతడిమీద ఆడవాళ్ళిద్దరూ పడ్డారు.

గోవిందరావు మరింత చురుకుగా లేవబోయాడు. కాని అతడికి నడుంమీద దెబ్బ బలంగా తగిలింది. లేవలేకపోయాడు.

"అమ్మోవ్! అన్నయ్యని చంపేసింది రాక్షసి!" గొల్లు

మంది రాజమ్మ.

"రాజూ....నోరు మూస్తావా! మూయవా!" పీగ్గుగా అరిచాడు గోవిందరావు, ఆడవాళ్ల జుత్తు వదిలి.

సరస్వతి లేచి జుత్తు సర్దుకుని విసురుగా వంట యింటిలోకి అడుగుపెట్టింది.

2

"ఏవమ్మో! సరస్వతమ్మగారూ! పాలు!" పాలవాడు కేకలుపెట్టాడు, దడి బయటనుండి.

రోజూ ఆ వేళకి సరస్వతి వాకిట్లో ముగ్గులుపెడుతూ కనిపించేది అతడికి. ఈ రోజు వాకిలి ఇంకా చిమ్మినట్టే లేదు. పాలవాడు ఆశ్చర్యపోయి మరల పిలిచాడు. ఎవరూ పలకలేదు. దడికున్న తాడువిప్పి లోపలికి వెళ్లాడు. వాకిట్లో ఒక ప్రక్కగా రకరకాల పూలమొక్కలూ, వాటి ప్రక్కగా అరటిచెట్టూ....ఆ ప్రక్కగా....

పాలవాడి గుండె కొట్టుకోవడం నిమిషంపాటు నిలిచి పోయింది. అరటి మొక్కల ప్రక్కగా ఎవరో ఆడమనిషి పడివుంది. ఆమె పొట్టలో కత్తి పిడివరకూ దూరబడింది. పిడిమీద చింతపిక్కలంటించినట్టు రక్తపు కెరళ్ళు! శవం కుడిచెయ్యి కత్తి పిడికి కాస్త దిగువగా పట్టుకునివుంది. పాలవాడు పొలికేకలు పెట్టాడు. ఇంటి తలుపులు తెరుచు కున్నాయి. కళ్ళు నులుముకుంటూ గోవిందరావూ, అతడి వెనకనే రాజమ్మా బయటికి వచ్చి పాలవాడికేసి విడ్డూ రంగా చూశారు. పాలవాడు లబలబలాడుతూ శవం పడి వున్నవైపు చూసాడు.

గోవిందరావూ, రాజమ్మా అటు చూచి నిశ్చేష్టు లయ్యారు.

"సరస్వతీ!" అరిచాడు గోవిందరావు, ఆమె పడి

వున్న వైపు పరుగులుతీస్తూ.

"యెంత పని చేశావు? వదినా?" గొల్లుమన్నది రాజమ్మ.

ఇంటి చుట్టుప్రక్కలవాళ్ళు ఈ గలభాకి లేచి ఒక్కొక్కరుగా గోవిందరావు ఇంటివాకిట్లోకి వచ్చి చేరుకో సాగారు. వాళ్ళలో యెవరో పోలీసులకు టెలిఫోన్ చేశారు.

పది నిమిషాల్లో క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, డిటెక్టివ్ శిరీష్, తదితర అత్యవసర సిబ్బందీ వచ్చారు. సాంకేతిక నిపుణులు జనాన్ని ఒత్తిగించుకుని వెళ్లి శవాన్ని రకరకాల భంగిమల్లో ఫోటోలు తీయడమూ, వేలిముద్రల కోసం ప్రయత్నించడమూ, చుట్టుప్రక్కల అనుమానాస్పదమైన వస్తువుల కోసం గాలించడమూ చేయసాగారు.

గోపాల్ దగ్గరకు గోవిందరావు వచ్చి తనని తాను పరిచయం చేసుకుని. "ఆమె నా భార్య! పేరు సరస్వతి" అని రాజమ్మని పరిచయం చేశాడు.

రాజమ్మ భయంగా చూచింది.

"ఆమె ఎలా చనిపోయారో మీకు తెలుసా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్.

"తెలియదు సార్!" అన్నాడు గోవిందరావు.

"రాత్రి భోజనాలయాక మామూలుగా నిద్రపోయాం. తెల్లవారి లేచాక ఇలా అవుతుందనుకోలేదు" అన్నది రాజమ్మ.

"చెల్లీ! భోజనానికి ముందు జరిగిన రభస చెప్పవమ్మా!" అన్నాడు గోవిందరావు కళ్ళనీళ్ళు పర్యంతంగా.

రాజమ్మ నట్టుతూ తనకీ సరస్వతికీ జరిగిన గొడవ వివరించింది.

"ఎప్పుడూ జరుగుతోన్న గొడవలే గదా అని నేను

వుపేక్షించాను. ఇలా ఆత్మహత్య చేసుకుంటుందనుకో లేదు సార్! నాకు చాల అన్యాయంచేసింది సరస్వతి!" గొల్లుమన్నాడు గోవిందరావు.

డిటెక్టివ్ శిరీష్ వాళ్లని విడిచిపెట్టి శవం దగ్గరకు వెళ్ళాడు. శవం కళ్ళు మూసివుంది. ఒంటిమీద పల్చటి నైలెక్సు చీర మోకాళ్లపైకి చెదిరిపోయింది. పొట్ట భాగం కమిలిపోయి వుంది. శవం క్రిందవున్న నేలను పరిశీలించి చూశాడు. అతడి కళ్ళు మెరిశాయి. శవాని కటూ ఇటూ తడిగా వుంది. రొచ్చు వాసనతో బాటు ఒక రకమైన వాసన, సహించగలిగే వాసన వేస్తోంది.

డిటెక్టివ్ శిరీష్ వొంగి వాసన ముక్కుల నిండుగా పీల్చుకున్నాడు. సందేహంలేదు. తియ్యటి వాసన! అపరాధ పరిశోధనలో అ ఆలు దిద్దేవాడికికూడా ఆ వాసన క్లోరోఫాం దని తెలుస్తుంది. సరస్వతి క్లోరోఫాం హెచ్చు మొత్తంలో పీల్చివుంటుంది.

అయితే రొచ్చువాసన యెలా వచ్చింది? అసలా వాసన రాబట్టే క్లోరోఫాం వాసన వచ్చివుంటుంది.

క్లోరోఫాం పీల్చిన వారి మూత్రం తియ్యటి వాసన వస్తుంది. అంటే సరస్వతి మూత్రం విడుదల చేసిందా? చనిపోయాకనా? యెలా సాధ్యం?

డిటెక్టివ్ శిరీష్ కత్తిపోటును పరిశీలించాడు.

కత్తి పొత్తి కడుపులో దిగింది. అది వున్న కోణాన్ని బట్టి లివర్ వున్నవైపు గాక వెన్నుదిగువకి దిగినట్టు అర్థం చేసుకున్నాడు. కత్తి మొనకి మూత్రాశయం గాయపడి కత్తి గాయంలోకి మూత్రం వెలువడి వుంటుంది. అందుకే క్లోరోఫాం వాసన వ్యాపించింది.

ఇంతలో ఇన్‌స్పెక్టర్ గోపాల్ అక్కడికి వచ్చాడు.

"పాపం! సరస్వతి గృహచ్ఛిద్రాలను సీరియస్‌గా తీసుకుని ఆత్మహత్యకి పాల్పడింది. శవాన్ని తరలించుదామా-మార్చురీకి!" అన్నాడు గోపాల్.

డిటెక్టివ్ శిరీష్ అతడి చెవిలో, "ఆత్మహత్య అయితే రక్తం మడుగు ఏది? కత్తిపోటు అంత లోతుగా తగిలాక స్రవించే రక్తానికి అంతు వుంటుందా?" అన్నాడు.

గోపాల్ మెల్లగా నవ్వి, "గాయాన్నిబట్టి రక్తస్రావం వుంటుంది చూడు! కత్తిపోటు మూత్ర పిండాలను గాయపరచి వుంటుంది" అన్నాడు.

"అయితే శవం చుట్టూ వున్న గాల్లో తియ్యటి వాసన ఏమిటి?"

గోపాల్ గాలి పీల్చి చూచి, "అవును. క్లోరోఫాం వాసన!" అన్నాడు.

"సరస్వతి క్లోరోఫాం పీల్చి, మరీ ఆత్మహత్య చేసుకుని వుండాలి."

గోపాల్ పిగ్గుపడ్డట్టు చూశాడు.

"అటు చూడు పెదాల ప్రాంతంలో గుడ్డపోగులు!" శిరీష్ వంగాడు.

"ఇంట్లో క్లోరోఫాంవుంది. వెతికించు" అన్నాడు శిరీష్.

పోలీసు సిబ్బంది యిల్లంతా వెతికారు. క్లోరోఫాం సీసా దొరికింది.

[ఇదీ కథ. దీనిలో సరస్వతిని చంపినదెవరో పరిశోధించి వ్రాయండి. మీ సమాధానం ఒక పోస్టు కార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, 7-3-'80 తేదీ లోగా మాకు పంపండి. హోం. డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు పోస్టు స్టాంపులు జతపరచాలి. అత్యుత్తమ పరిశోధకులు యిరువురికి చెరొక రు. 25/-లు చొప్పున బహూమతి పంపుతాము. ఫలితాలు మే '80 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

దొంగతనం ప్రమాదం

వసుంధర

జేబు దొంగతనాలు కాస్త కష్టంగానే వుంటోంది నాకు.

ఇప్పుడొస్తున్న కొత్తమోడల్ బట్టలు జేబు దొంగతనానికి అనుకూలంగా ఉండడం లేదు. పట్టుబడితే చావగొట్టేస్తున్నారు. ఇంతా కష్టపడి ఏ పర్సో కొట్టేస్తే అందులో ఒకోసారి చిల్లరపైసలు కూడా ఉండడంలేదు.

నా పద్ధతి మార్చాలని చాలా కాలంగా ప్రయత్ని స్తున్నాను నేను. ఇళ్ళలో దూరి దొంగతనాలు చేయడం సులభం అనిపించింది. అందులోనూ ఈ రోజుల్లో చదువు కున్న ఆడవాళ్ళవి మరీ పిరికి గుండెలు. ఒంటరిగా ఉన్న ప్పుడు కత్తి చూపిస్తే నోరెత్తకుండా మనం చెప్పినట్లు వింటారు.

ఈ విషయమై బాగా ఆలోచించి, నేను రామారావు పేటలోని ఒక వీధిని ఎన్నుకున్నాను. ఆ వీధిలోని ప్రత్యే కత ఏమిటంటే అటూ యిటూ కలిపి పాతికిళ్లున్నాయి. అన్నిళ్ళలో మగవాళ్లు ఉద్యోగానికి పోతారు. ఒక్క ఆడ వాళ్లు మాత్రమే వున్న యిళ్ళు ఎనిమిది వున్నాయి. అంటే ఆ ఎనిమిదిళ్ళలోనూ మొగుడూ పెళ్ళాలిద్దరే వుంటున్నా రన్నమాట.

ఆ వీధిలో ఆడవాళ్ళకెవరింటి పనులు వారు చూసుకోవ డమేకానీ—ఎదురింటి వాళ్ళతో కబుర్లుచెప్పే అలవాటు లేదు. అంతగా అయితే సినిమాలకు పోతారు. ఈ వివరా లన్నీ సంపాదించడంకోసం నేను ఒకరోజు జనాభాలెక్కల వాడి పేరుతో చాలా వీధులు తిరిగాను. ఈ వీధిలోని వివ రాలు నాకు బాగా నచ్చాయి.

ఇప్పుడు నేను ఆ ఎనిమిదింటిలోనూ ఒక యింటిని యెన్నుకోవలసి వుంది.

ఒక ఇంట్లో వృద్ధదంపతులుంటున్నారు. ముసలాయన ఇంకో ఏడాదిలో రిటైర్ కానున్నాడు. పిల్లలు దూర ప్రాంతాన వుంటున్నారు. ఈ ఇంటిజోలికి నేను వెళ్ళ దల్చుకోలేదు. ముసలావిడ మంచి బలంగా వుంది. అందు లోనూ ముసల్ది కావడంవల్ల ఏ మానభంగమో జరుగు తుందన్న భయం వుండదు. పెద్ద గొంతుపెట్టి అరిచిం

దంటే చాలా పెద్ద రిస్కు. నిజంగావే కత్తితో పొడవాల్సి వుంటుంది. ఏదో నా రోజులు దొంగలా వెళ్ళిపోతే చాలు-హంతకుడ్ని కావాలని నాకు లేదు మరి!

రెండిళ్ళలో ఆడవాళ్ళకు పిల్లలున్నారు కానీ వాళ్ళు సెలవులకు చుట్టాలిళ్ళకు వెళ్ళారు. వాళ్ళిద్దరికీ నలభై ప్రాంతాల్లో వుంటుంది వయసు. వాళ్ళవి చాలా పెద్ద కంఠాలు. ఎవరూ అని అడగడానికొస్తేనే వీధంతా హడావుడి అయిపోతుంది. కాస్త సన్నని కంఠం వాళ్ళుంటేనే నాకు లాభం. అందుకని వాళ్ళిద్దర్ని కూడా వదిలేశాను.

ఇంక అయిదుగురు మిగిలారు. ఈ అయిదుగురుకూడా వయసులో ఉన్నవారే. వాళ్ళ వయసులు పద్దెనిమిదినుంచి పాతికదాకా వుంటాయి. కొందరు క్రొత్తగా కాపురానికి వచ్చారు. కొందరు అయిదేళ్ళనుంచి కాపురం చేస్తున్నారు. వీళ్ళలో యెవరికీ సంతానం లేదు. కానీ ఇద్దరు చూడ్డానికి పరమ అసహ్యంగా ఉంటారు. ఒకసారి వాళ్ళవంక చూస్తే ఎందుకు చూశాంరా భగవంతుడా అనిపిస్తుంది మగాళ్ళకి. అలాంటివాళ్ల ఇళ్ళకు వెళ్లడం నా కిష్టంలేదు.

మిగతా ముగ్గురూ చూపులకు బాగుంటారు కానీ ఒకమ్మాయికి బొత్తిగా పద్దెనిమిదేళ్లు. చూడ్డానికి ఎంత అమాయకంగా వుంటుందంటే నేను కత్తి చూపిస్తే ఆమెకు గుండె ఆగిపోయినా ఆశ్చర్యం లేదు.

ఇంక మిగిలిన ఇద్దర్లో ఒకామె నుదుట రూపాయ కాసంత కుంకుమతో చూడ్డానికి పవిత్రంగా వుంటుంది. ఆమెను చూడగానే నాకు గౌరవభావం కలిగింది. అటువంటి ఆమె ఇంట దొంగతనం చేస్తే దేవుడు నన్ను క్షమించడనిపించింది. నేను దొంగనే కావచ్చు కానీ నాకు దైవభక్తి ఉంది. నా దొంగతనాలకు దేవుడే శ్రీరామ

రక్షగా ఉంటున్నాడని నా విశ్వాసం.

ఇంక ఒకే ఒక్కామె మిగిలింది. ఆమె పేరు జానకి. వయసు ఇరవైకీ పాతిక్కీ మధ్యవుంటుంది. చూపులు అదో రకంగా—కవ్విస్తూ వుంటాయి. కావడానికి సంసారస్త్రీ అయినా పురుషుల్ని రెచ్చగొట్టే లక్షణాలు ఆమె శరీరం లోనూ ప్రవర్తనలోనూ కూడా వున్నాయి.

జానకి ఇల్లు దొంగతనానికి అన్నివిధాలా అనువైన దని నాకు అనిపించింది. పైగా ఆమె ఖరీదైన బట్టలు కడు తుంది. మెళ్ళోనూ, చేతులకూ బంగారం వుంది. ఆమె ఇంట్లో కాస్త వస్తువులు, డబ్బు కిట్టవచ్చు.

జానకి భర్త ఆఫీసుకు పది గంటలకు వెడతాడు. తిరిగి సాయంత్రం అయిదున్నరకు వస్తాడు.

సరిగ్గా పదకొండున్నరకు నేను జానకి ఇంటికి వెళ్లాను. తలుపుతట్టాను. గుండెలు కాస్త దడదడలాడుతున్నాయి. ఇంట్లో జానకి ఒక్కర్తే వుండాలి నా లెక్క ప్రకారం. ఇంకెవరైనా వుంటే నా దురదృష్టం.

లోపల్నుంచి అడుగుల చప్పుడు మెత్తగానే వినిపి స్తోంది. కాలిగజ్జెల గల గల కూడా వినపడుతోంది. తప్ప కుండా జానకే అయుండాలి.

తలుపులు తెరుచుకున్నాయి. అమ్మయ్య—ఆమె జానకే!

జానకి నా వంక చూపి—"కొద్దిరోజుల క్రితం మీరు వచ్చి ఏవో జనాభా లెక్కలడిగారు కదూ?" అంది.

"అవునండి-" అన్నాను. ఆమె జ్ఞాపకశక్తిని అభి నందించకుండా వుండలేకపోయాను.

"మళ్ళీ ఏం పని?" అందామె చిలిపిగా నవ్వుతూ.

పరీక్షించిచూస్తే ఆమె నవ్వు తీరే అంతసీ మనిషి మంచిదనీ అనిపించింది.

"నేనొక నిరుద్యోగినండి—ఏదో చిన్న వుద్యోగం సంపాదించుకుని ఇలా తిరుగుతూంటాను—" అని నవ్వాను—"ఈరోజు పోస్టల్ సేవింగ్సు పనిమీద వచ్చాను. అంతా తీరుబడిగా చెబుతాను. కాపివి మంచినీళ్ళిస్తారా?"

"దానికేం భాగ్యం-" అంటూ లోపలకు వెళ్ళిందామె. నేనుకూడా గుమ్మంలోంచి లోపలకు వెళ్లాను. అక్కడ చిన్న హాలుంది. ఒక సోఫా సెట్టుంది. కుడి పక్కగా ఓ గది వుంది. ఆ గదిలోకే జానకి వెళ్ళింది. ఎడమపక్క ఓ గది వుంది. చూడ్డానికి కొట్టు గదిలా వుంది. గది తలుపులు బార్లా తెరచివున్నాయి. లోపల్నుంచి పాత సరుకుల్లాంటివి కనబడుతున్నాయి.

ఎడమపక్కనే కొట్టుగది నానుకుని మరో గుమ్మం వుంది. ఆ గుమ్మంలోంచి దొడ్డి కనబడుతోంది.

ఒకడుగు వేసి ఆ గుమ్మం దగ్గరకు వెళ్లాను. దొడ్లో నుయ్యి వుంది. నూతిచుట్టూ పెద్ద పళ్ళెం వుంది. వీధి వైపుకు ఓ గోడ వుంది. గోడలో గుమ్మం వుంది. బహుశా పనిమనుషులు వచ్చిపోవడాని కనుకుంటాను. అప్పుడే నా కళ్లు మెరిశాయి. దొడ్డిగుమ్మం తలుపు తీసి వుంది. అంటే తలుపులు బార్లా తెరిచి లేవు. దగ్గరగా వేసి ఉన్నాయి.

చాలామంది దొడ్డితలుపు విషయంలో పగలు అశ్రద్ధగా వుంటారు. ఇప్పుడు నా మనసులో ఒక పథకం చోటు చేసుకుంటోంది. ఆ దొడ్డిగుమ్మం ద్వారా ఇంట్లో ప్రవేశించి ఈ గుమ్మంలోంచి లోపలకు రావచ్చును. అలా రావడంవల్ల ఒక ఉపయోగం వుంది. జానకిని ప్రత్యేకంగా బెదిరించనవసరం లేకుండా ఆమె దృష్టిలో దొంగను కాకుండా ఇల్లు దోచుకుపోవచ్చు.



అలా చేయాలని ఎందుకనిపించిందంటే జానకి నన్ను గుర్తుపట్టడమే కాకుండా అభిమానంగా పలకరించింది. అంత అభిమానంగా పలకరించిన ఆమెను కత్తితో బెదిరించాలనిపించడంలేదు. జేబులు తడుముకున్నాను. కత్తి తగిలింది.

కానకి వచ్చేలోగా మళ్ళీ వీధిగుమ్మం చేరుకున్నాను.

మంచినీళ్లగ్లాసుతో వచ్చిన జానకి నన్నుచూపి నొచ్చుకుని—"అరే—లోపలకు రాకుండా అలా బైట నిలబడిపోయారేం? నేను రమ్మనమని చెప్పడం మరిచిపోయినట్లున్నాను....." అంది.

"అబ్బే—దాన్దేముందండీ-ఫరవాలేదు—" అన్నాను. ఆమె నాకు మర్యాద ఇస్తూంటే నేను కుంచించుకు పోతున్నాను. బహుశా నేను దొంగతనానికి పనికిరానేమో?

జానకి నాకు మంచినీళ్లగ్లాసు అందించింది. ఆ చేతికి నాలుగు బంగారు గాజులున్నాయి. మంచినీళ్లగ్లాసు అందించేప్పుడు ఆమె చేతివ్రేళ్లు నాకు తగిలాయి. అందులో రెండు

వేళ్లకు బంగారు వుంగరాలున్నాయి. అప్రయత్నంగా తలెత్తి చూశాను. ఆమె మెడలో నాలుగుపేటల చంద్ర హారం, ఒక రాళ్ల నెక్లెస్ వున్నాయి. అదికాక మంగళ సూత్రాల నానుతాడు వుంది. కానీ దాని జోలికి వెళ్ళదల్చు కోలేదు నేను. నాకు ఛాలా సెంటిమెంట్సున్నాయి.

మంచినీళ్ళు తాగేక—"మీకు పోస్టల్ సేవింగ్సు మీద ఇంట్రస్టు వుందా?" అనడిగాను.

"వినడానికా? కట్టడానికా?"

"కట్టడానికే!" అన్నాను.

"చెప్పండి—వింటాను — విన్నాక కట్టాలనిపిస్తే చూద్దాం—" అంది జానకి.

నేను జేబులోంచి ఓ పాంప్లెట్ తీసి ఆమెకిచ్చాను. ఆమె దానివంక పరీక్షగా చూసి మళ్ళీ నా కిచ్చేసి— "ఇంగ్లీషు చదవగలను కానీ అంత బాగా అర్థంకాదు నాకు-" అంది.

ఆమెకు వివరించి చెప్పడం మొదలుపెట్టాను. ఆమె చాలా శ్రద్ధగావిని నేను బాగా చెబుతున్నానని మెచ్చుకుని "ఒక నెలరోజుల తర్వాతరండి ప్రస్తుతానికి మాకు చాలా ఖర్చులున్నాయి" అంది.

వెంటనే కత్తితీసి ఆమెను బెదిరించాలనిపించింది కానీ బలవంతంమీద నిగ్రహించుకున్నాను.

నేను ఇంట్లోంచి బయటకు వచ్చాను. ఆమె తలుపు వేసుకుంది. నేను గోడదగ్గర గుమ్మాన్ని మరోసారి పరీ క్షించాను. కొద్దిసేపట్లో ఈ గుమ్మంద్వారా ఈ యింట్లో అడుగుపెట్టాలి.

రాత్రయితే దొడ్డిగుమ్మం తలుపు తీసివుండక పోవచ్చు. అది తీసివున్నా యింటి తలుపులన్నీ వేసేసివుంటాయి.

లోపల అడుగుపెట్టడం సాధ్యంకాదు. అంతా కష్టపడి లోపల అడుగుపెడితే ఇంట్లో యిద్దరు మనుష్యులుంటారు. వాళ్ళలో ఒకడు మగవాడౌతాడు.

దొంగతనం చేయాలనుకుంటే ఇప్పుడే వెళ్ళాలి. ఎక్కడా వీధిలో జనసంచారంలేదు. ఎవ్వరూ నన్ను చూడలేదు. ఒకసారి ఆ వీధిలో చివరివరకూ వెళ్ళి మళ్ళీ వెనక్కువచ్చి చటుక్కున దొడ్డిగుమ్మం తలుపు తోసుకుని లోపలకు ప్రవేశించి తలుపు మళ్ళీ జారగిల వేశాను.

ఒకసారి దొడ్డిని పరిశీలించి చూశాను. దాక్కునేందుకు చెట్లున్నాయి, మల్లెపొదలున్నాయి.

ఎక్కడా దొడ్లో ఎవరి అలికిడీ లేదు.

నేను క్షణం తటపటాయించాను. ఇందాకా చూపిన హాలు గుమ్మం దగ్గరకు వచ్చి లోపలకు తొంగి చూశాను. అక్కడ యెవరూ లేరు.

చటుక్కున హాల్లో ప్రవేశించాను.

నేను హాల్లో ప్రవేశించానో లేదో దూరంగా గజ్జెల చప్పుడు వినిపించింది. అప్రయత్నంగా అక్కడున్న కొట్టు గదిలో దూరాను. అదృష్టమేమిటంటే ఆ హడావుడిలో నేను ఏ వస్తువునీ తన్నలేదు.

జానకి హాల్లోకి వచ్చి వీధిగుమ్మంవరకూ వెళ్ళి "తలుపు వేసేవుంది" అని స్వగతంగా అనుకుని మళ్ళీ లోపలకు వెళ్ళిపోయింది.

నేను ఒక్క నిముషం ఆగి కాస్త కదిలాను. కొట్టు గదిలో మసకవెల్తురుగా వుంది. అక్కడ నాకు పనికొచ్చే వస్తువులేవీ వున్నట్లులేదు. ఒక మూల ట్రంకుపెట్టిలాంటిది వుంది. అది చాలా పాతది. ఒకసారి అలాంటి ఛోటే

నిధులు దొరకవచ్చు. అలాగనుకుని చప్పుడు చెయ్యకుండా పెట్టె తెరిచాను.

అందులో నాకు పనికొచ్చే వస్తువు లొక్కటీ లేవు. కొన్ని పాతగుడ్డలు, పాత నవారు, విరిగిన బొమ్మలు, రంగు వెలసిన క్యారంబోర్డు బిళ్ళలు—ఇంకా అంతకంటె చెత్త సరుకులూ ఉన్నాయి. నెమ్మదిగా పెట్టె మూత వేసేశాను.

ఇంతలో హాల్లో గజ్జెల చప్పుడు వినపడింది. నేను చటుక్కున గదిమూలకు వెళ్ళాను. మరుక్షణంలో జానకి కొట్టుగది గుమ్మంముందు ప్రత్యక్షమైంది.

నేను ఊపిరి బిగబట్టాను. నే నామెకు కనబడ్డంలేదని తెలుసు. కానీ నాకామె కనపడుతోంది. ఆమె ఈ సమయంలో కొట్టుగదిలోకి యెందుకొచ్చిందీ అన్న అనుమానం నన్ను పీడిస్తోంది. అప్రయత్నంగా జేబు తడుముకున్నాను. జేబులో కత్తి ఉంది. నాకు ధైర్యం పెరిగింది. అయినా ఒంటరి ఆడది—యెలాగో అలా యెదిరించ వచ్చునామెను.

ఆమె చేతిలో ఏవో బట్టలున్నాయి. అవి ట్రంకుమీద పెట్టి వెళ్ళిపోయిందామె

ఆమె వెళ్ళేముందు కొట్టుగది తలుపులు దగ్గరగా జేరవేసింది. గొళ్ళెం పెడుతుందేమోనని భయపడ్డాను కానీ అలా జరగలేదు. తేలికగా నిట్టూర్చి ఆమె వేసిన బట్టలేమిటా అని చూశాను. అవి ఒక పురుషుడి బట్టలు. పాంటు, షర్టు, బనియన్, అండవేర్ ఉన్నాయి. నాలో నేనే నవ్వుకున్నాను.

చాలామంది డబ్బున్నవాళ్ళు చేసేపనే ఇది. బట్ట లన్నింటినీ ఒక సెట్టుగా కలిపి వాడతారు. ఒక సెట్టుగానే విడిచి

పెడతారు. ఈ బట్టలు కొట్టుగదిలోకి వచ్చేయంటే—పాత బట్టల క్రింద మారాయన్నమాట. ఆమె వాటిని ఏ స్టీలు సామానువాడికో ఇస్తుంది.

చూడ్డానికవి యింగా గట్టిగానే ఉన్నాయి. వాళ్ళకప్పుడే దిగదుడుపు అయిపోయాయి. అయినా గదిలో వెళ్తురాట్టే లేదు. బహుశా ఆ బట్టల రంగు బాగా వెలిసి ఉండవచ్చు. ఇవన్నీ నాకు ముఖ్యం కాదు. నేను ప్రాణాలకు తెగించి ఈ యింట్లో అడుగుపెట్టాను. విలువైనదేదో సంపాదించక పోతే నా ప్రయత్నం వ్యర్థం.

మొట్టమొదటిసారిగా నాకులా దొంగతనానికి ప్రయత్నించి యెక్కువ డబ్బు సంపాదించినవారెవరైనా ఉన్నారో లేదో కానీ ఈరోజు నేను చాలా తెలివితక్కువగా ప్రయత్నించినట్లు యిప్పుడే గ్రహించాను. ఇందాకా ఆమె మంచినీళ్లందించినపుడు నాకు మంచి అవకాశం వచ్చింది. అప్పుడు కత్తి చూపి బెదిరించి ఆమె నగలు కాజేయవలసింది. వాటి విలువ కొన్ని వేలుంటుంది. ఇంట్లో అంత విలువ చేసే క్యాషుగానీ ఇతర సామగ్రిగానీ దొరకదుగదా! దొరికినా అది బయటకు తీసుకువెళ్ళడం కష్టం. నగలైతే జేబులో వేసుకుని పోవచ్చును.

జరిగిందానికప్పుడు విచారించి లాభంలేదు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. ఇందాకా దొరలా ప్రవేశించి ఇంటి ఆనుపానులు తెలుసుకున్నాను. ఇప్పుడు దొంగలా ప్రవేశించాను యింట్లో. నేనెవరో తెలియకుండా ఆమెను బెదిరిస్తాను.

ఈ ఆలోచన రాగానే జుట్టు రేపుకున్నాను. ముఖానికి అడ్డంగా రుమాలు పెట్టుకున్నాను. నా పాంటూ, షర్టూ విప్పి ఆమె అక్కడ వదిలేసిన పాంటూ, షర్టూ వేసు

కున్నాను. బట్టలు నాకు బాగా లూజుగా ఉన్నాయి.

ఉంటే ఉన్నాయిగానీ ఈ బట్టల్లో ముఖానికి అడ్డంగా రుమాలు కట్టివున్న నన్నామె సులభంగా గుర్తించలేదు. నెమ్మదిగా కొట్టు గది తలుపులు తెరిచి — సందులోంచి హాల్లోకి చూశాను. అక్కడెవ్వరూ లేరు. హాల్లో ప్రవేశించి మళ్ళీ కొట్టు గది తలుపులు జేరగిలవేశాను.

ఒక్కక్షణం ఊపిరి బిగబట్టాను. అప్పటికి కాస్త ఉద్వేగం తగ్గింది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ ఇంకో గుమ్మం దగ్గరకు నడిచి తెరపక్కనుంచి తొంగిచూశాను. అక్కడ చూసిన దృశ్యం నన్ను షాక్ తినిపించింది.

అంతసేపూ నేను యింట్లో జానకి ఒక్కర్తే ఉందనుకున్నాను. కానీ యింటి యజమాని కూడా యింట్లోనే ఉన్నాడని తెలియదు. గదిలో మంచంమీద యింటి యజమాని ఉన్నాడు. అతడి వీపు నావైపు తిరిగి ఉంది. అతని వంటిపై అస్తవ్యస్తంగా లుంగీ పంచ ఉంది. అతనికి అటుపక్క ఆమె ఉందనడానికి సూచనగా గుసగుసలు వినపడుతున్నాయి.

వాళ్ళిద్దరూ భార్యాభర్తలు-మంచి మూడ్‌లో వున్నట్లున్నారు. ఇప్పుడు నేనేం చేయాలి?

నేను నెమ్మదిగా వంగుని పాకుతూ గదిలోకి ప్రవేశించాను. వారు నన్ను గమనించలేదు.

గది గుమ్మానికి యెదురుగా మంచం వుంది. మంచానికి కొంచెం అవతలగా డ్రెస్సింగ్ టేబుల్ వుంది. దాని పక్కనే ఓ బీరువావుంది. నేను డ్రస్సింగ్ టేబుల్‌కూ, బీరువాకూ మధ్య చేరుకున్నాను.

వాళ్ళిద్దరూ మంచంమీంచి లేచి నిలబడితే తప్ప నేను

కనబడను.

అప్రయత్నంగా నా దృష్టి డ్రెస్సింగ్ టేబుల్ మీదకు పోయింది. డ్రెస్సింగ్ టేబుల్ సొరుగు ఒకటి తెరచివుంది. అందులోంచి స్పష్టంగా ఆమె నగలు కనబడుతున్నాయి. ఆ నగలన్నీ ఇందాక నేను చూసినవే! మంగళసూత్రాలతో సహా ఆమె వదిలేసి ఆ సొరుగులో వుంచింది. అంటే అదృష్టం నన్ను వరించిందన్నమాట!

అది ఆమె యిల్లు. అక్కడున్నది ఆమెభర్త. అందు వల్లనే నిర్భయంగా నగలన్నీ వలిచి అక్కడ పెట్టింది జానకి. అయినా నగలన్నీ తీయడమెందుకో-ఏమో-పెళ్ళైన వాళ్ళ సరదాలు నాకేం తెలుస్తాయి?

హఠాత్తుగా అతను మంచంమీంచి దిగాడు. లుంగీని వళ్ళంతా చుట్టబెట్టుకున్నాడు. నేను చటుక్కున డ్రెస్సింగ్ టేబుల్ అద్దంవెనక్కు వెళ్ళాను. అదృష్టవశాత్తూ నేనతని కళ్ళబడలేదు. అతన్నిమాత్రం నేను స్పష్టంగా చూశాను.

మనిషి చూడ్డానికి వస్తాదులా వున్నాడు. కండలు తిరిగిన అతని శరీరం చూస్తూంటే నాకు కళ్ళు తిరిగాయి. ఇతగాడికి నేను దొరికానంటే చచ్చానన్న మాటే!

ఆమె నెమ్మదిగా అతన్ని ఏదో అంటోంది. అతను అస్పష్టంగా ఏదో గొణిగాడు.

కథల్లోవర్ణించే ప్రణయకలహం కాబోలు-ఒక నిముషం అతను అక్కడే నిలబడి ఏదో అని మళ్ళీ మంచంమీద పడుకున్నాడు.

నేను వెంటనే డ్రెస్సింగ్ టేబుల్ ముందుకు వచ్చి యెంతో జాగ్రత్తగా నగలను నా జేబులోకి తోసేశాను.

నా అదృష్టం చాలా గొప్పది. మొట్టమొదటి దొంగ తనంలోనే పెద్దబేరం కలిగింది.

సొరుగు తెరిచేవుంది. అలాగే వదిలేస్తే నగలు పోయాయని వెంటనే తెలిసిపోతుంది గదా—అందుకని సొరుగును నెమ్మదిగా వెనక్కి తోసేశాను.

ఇప్పుడు నేనా గదిలోంచి బయటపడాలి.

మంచంమీద వాళ్ళేం చేస్తున్నారో నాకు కనబడ్డంలేదు. వాళ్ళముఖాలు గుమ్మంకేసే తిరిగివుంటే నాకు ప్రమాదం. నేను బయటకు పోవడానికి ఆ గుమ్మమే దారిలావుంది. ఇటువైపు యింకో గుమ్మం వుంది కానీ పరిచయంలేనిది. తెలిసినదారిలో పారిపోవడం నాకు క్షేమం.

నేను మంచాన్ని సమీపించాను.

నా గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. నేనా పహిల్వాన్ కంటబడ్డానంటే నా పని అయిపోయిందన్నమాటే! పులుసులోకి ఎముక లేకుండా చావగొట్టగలడతను నన్ను.

నేను మునికాళ్ళమీద లేచినిలబడి ఒకసారి మంచం వైపు చూశాను.

మంచంమీద యిద్దరూ వున్నారు. ఆమె వెల్లకితలా పడుకునివుంది. అతనామె వైపు తిరిగివున్నాడు. హఠాత్తుగా ఆ క్షణమాత్రంలోనే ఆమె నన్ను చూపిందేమోనని అనుమానం కలిగింది నాకు. చటుక్కున డ్రెస్సింగ్ టేబుల్ అద్దంవెనక్కి వెళ్ళిపోయాను. ఆ స్థలం నాకు చాలా క్షేమంగావుంది.

నేననుకున్నంతా అయింది "ఎవరో మంచం వెనక నుంచి నన్ను చూచినట్లుంది" అన్న ఆమె కంఠం నాకు వినబడింది.

"అంతా నీ అనుమానం - ఇప్పుడెవరొస్తారు!" విసుగ్గా అన్నాడతను.



"ఎవరైనా దొంగేమో?"

"ఇంత పట్టపగలు - దొంగాడా? ఈ వస్తాదు కండలు వాణ్ని పిండిచేసేయవూ?"

అప్రయత్నంగా వణికిపోయాను నేను.

ఆమె చటుక్కున మంచం దిగింది.

నేనామెను చూసే అవకాశముంది. ఆమెకు నేను కనబడను. నేనున్నవైపు బాగా చీకటిగా వుంది.

అందమైన ఆమె అర్ధనగ్న శరీరం నాలో ఏమీ చలనం కలిగించడంలేదు. ఊపిరి బిగబట్టాను. నా గుండెలనిండా భయం ఒక్కటే వుంది.

అతనూ మంచందిగి చటుక్కున ఆమెను రెండు చేతులతో ఎత్తుకున్నాడు "దొంగంటూ వస్తే క్షణంలో మాయం కాలేడుగదా-వాడి గురించి మన మధురక్షణాలు వృధా చేయను" అన్నాడు.

ఇద్దరూ మళ్లీ మంచం యెక్కారు. ఇప్పుడు వాళ్ళు నాకు కనబడ్డంలేదు. ఆమె మెత్తగా నెమ్మదిగా నవ్వు

తోంది. అతడేవేవో ఛలోక్తులు విసురుతున్నాడు. ఏవేవో చప్పుళ్ళు, నిట్టూర్పులు-వినబడుతున్నాయి. నాకు చాలా బాధగా, బెంగగా, భయంగా వుంది.

మంచంమీద వాళ్ళిద్దరూ స్వర్గాన్ననుభవిస్తున్నారు. డ్రెస్సింగ్ టేబుల్ అద్దంవెనుక నేను నరకాన్ననుభవిస్తున్నాను.

ఒక చిన్న తుమ్ము, దగ్గు చాలు....నా ప్రాణాలు తీయడానికి.

పిక్‌పాకెటింగ్ మానేయాలని నేనీ పనికి పూనుకున్నాను. అయితే యిందులో యెన్ని కష్టాలున్నాయి. క్షణక్షణమూ ప్రాణగండం. అంతాగడిచి క్షేమంగా బయటపడతానో,లేదో తెలియదు. అక్కణ్నించి కదలాలంటే భయంగావుంది.

అలగే బిగబట్టుకుని క్షణమొక యుగంలా అక్కడ వున్నాను.

"ఈ క్షణం యెప్పుడూ ఇలాగే నిలిచిపోతే?" అంటోందామె.

"అంతకుమించిన అదృష్టమేముంటుంది?" అన్నాడతను.

నిజంగా ఆ క్షణం అలాగే నిలిచిపోతుందేమోనని నేను భయపడ్డాను.

వాళ్ళు మంచంమీద సుమారు మూడుగంటలున్నారు. అంతసేపూ వాళ్లేమేం కబుర్లు చెప్పుకున్నారో నాకు తెలియదు? నా జేబులోని నగలతో నేను బయటపడగలనా, లేనా అనే ఆలోచిస్తున్నాను నేను.

నా చేతిగడియారం మూడుగంటలు చూపిస్తూండగా ఇద్దరూ మంచం దిగి బట్టలు కట్టుకున్నారు. అతను లుంగీ పంచతో హాల్లోకి నడిచాడు. ఆమె డ్రెస్సింగ్ టేబుల్ వైపు వచ్చి సొరుగు లాగింది.

"హేయ్ పాండూ___కొంప మునిగింది" అందామె.

ఆ పాండు వెంటనే రాలేదు. ఒక నిముషంలో అతను కంగారుగా వచ్చాడు "కొట్టుగదిలోని నా బట్టలు లేవు. ఇవి నావి కాదు" అన్నాడు.

"సొరుగాలో నా నగలులేవు...." అందామె.

"అయితే యెవరో దొంగ ఇంట్లోకి రానే వచ్చాడు. వాడెవడో యిక్కడే వుంటాడు" అన్నాడు పాండు.

నా జేబులు తడుముకున్నాను. జేబులో నగలున్నాయి కానీ కత్తిలేదు. కత్తిని ఆ ప్యాంటులో వదిలిపెట్టాను పొరపాటున. ఇప్పుడు దొరికిపోతే నాకు ఆత్మరక్షణకు వేరే మార్గంలేదు.

"మంచంకింద చూడు" అంది జానకి. ఆమె కంఠం వణుకుతోంది.

పాండు మంచంకింద వెతికాడు. లేచివచ్చి "తప్పునాదే- నిన్న నగలుతీసేయమన్నాను. ఇప్పుడేంచేయాలి?" అన్నాడు.

"మంగళసూత్రాలు కూడా పోయాయి" ఆమె కంఠం ఇంకా వణుకుతూనే వుంది.

మంగళసూత్రాలు తీసుకువెళ్లే ఉద్దేశ్యం నాకులేదు. వాటిని వదిలిపెట్టేయాలనే అనిపిస్తోంది. అయితే ఇలాంటి సెంటిమెంట్లన్నీ పెట్టుకునే సులభమైన పరిస్థితి నుంచి ఈ గతికి వచ్చానని మనసు దెబ్బలాడింది. కానీ మంచి నీళ్ళిచ్చినప్పుడే జానకిని బెదిరించినట్లయితే ఇంట్లోంచి పాండు వచ్చివుండేవాడు. గదిలోకి తొంగిచూసేవరకూ పాండు ఉనికి నాకు తెలియలేదు. అప్పుడామెను నేను వదిలి పెట్టడంవల్లనే యింతవరకూ నేను క్షేమంగా వున్నాను.

నేనిలా ఆలోచిస్తూవుండగానే "ఆ డ్రెస్సింగ్ టేబుల్

వెనకాల చూడు" అందామె.

చటుక్కున నేను చతికిలబడ్డాను.

పాండు నన్ను సమీపిస్తున్నాను. ఇంక లాభంలేదు. నేను దొరికిపోతాను. దొరికిపోతాను....

దొరికిపోయాను.

పాండు నన్ను బయటకు లాగాడు. కెవ్వున కేక వేయబోయి ఆగింది జానకి.

పాండు నా ముఖంమీది రుమాలు లాగేశాడు.

నా శ్రమంతా వ్యర్థమయింది. దొంగతనంచేసి దొరికిపోయాను. దొంగగా జానకి కళ్లబడ్డాను.

"ఇతనా?" అంది జానకి ఆశ్చర్యంగా.

"ఇతను నీకుతెలుసా?"అన్నాడు పాండు ఆశ్చర్యంగా.

జానకి నా గురించి తనకు తెలిసింది అతనికి చెప్పింది.

పాండు నా జేబులు తడిమి నగలు బయటకు తీయించాడు. అంతటితో అతనాగడని నాకు తెలుసు. ఇప్పుడు చుట్టుపక్కలి వాళ్ళందర్నీ పిలిచి నానా హడావుడీచేసి నన్ను పోలీసులకప్పగిస్తాడు. చావుదెబ్బలు పాండుచేతిలో జానకి కళ్ళముందు తినాలి.

"గతిలేక ఇందుకు పాల్పడ్డాను. ఇంకెప్పుడూ ఇలాంటి పన్లు చేయను. నన్ను క్షమించి వదిలిపెట్టేయండి" అన్నాను ప్రాధేయపడుతూ.

"ముందు గుడ్డలు మార్చుకో-ఇవి నీవే కదూ" అంటూ నా బట్టలు నాకు అందిచ్చాడు. అందిచేటప్పుడు నా పాంటు జేబులోని కాగితాలూ, కత్తీ కూడా తీసి "అహా-నీ దగ్గర కత్తికూడా వుందే!" అని నవ్వాడు.

ఒక్కక్షణం జానకి అక్కణ్నించి తప్పుకుంది. నేను బట్టలు మార్చుకున్నాను.

పాండు నా చేతికి ఓ వందరూపాయలనోటు అందించి "నాకూ కష్టాలంటే తెలుసు. కానీ కష్టాలకు గుర్రై ఇలా దిగజారిపోను. ఏమీ చేతకాకపోతే ఓ కిళ్ళీకొట్టైనా పెట్టుకో. అంతేకానీ దొంగతనాలు చేయకు" అన్నాడు.

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. ఓ సారి వళ్ళుగిల్లి చూసుకుని "మీ రెంత మంచివారండీ!" అని ఇంకా ఏదో అనాలని గొంతు సహకరించక మానేశాను.

"ఇప్పుడీ నగలు పోయివుంటే వేలకువేలు పోయేవి. నువ్వు దొరకడం నీ దురదృష్టం. మా అదృష్టం. ఈ వంద రూపాయల్లో నాకు పోయేదేంలేదు. నీకు మాత్రం చాలా పెద్దలాభం. అటు జైలూ తప్పింది. ఇటు కొత్తజీవితానికి అవకాశమూ వస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సుఖంగా వుండు. మళ్లీ ఇలాంటి అవకాశం నీకు రాకపోవచ్చు" అన్నాడు పాండు.

అది నేను మారిపోయిన క్షణం. ఒక వారంరోజులు తర్వాత నేను చిన్న పుస్తకాల షాపు ప్రారంభించాను. పెట్టుబడి ఆట్టేలేదు. ప్రముఖ వార, మాస పత్రికలు కమిషనుకి తెచ్చి అమ్మడం. ఇది లాభసాటి వ్యాపారమే! నెమ్మదిగా షాపులోకి ఇతర వస్తువులు కూడా చేర్చాలను కుంటున్నాను. ముఖ్యంగా వక్కపొడి, స్వీట్సు వగైరాలు!

ఒక నెల రోజుల తర్వాత జానకి ఇంటికి వెళ్ళాను— నా కృతజ్ఞతలు తెలుపుకోడానికి!

తలుపుతట్టగానే ఒకబక్కపలచటి మనిషి తలుపుతీశాడు.

"నమస్కారమండీ — జానకిగారూ, పాండుగారూ వున్నారా?" అన్నాను.

"పాండా-వాడెవడు? ఈ ఇంట్లో నేనూ, నా భార్య జానకీ తప్ప ఇంకెవ్వరూలేరు" అన్నాడతను.

ఇంతలో జానకి అలా వచ్చింది. నన్ను చూస్తూనే కంగారుగా "చూడండి-ఇప్పట్లో మా కెవ్వరికి పోస్టల్ సేవింగ్స్ చేసే ఉద్దేశ్యంలేదు. మీరు వెళ్ళొచ్చు...." అని నాతో అని "త్వరగా లోపలకు రండి. కమిషను మీద పోస్టల్ సేవింగ్స్ చేయించే మనిషి ఇతను. ఇదివరకు మనింటికోసారి వచ్చాడు" అంది అతనితో.

"పాండు అంటాడేమిటేః" అన్నాడతను.

"వెయ్యేళ్ళపూజారి-ఎన్నో పేర్లు అతని మనసులో కలగా పులగంగా వుండొచ్చు"అని భళ్ళున తలుపేసేసింది జానకి.

నాకు కథ అర్థమైపోయింది. పాండు జానకి ప్రియుడు. నన్ను పట్టివ్వడంవల్ల తమ నేరం బట్టబయలౌతుందని నన్ను డబ్బిచ్చి వదుల్చుకున్నాడు పాండు. అది నేను అతని ఔదార్యమని భ్రమపడ్డాను.

అంతేకాదు-పాండు బట్టలు కొట్టుగదిలో పెట్టడానికి కారణం హఠాత్తుగా భర్తవస్తే కట్టుకునేటందుకన్న విషయం కూడా నా కిప్పుడే బోధపడింది.

పాండు, జానకి నిశ్శబ్దంగా ఎందుకున్నారో కూడా తెలిసిపోయింది.

నేను దొంగతనానికి వెళ్ళిన సమయంలో ఆ ఇంట్లో వాళ్ళిద్దరూ దొంగలు.

ఆ రోజు దొంగతనం గుర్తుకువస్తే ఇప్పటికీ నాకు నవ్వొస్తూంటుంది.

కనబడ్డప్పుడల్లా జానకి, పాండు నన్ను చూసి భయపడుతూంటారు-నేను వాళ్ళింట్లో దొంగతనానికి వెళ్ళిన దొంగనైనప్పటికీ కూడాః....బహుశా నా దొంగతనం కంటె వారి దొంగతనం ప్రమాదకరమైనదీ, అసహ్యకరమైనదీ అయుండాలనుకున్నాను. □

చీమ దూరని చిట్టడవి

అంధవరపు మల్లిబాబు

బీప్....బీప్ మనే శబ్దం రాసాగింది చైనా యింటలిజెన్స్ డైరెక్టర్ చిన్ సెట్ వాంగ్ టేబుల్ మీదున్న వైర్‌లెస్ సెట్ నుండి. వైర్‌లెస్ సెట్ యేక్టివేట్ చేసి విన సాగాడు.

"007 కాలింగ్ సర్! మన వాంగ్‌చూగారి అంచనా కరెక్టు. ఆయన యిండియానుండి యెత్తుకువచ్చిన ప్రొఫెసర్ ముఖర్జీని తిరిగి యిండియా తీసుకెళ్లడానికి యిండియన్ ఏజంట్ విహారి చైనా వచ్చాడు."

"వాట్....! యిండియన్ సి. బి. ఐ. ఏజంట్ విహారినా?"

"అవున్సార్! నేనిప్పు డతన్ని వెంటాడి మరి కొన్ని వివరాలు సేకరిస్తాను. ఈ లోపల వాంగ్‌చూ గార్ని పిలిపించి సంప్రదించండి" వైర్‌లెస్‌సెట్ అఫ్ చేశాడు.

"చిటియాంగ్" పిలిచాడు డైరెక్టర్.

స్ప్రింగు తలుపులు నెట్టుకొని లోని కొచ్చాడు చిటియాంగ్.

"ఇండియానుండి ప్రొఫెసర్ ముఖర్జీని తిరిగి తీసుకెళ్లడానికి ఏజెంట్ విహారి వచ్చాడట. మన డిపార్టుమెంటులోని పదిమంది మెరికల్లాంటి ఏజంట్స్‌ని పంపి, విహారి యెక్కడ కనిపించినా కాల్చి పారేయమని చెప్పండి. క్విక్!"

అదే సమయంలో బూట్ల చప్పుడు వినిపించింది. అది క్రమంగా దగ్గరై డైరెక్టర్ గదిలో అడుగుపెట్టింది.

"విహారిని కాల్చిచంపడం పెద్ద విశేషం కాదు, కాని, అందువల్ల మన సమస్యకు పరిష్కారం జరగదు" అన్నాడు వాంగ్‌చూ.

"వాడ్డూ యూ మీన్, మిస్టర్ వాంగ్‌చూ?"

"విహారిని కాల్చిచంపినందువల్ల మనకు లాభం లేదు. భారత దేశంలో విహారి లాంటి సింహ కిశోరా లెన్నో వున్నాయి. విహారిని చంపితే మరొకరు వస్తారు. ప్రతి క్షణం మనకు సమస్యే. అందుకని నేనొక ప్లాను వేసాను"

అన్నాడు వాంగ్‌చూ.

"ఏమిటా ప్లాను?"

2

బయట కనిపించిన బోర్డుమీద అక్షరాలు చూసి షాపు లోనికెళ్ళాడు విహారి. షాపులో యెవరూ లేరు. ఖాళీగా వుంది.

"ఏం కావాలి?" సేల్స్ కౌంటర్‌లో నిలబడ్డ చైనీస్ యువతి ప్రశ్నించింది.

"స్వెట్టర్ కావాలి. మంచిది" చెప్పాడు విహారి.

రకరకాల స్వెట్టర్స్ అతని ముందు పడేసింది. అయిదు నిమిషాలు అటూ యిటూ తిరిగేసి ఓ స్వెట్టర్ ఎంచుకున్నాడు విహారి.

స్వెట్టర్ పేక్ చేసి యిచ్చింది. "యువర్ సెలెక్షన్ ఈజ్ మార్వ్‌లెస్!" కష్టమర్స్‌ని సంతృప్తిపరచడంకోసం ఆమె అందరితోనూ అదేమాట చెబుతుందేమో.

"ఈ షాపు ప్రొప్రయిటర్ యెవరు?" అనడిగాడు విహారి.

"తోమాంగ్."

"ఓ సారి మాట్లాడాలి."

"లోపలికి వెళ్ళండి. యెవరూ లేరు." దారి చూపించింది.

విహారి స్వింగ్‌డోర్స్ తెరచుకుని లోనికెళ్ళాడు. లోపల ఓ వ్యక్తి కుర్చీలో కూర్చుని యేదో పుస్తకం తిరగేస్తున్నాడు. అడుగుల చప్పుడు వినిపించి తలెత్తి చూశాడతను....

"తోమాంగ్"

"నేనే. నాతో మీకేమిటి పని?"

"చీమలు దూరని చిట్టడివి!" కోడ్ చెప్పాడు విహారి.

తోమాంగ్ కళ్లు మెరిసాయి. వెంటనే విహారి చెయ్యి అందుకుని "కాకులు దూరని కారడివి" అన్నాడు.

తోమాంగ్ భారతదేశం తరపున పనిచేస్తున్న గూఢ చారి. అతని తాత, ముత్తాతలు భారతదేశంలో బ్రతికారు. అతనికి యిండియా అంటే అభిమానం.

అయిదునిమిషాలు మాట్లాడుకున్నా రిద్దరూ.

"మిస్టర్ విహారీ! ప్రొఫెసర్ ముఖర్జీని యెక్కడ బంధించారో తెలుసుకోవాలని ప్రయిత్నించాను. కాని, తెలియలేదు. ప్రొఫెసర్ ముఖర్జీ తన ప్రయోగ ఫలితాలను చైనాకి యివ్వడానికి నిరాకరించాడని, అందువల్ల అతన్ని యేదో జైల్లో వుంచారనీ నేను తెలుసుకున్న పరిశోధనా వివరాలు. వాంగ్‌చూ గొప్ప మేధావి. ప్రతి చిన్న విషయం లోనూ పెద్దఎత్తున జాగ్రత్తలు తీసుకుంటాడు. ముఖర్జీని విడిపించడం మాట అటుంచి, ఎక్కడ వుంచారో తెలుసు కోవడం కూడా కష్టం."

"మీరు సహకరిస్తే, నాకేదీ కష్టంకాదు."

"నా సహకారం మీ కెప్పుడూ వుంటుంది. చెప్పండి, నేనేం చేయాలి?"

"ఒక విమానం కావాలి. ఏర్పాటు చేయగలరా?"

తోమాంగ్ కాస్సేపు ఆలోచించి "అలాగే. ఫాంటమ్ విమానం యేర్పాటు చేస్తాను. మీ ప్లాను యేమిటి?" అంటుండగా—

"మీ యజమాని యెక్కడ?" ఎవరిదో గొంతు బయటి నుండి వినిపించింది. అది వాంగ్‌చూ గొంతు అని తెలుసు కోవడం కష్టం కాలేదు తోమాంగ్‌కి.

"విహారీ! వచ్చింది వాంగ్‌చూ. మీరు వెనుక ద్వారం గుండా పారిపోండి. వీలుచూసుకుని నేనే మిమ్మల్ని కలుస్తాను. ఇలా రండి...." అంటూ లేచి వెనుకవేపు దారి చూపించాడు తోమాంగ్. విహారి తన చిరునామా చెప్పి, బయట జనంలో కల్సిపోయాడు.

3

ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు విహారి.

ఫోన్ మ్రోగతోంది.

ఫోన్ యెక్కడ్నించి చెప్మా? తోమాంగ్‌కి తప్ప తనిక్కడున్నట్టు మరెవరికీ తెలియదు. అతనేదైనా చిక్కుల్లో పడ్డాడా?

దుప్పటి తప్పించి, లేచివెళ్ళి రిసీవర్ అందుకున్నాడు. "హలో!" అన్నాడు.

"హలో మిస్టర్ విహారీ! మీరొకసారి ఇక్కడకు రాగలరా?" అడిగిందొక స్త్రీ.

విహారి గతుక్కుమన్నాడు. తన పేరు ఎలా తెలిసింది? "మీరెవరు?"

"నా పేరు చిన్‌లీ. చైనీస్ సీక్రెట్ విభాగంలో పని చేస్తున్నాను. నా పూర్వీకులందరూ భారతదేశంలో పుట్టి పెరిగారు. భారతదేశమంటే నాకు యెనలేని అభిమానం. అందుకే ప్రాణాలకు తెగించి, మీ ముఖర్జీని మా జైల్లో నుండి తప్పించాను. మీరెక్కడున్నదీ వాంగ్‌చూగారి ద్వారా కూపీ లాగి మీకు ఫోన్ చేస్తున్నాను."

"ముఖర్జీ ఎక్కడ?"

"హోటల్ 'చూ—ఎన్—లై' ఇరవై నాలుగో నెంబర్ గదిలో. వెంటనే వెళ్ళండి. ఇప్పటికి తెలిసిపోయి వుంటుంది. క్విక్...." అని అంటుండగానే అవతలివేపు

నుంచి ఆమె 'కెవ్వు' మన్న కేక వినిపించింది. టెలిఫోన్ డిస్కనెక్టయింది.

ఎవరు? చైనీస్ ఏజంట్లా? ఆమెకేదైనా ఆపద తల పెట్టారా? ఇప్పుడు తనేం చేయాలి? ముందు ముఖర్జీని కలుసుకుని, అతన్ని అక్కడ్నుంచి తప్పించాలని నిశ్చయించుకుని బయల్దేరాడు.

హోటల్ చూ—ఎన్—లై ఇరవై నాలుగో నంబరు గదిముందాగేడు ఓ పావుగంట తర్వాత.

తలుపు దగ్గరగా మూసివుంది. లోపల్నుంచి వెలుతురు బయటపడుతోంది.

తలుపు తట్టాడు. రిప్లై లేదు.

ప్రత్యర్థులు ముఖర్జీని తిరిగి బంధించి, తన కోసం వెయిట్ చేస్తున్నారా? చిన్‌లీ ముఖర్జీని యెక్కడ దాచినదీ వారికి చెప్పేసిందా?

తలుపు మెల్లగా లోనికి నెట్టాడు. శబ్దం చేయకుండా వెనక్కి జరిగింది.

ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి నిశ్చేష్టుడయ్యాడు విహారి. మంచంమీద వెల్లకిలా పడివుంది ప్రొఫెసర్ ముఖర్జీ శవం! అతని గుండెల్లో కత్తి దిగబడి వుంది. బెడ్‌షీట్ అంతా రక్తం. కళ్లు తెరుచుకొని వున్నాయ్.

విహారి రక్తం మరిగింది. ఉద్రేకం యెగదన్నుకు వచ్చింది. నరాలు ఆవేశంతో బిగుసుకున్నాయి.

లోనికి నడిచాడు. చుట్టూ చూసాడు. ఎవరూ కనిపించ లేదు.

ముఖర్జీ నాడి పరీక్షించాడు. ఇంకా వేడిగా వుంది శరీరం. తను రావడానికి కొన్ని నిముషాలముందే చంపి వుంటారు.



తను త్వరపడాలి. లేకుంటే తనను చుట్టుముట్టి బంధిస్తారు. ఏదో నేరం తనమీద మోపి, ఇండియాను దుయ్యబడతారు అకారణంగా.

ఉలిక్కిపడ్డాడు విహారి. ముఖర్జీ మొహంమీద యేదో మడతలా కనిపిస్తోంది. విహారి మస్తిష్కంలో మెరుపు మెరిపింది.

గబుక్కున వంగి, ముఖర్జీ మొహంమీద చెయ్యివేసి, బలంగా లాగాడు. ప్లాస్టిక్ మాస్క్ వూడి వచ్చింది. హతుడు యెవరో చైనీయుడు.

ముఖర్జీ చనిపోయాడన్న భావం కలిగించి, తను తిరిగి ఇండియా వెళ్లిపోయేట్టు చేయాలని వాంగ్.... వేసిన ఎత్తుగడ అయివుంటుంది.

వెనకేదో అలికిడయింది.

గిర్రున వెనక్కి తిరగబోయాడు. కాని, అప్పటికే ఆలస్యమయింది. తలమీద బరువుగా పడింది దెబ్బ.

కళ్ళముందు చీకటి వికృతంగా నాట్యం చేసింది. దబ్బున కూలిపోయాడు.

4

స్పృహ వచ్చేసరికి బంధించబడి వున్నాడు విహారి. చేతులకు బలమైన గొలుసులు బిగించి, నిలబెట్టారు. కాళ్లు పీక్కుపోతున్నాయి.

చుట్టూ చూసాడు. యెత్తుగావున్న రాతిగోడలు దర్శనమిచ్చాయి. అదేదో జైలులా వుంది. రాకపోకలకు ఒకే ద్వారం వుంది. అది ఉక్కు తలుపుకన్నా గట్టిగా కనిపిస్తుంది. తప్పించుకుపోవడం కష్టం.

"దాహం....దాహం...." ఎవరిదో గొంతు నీరసంగా వినిపిస్తోంది. గబాల్న తల తిప్పి చూసాడు విహారి.

కొన్ని గజాల దూరంలో ఓ మనిషి తనలాగే గొలుసులతో బంధించబడి వున్నాడు. కాని కాళ్లు నేలకి ఆనడం లేదు. పాదాలను మేకులమీద నిలబెట్టి కదలనివ్వకుండా తాళ్ళతో గట్టిగా కట్టివున్నారు. కఠినశిక్ష! అతనేం నేరం చేసాడో!

అదే సమయంలో అతను నీరసంగా తల యెత్తి చూసాడు.

అదిరిపడ్డాడు విహారి.

అతను ప్రొఫెసర్ ముఖర్జీ!

దుర్మార్గులు. వారితో సహకరించనందుకు యింత ఘోరంగా హింపిస్తున్నారా! తను విడిపించుకుని, వాళ్ళ అంతు చూడాలి. కాదు, మొదట ప్రొఫెసర్ ముఖర్జీని తప్పించి యిండియా తీసుకెళ్ళడం తన కర్తవ్యం.

సర్‌మని తలుపు చప్పుడయింది. జైలు తలుపు పైకి లేచింది. వాంగ్‌చూ, మరికొంతమంది సైనికులు లోనికొచ్చారు. అందరి చేతుల్లోనూ మనుషులను మసి చేసే ఆయుధాలున్నాయి.

''హలో మిస్టర్ విహారీ! హౌ ఆర్‌యూ? చాలాకాలం తర్వాత కలుసుకున్నాం'' పలకరించాడు వాంగ్‌చూ.

''వెరీ ఫైన్!'' అన్నాడు నిర్లక్ష్యంగా.

''మిస్టర్ విహారీ! నువ్వంటే నాకు వ్యక్తిగతంగా విరోధంలేదు. మన ప్రభుత్వాలు వేరు ఎవరి దేశంకోసం వారు పాటుపడడం తప్పులేదు. అందుకే నిన్ను వెంటనే కాల్చిపారేయమని ఆర్డర్స్ వున్నా నేనా పని చేయలేదు. తలచుకుంటే నేనా పని యిప్పుడు యీ క్షణంలో చేయగల నని నీకు తెలుసు. కాని, నేను నీకు ఒక అవకాశం యిస్తున్నాను.''

''ముఖర్జీని విడిచిపెట్టి వెనక్కి వెళ్ళిపొమ్మంటావు. అవునా?''

''కాదు. మీ ముఖర్జీ మా మాట వినడంలేదు. తన పరిశోధనా ఫలితాలు మా కివ్వడంలేదు.''

''గుడ్! అతనిలో దేశభక్తి పరవళ్ళు త్రొక్కుతుందన్నమాట.''

''పరిహాసంకాదు. చెప్పింది జాగ్రత్తగా విను. నువ్వెలాగైనా అతనికి నచ్చచెప్పు. ఒప్పించు. మాతో చెయ్యి గలపమను. అతన్ని అందలం యెక్కిస్తాను. నిన్ను రాజలాంఛనాలతో యిండియా పంపించే పూచీ నాది'' అన్నాడు వాంగ్‌చూ.

''అసంభవం!'' అరిచాడు విహారీ.

''నీ యిష్టం. ప్రాణాలమీద ఆశవుంటే నేను చెప్పిన పని చెయ్. ఇరవైనాలుగుగంటల గడువు ఇస్తున్నాను. గడువు దాటితే నీకుచావు తప్పదు'' వాంగ్‌చూ బయటకు నడిచాడు. సైనికులు అతన్ని అనుసరించేరు.

వెంటనే పెద్ద శబ్దంచేస్తూ తలుపు దిగింది.

5

విహారి ఆలోచిస్తున్నాడు.

వాంగ్‌చూ యిచ్చిన గడువులో పదిగంటలు గడిచి పోయేయి. ఇంకో పధ్నాలుగు గంటల్లో ముఖర్జీని విడి పించుకొని వెళ్ళాలి. లేకపోతే వాంగ్‌చూ చెప్పిన ప్రకారం తనను కాల్చి చంపుతాడేమో.

తన చావు మాట అలా వుంచి, ముఖర్జీ యింతటి బాధను భరిస్తూ యెంతోసేపు బ్రతికివుండడం కష్టం. ఎలా భరిస్తున్నాడో మరి.

"విహారీ! మనం తప్పించుకోగలమా?" ముఖర్జీ అడిగాడు.

విహారి జవాబు చెప్పలేదు. వాంగ్‌చూ అఖండుడు. తగు కట్టుదిట్టాలు చేయకుండా వుంటాడా?

కాని, ముఖర్జీ లాంటి మేధావిని భారతదేశం వదులుకో లేదు. ఎన్ని కట్టుదిట్టాలు చేసినా సరే, అతన్ని విడిపిం చుకు తీసుకెళ్లాలి. ముఖర్జీతో తనకు పరిచయముంది. ఎన్నో కాన్ఫరెన్సుల్లో కలుసుకున్నాడు. ఎన్ని ఒడిదుడు కులు వచ్చినా చైనాకు తన పరిశోధనా ఫలితాలను యివ్వ డన్న నమ్మకం తనకుంది.

విహారి చూపు ముఖర్జీ కుడిచేతిమీద పడింది. అదిరి పడ్డాడు.

"దాహం వేస్తోంది. మంచినీళ్ళు కూడా యివ్వకుండా చంపుతున్నారు" విసుక్కున్నాడు ముఖర్జీ.

అంతలో జైలు తలుపు దడాల్న పైకి లేచింది. వాంగ్‌చూ మరోసారి హెచ్చరించాలని వచ్చాడేమో అను కున్నాడు విహారి. కాని, విహారి అనుకున్నట్టు వాంగ్‌చూ కాదు. చెంబుతో నీళ్ళు పట్టుకొచ్చాడు ఓ సైనికుడు గన్



ఓ చేత్తో పట్టుకుని.

"దాహంగా వుందా?" అడిగాడు ముఖర్జీని.

తలాడించాడు ముఖర్జీ.

"ఇస్తాను. కడుపునిండా త్రాగు. అయితే ఓ షరతు. నువ్వు మేం చెప్పినట్టు వినాలి. ఇష్టమేనా?"

"తూ!" ఉమ్మేశాడు ముఖర్జీ. సైనికుడికి ఒళ్లు మండింది. చెంబుడు నీళ్ళు అతను చూస్తూండగా నేలమీద పారబోయసాగాడు.

"సోల్జర్! వాంగ్‌చూ నాకు మంచినీళ్ళు యివ్వవద్దని చెప్పలేదుకదా?" అడిగాడు విహారి.

సందిగ్ధావస్థలో పడ్డాడు సోల్జర్. విహారి గురించి ఏమీ చెప్పలేదతనికి.

"ప్లీజ్ మంచినీళ్ళు యివ్వవూ?"

తప్పలేదు సోల్జర్‌కి. నీళ్లు తెచ్చి నోటికి అందించాడు. ఆ అవకాశాన్ని వృధాపోనివ్వలేదు విహారి.

సోల్జర్ తలను గొలుసులు కట్టిన చేతులతోనే గట్టిగా పట్టి, మోకాలుతో పొట్టలో పొడిచాడు. సోల్జర్ చేతిలో గన్ యెగిరి ఆరడుగుల దూరంలో పడింది. చేతిలోని

మట్టిచెంబు కిందపడి పగిలింది. మరో రెండుపోట్లు పొడిచే సరికి తలవేలాడేసాడు సోల్జర్. స్పృహతప్పి రెండడుగుల దూరంలో పడిపోయేడు.

విహారి సాహసాన్ని కళ్ళార్పకుండా చూస్తున్నాడు ముఖర్జీ.

"విహారీ! అతన్ని దెబ్బతీయడంవలన మనకేమిటి లాభం? మనమిప్పుడు యెలా తప్పించుకోగలం....?" అడిగాడు.

సోల్జర్‌ని దెబ్బతీసి, గన్ అందుకుని, దానితో గొలుసులు కాల్చి, బయటపడాలనుకున్నాడు. కాని, గన్ విహారికి అందనంతదూరంలో పడింది.

సోల్జర్ పేంట్ కుడిజేబు ఎత్తుగా కనిపించింది. విహారి కళ్ళు మెరిసాయి. రివాల్వర్ అయివుంటుంది. గొలుసులున్నాయి గనుక చేతులతో వెదకడం కష్టం. కాలు తిన్నగా చాచి, జేబువరకు తెచ్చాడు. కాని అంద లేదు. ముందుకు వంగినకొద్దీ చేతులకు గొలుసులు బిగుసుకుపోయి నొప్పి పుట్టిస్తుంది. మంట కలుగుతోంది. అయినా ఓర్చుకున్నాడు.

మరి కాస్త శ్రమపడి కాలు ముందుకు తెచ్చాడు. కాలి వేళ్ళను జేబులోనికి జొనిపాడు. రివాల్వరే! మెల్లగా బయటకులాగి నిలబడిన చోటుకి తెచ్చుకున్నాడు.

ఇప్పుడు మరో సమస్య ఎదురైంది. రివాల్వర్ చేతిలోకి ఎట్లా వస్తుంది? దానికి ఒక ఆలోచన వచ్చింది. రివాల్వర్‌ని కాలివ్రేళ్ళ మధ్య బిగించి, గొలుసులను గట్టిగా పట్టుకుని, పిల్లిమొగ్గ వేసాడు. ఆ ప్రయత్నంలో కాళ్లు చేతులు కలవగానే రివాల్వర్ అందుకున్నాడు.

"వెల్, విహారీ! మీ తెలివి అద్భుతం" మెచ్చుకున్నాడు

ముఖర్జీ.

విహారి జవాబు చెప్పలేదు. కుడిచేత్తో రివాల్వర్ పట్టుకుని ఎడమచేతిలోని గొలుసును గురిచూసి కాల్చాడు. 'ధన్'మని పేలింది రివాల్వర్. గొలుసు తెగింది. మరో సారి కాల్చి, కుడిచేతి గొలుసు వదిలించుకున్నాడు. రెండు చేతుల్నీ ఫ్రీగా విదిలించుకుని ద్వారంవేపు నడిచాడు. సోల్జర్ బయటికి వెళ్ళలేదు గనుక తలుపు తెరిచేవుంది.

"విహారీ! నన్ను విడిపించరా!" ఆశ్చర్యంగా అడిగాడు ముఖర్జీ.

విహారి వెనక్కి తిరిగి నవ్వాడు. "మైడియర్ పూర్ నకిలీ ముఖర్జీ! వాంగ్‌చూ పన్నాగం అర్థమైంది. నిన్నే అసలు ముఖర్జీగా భావించి, నేను ఇండియా తీసుకెళ్ళిపోవాలనే బంధించినట్టే బంధించి, సోల్జర్‌ద్వారా తప్పించుకునే అవకాశం కల్పించాడు. బట్, నువ్వు, నకిలీ ముఖర్జీవని తెలిసిపోయింది."

నకిలీ ముఖర్జీ నిర్ఘాంతపోయాడు.

"వెల్‌డన్ విహారీ! నీ తెలివితేటలను మెచ్చుకోక తప్పదు. ఇక లాభంలేదు. నిన్ను కాల్చి చంపి చేతులు దులుపుకోవడం ఉత్తమం" అన్న మాటలు వినిపించి గిర్రున తిరిగేడు విహారి.

వాంగ్‌చూ నిలబడి వున్నాడు. అతనిచేతిలో రివాల్వర్ నిప్పులు గ్రక్కడానికి సిద్ధంగా వుంది.

"నాదో చిన్న సందేహం. తీరుస్తావా?" అడిగాడు వాంగ్‌చూ.

"బాగుంది. చావబోయేవాడినైన నాకుండాలి సందేహం ఏదన్నా. నేను చావడానికి సిద్ధపడుతూ నీ సందేహం తీర్చాలన్నమాట. ఏమిటది?"

"ఈసారి నకిలీ ముఖర్జీని ఎలా కనిపెట్టావ్?"

"ప్రొఫెసర్ ముఖర్జీ కుడిచేతికి ఆరువ్రేళ్ళువుంటాయి. ఈ నకిలీ ముఖర్జీకి అయిదు వ్రేళ్ళే మరి!" నవ్వాడు విహారి.

"కసిదీరా నవ్వు. ఇదే ఆఖరిసారి మరి. కాని, నవ్వుతూనే దేవుణ్ని తలచుకో" అని రివాల్వర్ విహారికి గురి పెట్టాడు.

అంతే! విహారి కాలు మెరుపు వేగంతో కదిలి, వాంగ్‌చూ చేతిని ముద్దుపెట్టుకుంది, రివాల్వర్ ఎగిరి ఓ మూలపడింది. వాంగ్‌చూ తిరిగి రివాల్వర్ అందుకోవాలని పరిగెత్తాడు.

విహారి గాలిలోంచి ఎగిరి దూకాడు. విహారి నోట్లోంచి కరాటే సింహనాదం వెలువడింది. విహారి కాళ్ళు వాంగ్‌చూ గుండెల్ని హత్తుకున్నాయి. న్యాయంగా ఆ దెబ్బకు వాంగ్‌చూ విరుచుకు పడిపోవాల్సిందే. కాని, అతను కూడా కరాటేలో ప్రవేశమున్న మనిషయినందువల్ల తట్టుకుని నిల బడ్డాడు. క్షణంలో తేరుకున్నాడు.

కాని విహారి అరచేత్తో అతని మొహంమీద బలంగా చరిచేడు. ముక్కు బ్రద్దలైంది. రక్తం బొటబొట కార సాగింది. అయినా వెనక్కి తగ్గలేదు వాంగ్‌చూ. పౌరుషంగా విహారిమీద విరుచుకుపడ్డాడు.

చెయ్యి చాచి విహారి డొక్కలో పొడిచేడు.

పేగులన్నీ కదిలినట్టయింది విహారికి, అర క్షణంలో తేరుకుని చేతిని కత్తిలాచేసి వాంగ్‌చూ మెడమీద దెబ్బ వేసాడు గట్టిగా.

తిరుగులేదా దెబ్బకి. కళ్ళముందు చీకటి తెరలు కదులు తుండగా కూలిపోయాడు. నకిలీ ముఖర్జీ మెడమీద నరం

చిటుక్కు మనిపించి స్పృహ తప్పించాడు విహారి. మరి కొన్ని గంటలవరకూ ఆ యిద్దరకూ స్పృహరాదు.

వాంగ్‌చూకి తన డ్రెస్‌వేసి, తను వాంగ్‌చూగా మారి పోయాడు. మేకప్ అంతా సరిచూసుకుని, బయటికి నడిచి గది తలుపు మూసుకునే స్విచ్ నొక్కాడు. పెద్ద శబ్దంచేస్తూ తలుపు దిగిపోయింది.

తోమాంగ్‌కి ఫోన్‌చేసి విమానం సిద్ధం చేయమన్నాడు.

తర్వాత యింటర్నల్ ఎఫైర్స్ మినిస్టర్‌కి ఫోన్‌చేసాడు "సర్! ఈ సకిలీ ముఖర్జీని కూడా విహారి పోల్చేసాడు. గనుక అతనికి అసలు ముఖర్జీ ఎక్కడున్నదీ తెలిసి పోయి వుంటుంది. అతను ఒకవేళ తప్పించుకుంటే ప్రమాదం. అందుకని...."

"అయితే వెంటనే జైలు మార్పిడి చేస్తే సరి. కాని, రష్యా సరిహద్దుకు యివతలవున్న చిటియాంగ్ సెంట్రల్ జైలులో ముఖర్జీని వుంచినట్టు విహారి తెలుసుకోవడం నమ్మశక్యం గాకుండా వుంది. యెనీవే మన జాగ్రత్తలో వుండడం మంచిది."

విహారి కళ్లు మెరిసేయి. తన పథకం నెరవేరింది. ముఖర్జీని యెక్కడ దాచారో తెలిసిపోయింది.

"ముఖర్జీని ఏ జైలుకి మార్చాలి?" అడిగాడు. "ఇది చాలా రహస్యంగా, మందీమార్బలం లేకుండా జరగాలి సర్" అన్నాడు మళ్లీ.

"అలాగే. చిటియాంగ్ జైలుకి నువ్వు వస్తున్నట్టు ఫోన్ చేసి చెప్తాను. ముఖర్జీని నీ వెంట పంపమని ఆర్డర్స్ యిస్తాను. ముఖర్జీని పాకిస్తాన్ బోర్డరుకి ఏభై మైళ్ళ యివతల వున్న 'గోమాలీ' జైలుకి తరలించు" ఫోన్ డిస్‌కనెక్టయింది.

6

"రండి సార్. మీరు వస్తున్నట్టు యిప్పుడే మినిస్టర్ గారినుండి ఫోన్ వచ్చింది." వాంగ్‌చూ వేషంలో విహారి జీప్ దిగుతూండగా స్వాగతం పలికాడు గోమాలీ జైలర్.

విహారి యిబ్బందిల్లో పడ్డాడు. వాంగ్‌చూ అలవాట్లు, నడవడిక అతనికి తెలుసు. కాని అతనెవరితో యెలా ప్రవర్తిస్తాడో, ఏమని సంబోధిస్తుంటాడో యెలా తెలుస్తుంది?

"మీకు సహాయంగా సోల్జర్‌ని పంపమంటారా?" అడిగాడు జైలర్.

"వద్దు. అంతా రహస్యంగా జరగాలి. ప్రొఫెసర్ ముఖర్జీని స్పృహ తప్పించి జీప్‌లో తీసుకువెళ్తాను. పదండి" చెప్పాడు విహారి సీరియస్‌గా.

జెయిలర్ దారితీసాడు. అతని వెనుక విహారి. విహారికి గుండె దడదడ లాడుతుంది, ఏ క్షణంలో తన గుట్టు బయటపడుతుందోనని. గుట్టు బయటపడితే వెంటనే కాల్చి పారేస్తారు.

ఆ గదిలో ముఖర్జీ, మరో నలుగురు సోల్జర్స్‌వున్నారు. ముఖర్జీ గోడకు చేరగిలబడి విచారంగా కూర్చుని వున్నాడు. నలుగురు సోల్జర్స్ అప్రమత్తులై గది బయట కాపలా కాస్తున్నారు.

సోల్జర్స్‌ని బయటికి నడవమన్నాడు విహారి. అదే సమయంలో జైలర్‌కి యెక్కడ్నుంచో ఫోన్‌వచ్చింది. అతను అటు వెళ్ళాడు.

"ముఖర్జీ! మిమ్మల్ని జైలునుండి మారుస్తున్నాం."

అతను తలెత్తి చూసాడు.

"భారతదేశంనుండి సి.బి.ఐ. ఏజంట్ విహారి చైనాలో

ప్రవేశించి, మిమ్మల్ని విడిపించుకు వెళ్ళాలని ప్రయత్నాలు సాగిస్తున్నాడు" అంటూ తన అరచేతిని ముఖర్జీకి చూపించాడు. ముఖర్జీ కళ్లు మతాబాల్లా వెలిగాయి.

అతని చేతిమీద యెర్ర సిరాతో 'విహారి' అని వ్రాసి వుంది. ముఖర్జీ ఆనందంగా విహారి రెండు చేతులూ పట్టుకున్నాడు. ముఖర్జీ కుడిచేతికున్న ఆరోవేలు కనిపించిందప్పుడు.

"కదలకండి. చేతులు పైకెత్తు మిస్టర్ విహారీ!" వెనుకనుండి జైలర్ అరుపు వినిపించింది. అదిరిపడ్డాడు విహారి. జైలర్‌కెలా తెలిసింది. అతనికి వచ్చిన ఫోన్ అదేనా? వాంగ్‌చూకి అప్పుడే స్పృహ వచ్చిందా?

జైలర్‌కి వ్యవధి దొరికితే సోల్జర్స్‌ని పిలుస్తాడు. అప్పుడు ఈ గది రణరంగంగా మారుతుంది. తెగించాలి. ఉద్రేకం పొంగింది. వెంటనే ఖడ్గమృగంలా జెయిలర్‌ని ఢీకొన్నాడు. జెయిలర్ చేతిలోని రివాల్వర్ ఎగిరిపోయింది.

విహారి ఆలస్యం చేయలేదు. చకచకా విజృంభించి, జెయిలర్‌ని స్పృహ తప్పించాడు, "ముఖర్జీ మీరు త్వరగా జెయిలర్‌గా మారండి" అన్నాడు విహారి.

అయిదు నిమిషాల్లో ముఖర్జీ జైలర్‌లా తయారయ్యాడు. బయటికి కదిలారు. "జైలర్ మీరు నాతో రండి" అన్నాడు కన్నుగీటి, సోల్జర్స్‌కి వినిపించాలన్నట్టు. ముఖర్జీ తలాడించాడు.

విహారి జీప్ యెక్కాడు. ముఖర్జీ అతని ప్రక్కనే కూర్చున్నాడు. జీప్ కదిలింది. గేటు దాటుతుండగా జైల్లోంచి అరుపులు వినిపించాయి.

"షూట్ దెమ్! షూట్ దెమ్!!" సోల్జర్స్ అరుస్తూ పరిగెత్తుకొస్తున్నారు.

జీప్ గేటు దాటింది. ఆక్సిలేటర్ గట్టిగా నొక్కాడు. జీప్ చక్రాలు గాలిలో కదులుతున్నట్టుగా వుంది.

తోమాంగ్ విమానం సిద్ధంచేసి వుంటాడా? ముఖర్జీని క్షేమంగా యిండియా చేర్చగలడా? యెన్నో అనుమానాలు, ప్రశ్నలూ కదిలేయి.

వెనుకనుంచి హోరుమంటూ యింజను చప్పుడు విని పించింది. చూసాడు. సోల్జర్స్ జీప్ వెనుక వస్తోంది. మిషన్ గన్స్ ప్రేలుస్తున్నారు.

తున్.... తున్.... తున్....

మిషన్ గన్స్‌నుండి తప్పిస్తూ నేర్పుగా డ్రైవ్ చేస్తున్నాడు విహారి.

"ప్రొఫెసర్! మీరో పని చేయండి. వెనుక జీప్ బాగా దగ్గరయ్యేక ఈ బాంబ్స్ బలంగా విసరండి, నేలమీద పడేట్టు!" అన్నాడు రెండు బాంబ్స్ తీసిస్తూ. ముఖర్జీ బాంబ్స్ అందుకున్నాడు.

తున్.... తున్.... తున్....

మిషన్ గన్స్ నిర్విరామంగా ప్రేలుతున్నాయి. "అబ్బా!" అన్నాడు విహారి బాధగా. గుండు విహారి జబ్బను రాసుకుంటూ పోయింది. రక్తం ఫౌంటన్ పైపులా చిమ్మింది.

ముఖర్జీ బలాన్ని పుంజుకుని గురిచూసి, జీప్‌ముందుకి విసిరేడు బాంబు.

మరుక్షణం మట్టి పెళ్ళలు పెళ్లలుగా పైకిలేచింది. శత్రువుల జీప్‌ముందు భాగం పాడయింది. అదను చూసి మరో బాంబ్ విసిరాడు. ఈ సారి మట్టిపైకి లేచి, నేల మీద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆ గోతుల్లోనుండి దొర్లు కుంటూ పల్లంలోకి వెళ్లిపోయింది సోల్జర్స్ జీప్.

ప్రొఫెసర్ ముఖర్జీవేపు మెచ్చుకోలుగా చూసాడు విహారి.

జీప్ కొంతదూరం ప్రయాణించాక ఓ పాడుబడిన విమానాశ్రయం కళ్లబడింది. అది సాధారణంగా ఉపయోగించరు! అందుకే తోమాంగ్‌తో విమానాన్ని అక్కడ వుంచమన్నాడు.

ఎయిర్‌పోర్ట్‌లో ఫాంటమ్ విమానం వుంది. జీప్ ఆపి, ఇద్దరూ వరిగెత్తారు. తోమాంగ్ కనిపించలేదు. యేమయ్యాడు? విహారి మనసు కీడును శంకించింది.

"హరియప్! ప్లేన్‌లోకి వెళ్లండి" అంటూ మొదట ముఖర్జీని పంపించి, పైలట్ డోర్ దగ్గరకి వెళ్లాడు విహారి.

ముఖర్జీ లోనికెళ్లి లోపల దృశ్యం చూడగానే స్థంభించిపోయాడు. ఓ వ్యక్తి రక్తపు మడుగులో పడివున్నాడు. అతని ప్రక్కనే వాంగ్‌చూ రివాల్వర్ పట్టుకుని స్టడీగా నిలబడి వున్నాడు.

"వెల్‌కమ్ ముఖర్జీ! మీ కోసమే వేయిట్‌చేస్తున్నాను. మీ హీరో యెక్కడ?" అన్నాడు వాంగ్‌చూ. "రానివ్వండి. యిద్దర్నీ ఒకేసారి స్వర్గానికి పంపిస్తాను" అంటుండగానే పైలెట్ డోర్‌లోనుండి లోనికొచ్చిన విహారి, వాంగ్‌చూ నెత్తిమీద బలంగా దెబ్బవేసేడు. నరాలు చిట్లినట్టయింది. తల దిమ్మెక్కివుంటుంది. నేలమీద కర్చుకుపోయాడు.

"తోమాంగ్ యెయిర్‌పోర్టులో కనిపించనప్పుడే నాకు అనుమానం తగిలింది. బేడ్‌లక్ యిండియా ఒకమంచి సి.బి.ఐ. ఏజంట్‌ని కోల్పోయింది" వాంగ్‌చూ శరీరాన్ని విమానంలోంచి యెయిర్‌పోర్టులో పడుకోబెట్టాడు.

విహారి తిరిగి విమానం యెక్కేసాడు. స్టార్టుచేసాడు. విమానం ముందుకు పరుగులు తీసింది. ఇండియావైపు గగనంలో దూసుకెళ్ళడం ప్రారంభించింది. □

రక్తం తోసిన శవాటి

యస్. గీతారాణి

ట్రింగ్ ట్రింగ్ మంది టెలిఫోన్.

విసుగ్గా రిసీవర్‌ని అందుకొని, "హలో ఇన్‌స్పెక్టర్ సంజయ్ హియర్" అన్నాడు.

"హలో సంజయ్! నీ ఖైదీనెంబర్ నలభై ఎనిమిది

కులాసా?"

ఇన్‌స్పెక్టర్ తీరుబాటుగా కూర్చొని అది ఏ కమీషనర్ నుంచి వచ్చిన ఫోన్ కాలో అనుకొని, శాంతంగా 'హలో' అన్నాడు. తీరా ఎవడో వెర్రి వెధవలా ఖైదీనెంబర్ నలభై ఎనిమిది కులాసా అని అడిగేసరికి అతను తారా జువ్వలా లేచిపోయాడు.

"వాట్ నాన్సెన్స్! యు ఆర్ టాకింగ్. ఇది పోలీస్ స్టేషన్ అనుకొన్నావా? నీ తాతగాడి హాస్పటల్ అనుకొన్నావా?" అన్నాడు మండిపడ్తూ.

"వెయిట్ మిస్టర్! ఎందుకంతలా గొంతు చించుకొంటావ్. నేను చాలా నింపాదిగా మాట్లాడుతున్నానే-" అవతల అతని స్వరం చాలా శాంతంగా విన్పించింది.

సంజయ్ తన కోపాన్ని తొక్కిపట్టాడు.

"ఎవర్నువ్? నాతో ఏం పని?" ప్రశ్నించాడు.

"నా గురించి చెప్పటం వ్యర్థం. ఇంక పనంటావా! నీ ఖైదీ అదే నెంబర్ 48 ని విడిపించుకు పోవాలనుకుంటున్నాను."

ఇన్‌స్పెక్టర్ ముఖం ఎర్రబడింది.

"నా ఆధీనంలో వున్న ఖైదీని విడిపించటం నీ తరం కాదు కదా, నీ అబ్బ తరం కూడా కాదు!"

అవతల్నించి పెళ్ళున నవ్వు విన్పడింది.

"పూర్ ఇన్‌స్పెక్టర్, నా అబ్బదాకా పోక. నువ్ అలా కండ్లప్పగించి చూస్తుండు. నీ ఎదురుగా ఖైదీ నెంబర్ 48ని తీసుకుపోతాను. బై ది బై. ఈరోజు క్రాంతి పేపర్‌లో సెకెండ్ పేజీలో ఫస్ట్ హెడ్డింగ్ చూడు___" అవతల ఫోన్ పెట్టేసిన ధ్వని అయింది.

స్థాణువులా నిల్చిపోయాడు ఇన్‌స్పెక్టర్.

రిశీవర్‌ని క్రెడిల్ చెయ్యడం కూడా మర్చిపోయా డతను.

అంతట్లో సార్జెంట్ విశ్వం వచ్చాడక్కడికి.

"విశ్వం! ఓసారి ఖైదీనెంబర్ నలభై ఎనిమిదిని చూడాలి. కమాన్!"

"ఇప్పుడా?" వింతగా చూశాడు విశ్వం.

ఇన్‌స్పెక్టర్ అతని మాటలకి బదులివ్వకుండా వడి వడిగా నడిచాడు.

వరుసగా సెల్స్ అన్నీ దాటుకొంటూ నలభై ఎనిమిదో నెంబర్ సెల్ దగ్గరికి వెళ్ళాడు. సార్జెంటు తనూ వడివడిగా అతన్ని అనుసరిస్తున్నాడు.

నలభై ఎనిమిదో నెంబర్ ఖైదీ తీరిగ్గా కూర్చొని అగాధక్రిష్టి నవల చదువుతున్నాడు.

గతుక్కుమన్నాడిన్‌స్పెక్టర్.

ఆ నవల చదివేపాటి తెలివి వుందంటే అతను గ్రాడ్యుయేటా? ఆ ఖైదీని తను ఖాళీగా ఖైదు చేసాడు. అలాంటిది ఆ నావెల్ యెలా వచ్చిందతని దగ్గరకి?

"రాకా!" ఇన్‌స్పెక్టర్ చప్పట్లు చరిచి పిల్చాడు.

తల తిప్పాడతను. అతని కళ్ళు రెండూ మందే గోళాల్లా వున్నాయి. రెప్పపాటుకాలం మాత్రమే అతను ఇన్‌స్పెక్టర్‌ని చూసి, తల తిప్పేసుకొన్నాడు.

ఒళ్ళు మండిపోయింది ఇన్‌స్పెక్టర్‌కి.

"ఏమిటా తలబిరుసు? ఇలా చూడు!" చేతిలో లాఠితో కట కటాలమీద గట్టిగా కొట్టాడు.

"ఏం పని?" అతని గొంతు రెండుగా చీలిన వెదురు బొంగు స్వరంలా వుంది.

"ఆ బుక్ నీకెలా వచ్చింది?"

"చచ్చు ప్రశ్న. రైటర్ వ్రాయగా పబ్లిష్ చెయ్యగా-"

"బాస్టర్డ్! నా ప్రశ్నకి ఆన్సర్ అదా?" తీక్షణంగా అన్నాడిన్స్పెక్టర్.

అతను యిన్స్పెక్టర్‌కి అభిముఖంగా తిరిగాడు. ఎర్రటి కళ్ళల్లో జీరలు భయంకరంగా కన్పిస్తున్నాయి.

"ఏమిటీ?" నవల పక్కన పెడ్తూ అడిగాడు.

"ఆ నవల నీకెలా వచ్చింది?" రెట్టిస్తున్నట్లడిగాడిన స్పెక్టర్.

"నన్ను ఖైదు చేసినప్పుడు—" నవ్వాడతను.

"నిన్ను ఖాళీగా ఖైదు చేసాం—"

"అయితే నీ మనుషులెవరో నాకు ఈ నవల యిచ్చి వుండాలి" అతను మళ్ళీ నవ్వాడు.

ఇన్స్పెక్టర్ కళ్ళు వెడల్పయాయి.

ఆ ఖైదీ అహంకారమా! అతి సాహసమా! ఏమిటా నిర్లక్ష్యం. ఎంత కేర్లెస్‌గా సమాధానాలు చెప్తున్నాడు.

ఇన్స్పెక్టర్ అతన్ని సూటిగా చూసాడు.

"నిన్నెవరైనా జైలునుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారా?" అడిగాడు.

"గుడ్. అయితే త్వరలో నేను సువిలాస ప్రపంచం లోకి పోబోతున్నానన్నమాట—" రాకా తమాషాగా భుజా లెగరేసాడు.

"నిన్నెవడో తప్పిస్తాడని ఆశపడ్తున్నావా రాకా! నిన్ను తప్పించాలనుకొన్నవాడి తలకాయి తప్పిస్తాను కాని, నిన్ను ఈ కటకటాలు దాటనివ్వను—" అని ఇన్స్పెక్టర్ వెను దిరిగాడు.

విశ్వానికి నోటమాట రావటంలేదు. ఇన్స్పెక్టర్ వెనుక పిల్లిలా నడిచాడు. కేసు వింతగా అన్పించిందతనికి.

ఇన్స్పెక్టర్ తన గదిలోకి వచ్చి, కుర్చీలో కూర్చు న్నాడు.

విశ్వం అతనికెదురు కుర్చీలో కూర్చున్నాడు.

అతనికి రాకా ముఖం కాదు, ఇన్స్పెక్టర్ ముఖం చూస్తే భయం వేస్తోంది.

"విశ్వం!" హఠాత్తుగా పిల్చాడినస్పెక్టర్.

వుషారుగా ముందుకు వంగి "వాట్ సార్" అన్నాడు.

"ఈ రోజు క్రాంతిపేపరు కావాలి. క్విక్‌గా తీసుకు రావాలి."

తెల్లబోయాడు విశ్వం.

రాకా ప్రవర్తనతో ఇన్స్పెక్టర్ మెదడులో స్క్రూ ఎక్కడో లూజు కాలేదు కదా! అని అన్పించకపోలేదతనికి.

"క్రాంతీ పేపరా? దేనికిసార్?" విచిత్రంగా చూసాడు.

"ఎందుకో తర్వాత చెప్తాను. ముందు నువ్వెళ్ళి ఆ పేపర్ తీసుకురా—" విసుగ్గా అన్నా డినస్పెక్టర్.

సార్జెంట్ విశ్వం లేచి నిలోచ్చని ఇన్స్పెక్టర్‌కి సెల్యూట్ కొట్టి, బూట్లు టకటకలాడించుకొంటూ బయటికి నడ్చాడు.

2

విశ్వం జీప్ ఎక్కి స్టార్టు చేసాడు.

పోలీస్ స్టేషన్‌కి చాలా దూరంలో షాప్స్ వున్నాయి.

విశ్వం చాలా స్పీడులో జీప్ నడిపి, ముందు ఎదు రైన కిళ్ళీషాపుదగ్గర జీపు ఆపాడు.

జీప్‌లోంచి దిగకుండానే జేబులోంచి రూపాయినోటు తీసి "క్రాంతీపేపర్ ఇవ్వు—" అన్నాడు.

"ఎప్పుడో అయిపోనాయి బాబూ—" అన్నాడు ముస లాడు. చిరాగ్గా చూసాడు.

తండ్రి పక్కన గోలీల ఆట ఆడుకొంటున్న ఆ ముస

లాడి కొడుకు "అయ్యా! నీదగ్గర క్రాంతీపేపరు ఒకటి వుందిగా, అది ఇచ్చెయ్యకూడదూ." అన్నాడు అమాయకంగా.

"నోరు మూసుకో వెధవా!" ఆ ముసలాడు కొడుకు వీపుమీదొకటి చరిచాడు.

"నేను పోలీస్ మనిషిని. నువ్వాపేపర్ ఇవ్వకపోతే, క్షణాలమీద నీ కొట్టు పీకిపారించి, నిన్ను ఏదో విధంగా జైల్లో పెట్టించగలను—" తన పవర్ని వినియోగించాడు విశ్వం.

కొట్టువాడు తేలిగ్గా నవ్వాడు.

"బాబూ! మీరీ మాట అంటారో అనరో అని ఇంత వరకూ ఎదురుచూస్తున్నా—" అన్నాడు.

విశ్వం నోరు తెర్చేసాడు.

ఆఫ్టాల్ ఓ కిళ్ళీకొట్టువాడు ఆ మాట అన్నాడంటే ప్రజల్లో పోలీస్ డిపార్ట్‌మెంట్ పై అంత తేలిక భావం వుందా?

తీక్షణంగా చూసాడు.

"నేను ఎవర్నో తెలిసే మాట్లాడుతున్నావా? ఏదీ ఆ పేపరు ఇలాతే—" గర్జించాడు విశ్వం.

"మీరా పేపర్ని తీసుకోవాలంటే మోలోని రోడ్డులో నిల్చున్న ఓ మనిషిని కొట్టాలి—" షాపువాడు తాపీగా అన్నాడు.

సార్జెంట్ విశ్వం తటాలున జీప్ దిగి షాపు దగ్గరికి వచ్చి, ఆ ముసలాడి దవడమీద ఈడ్చి కొట్టాడు.

"అబ్బా!" అని దవడ పట్టుకొన్నాడా ముసలాడు.

"ఓల్డుపిగ్! చెప్పరా. ఈ మాటల్ని నీచేత చిలకలా పలికించిందెవరు?" విశ్వం వూగిపోతూ ప్రశ్నించాడు.

ఆ ముసలాడు విశ్వం కొట్టిన దెబ్బకి కళ్ళల్లో నీళ్లు తిప్పుకొన్నాడు.

"ఆ పెద్దమనిషి చెప్పమన్నాడయ్యా—"

"ఏ మనిషి? వివరంగా చెప్పు.లేదా మక్కెలిరగదంతా" విశ్వం వురుముతున్నట్లుగా చూసాడు.

"పావుగంట క్రితం నేను కొట్టు కట్టేసి కూడుకు పోదా మని అనుకొంటుండగా ఓ నల్లటి కారు నా కొట్టు ముందా గింది. అందులోంచి ఓ మనిషి దిగాడు—"

"కార్లోంచి మనిషి కాకపోతే దెయ్యం దిగుతుందా? అతనెలావున్నాడు?"

"నల్లటి పాంటు, నల్లటి షర్టు. నెత్తిమీద టోపి పెట్టు కొన్నాడు. ఆ మనిషి చేతిలో క్రాంతీ పేపర్ వుంది. అతను నా దగ్గరగా వచ్చి రెండు వందనోట్లు తీసి, 'ఇవి కావాలా?' అని అడిగాడు. రెండు వందలు. వారంరోజులు కొట్టుమీద కూర్చున్నా సంపాదించటం కష్టం. అలాంటిది రెండు క్షణాల్లో వస్తుంటే ఎలా వద్దనేది. కావాలని అన్నాను.

ఇవి కావాలంటే నాకో చిన్న పని చేసిపెట్టాలి అన్నా డతను. చెప్పండి అన్నాన్నేను. ఎవరైనా తను పోలీస్ మనిషినని చెప్పుకొని క్రాంతిపేపర్ అడిగితే ఇలా చెప్ప మన్నాడు—"

"ఏమని?"

"క్రాంతీపేపర్ కావాలని వచ్చిన మొనగాడ్ని తిన్నగా మోలోని రోడ్డు దగ్గరకి రమ్మను. అక్కడో మనిషి నిల బడివుంటాడు. ఆ మనిషిని కొట్టాలని చెప్పు — అన్నాడు బాబూ."

ఆ ముసలాడు మళ్లీ బెరుగ్గా సార్జెంట్ ముఖంలోకి



చూస్తూ "మరో మాట కూడా చెప్పమన్నాడు బాబూ!" అన్నాడు.

"ఏమిటి?"

"ఆ వచ్చినవాడు మీసమున్న మగాడైతే నా దగ్గరికి వచ్చి, నాతో తలపడి పేపర్ పట్టుకుపొమ్మను. మగాడు కాకపోతే, నీ కొట్టుకు మొక్కి వెనక్కి పొమ్మను—" అని విశ్వం ముఖంలోకి చూసాడు.

సార్జెంటు విశ్వం కళ్లు ఎరుపెక్కాయి.

"చూడు! ఆ పేపర్ నీ దగ్గర జాగ్రత్తగా వుంచు. మరో పావుగంటలో వచ్చి దాన్ని తీసుకొంటాను." అని చెప్పి జీప్ ఎక్కాడు.

క్షణంలో జీప్ మోలోని రోడ్వైపుకు దూసుకుపోయింది.

విశ్వం మస్తిష్కం బాగా వేడెక్కిపోయింది.

ఎవరా వ్యక్తి? తను పేపర్‌కోసం వస్తానని అంత కరెక్టుగా ఎలా వూహించగలిగాడు? ఇన్‌స్పెక్టర్ క్రాంతి పేపర్‌కోసం తన్ని అంత హఠాత్తుగా ఎందుకు పంపించాడు?

విశ్వం ఆలోచనలతో తల పగలుగొట్టుకొంటుండగా మోలోని రోడ్డు వచ్చింది.

నిర్జనంగా వుందా రోడ్డు.

దూరంగా నల్లని బ్యూక్ కారు. దాని ఫ్రెంట్ దోరుకు ఆనుకొని విలాసంగా పొగతాగుతున్నాడో వ్యక్తి. అయితే పేటు లేదు.

ఎవరతను? ఏమిటా ధైర్యం? ధైర్యమా! మొండితనమా! పోలీస్ మనుషుల్తో ఆ విర్లక్షపు ప్రవర్తన ఏమిటి?

విశ్వం జీప్‌ని కారు దగ్గరకి పోనిచ్చాడు.

అతను నవ్వుకున్నాడు.

"ఎవర్నువ్?" విశ్వం జీప్ దిగకుండా ప్రశ్నించాడు.

రాకా కున్నలాంటి పొగరే. విశ్వం జీప్ దిగాడు.

"ఆ ముసలాడితో యెందుకలా చెప్పావ్?"

"నీ కండబలాన్ని పరీక్షిద్దామని."

"నువ్ చేస్తున్న ఈ న్యూసెన్స్ వ్యవహారానికి నిన్ను క్షణాల్లో అరెస్టు చెయ్యగలను."

"నువ్ నా సరిహద్దుల్లోకి రాగలవా?" పరిహాసంగా అన్నాడు.

విశ్వం కళ్ల చెంగ్రడనిప్పుల్ని రాల్చాయి. పాంటు జేబులోంచి చురుగ్గా రివాల్వర్ తీశాడు.

అంతే! ప్రత్యర్థి చేతిలో రివాల్వర్ విశ్వం చేతిలో రివాల్వర్‌ని తృటి కాలంలో ఎగరగొట్టేసింది.

నివ్వెరపోయాడతను.

"ఇప్పుడు నువ్వు నిరాయుధుడివి. సెకెండ్లలో నిన్ను కాల్చిపారెయ్యగలను." నవ్వాడతను.

విశ్వం చూపులు అతని రివాల్వర్ మీదున్నాయి.

ఆలోచిస్తున్నాడు దాన్ని ఎలా పడగొట్టాలా అని.

అతని ఆలోచనలని పడగొడ్తూ ఆ మనిషి తన చేతిలో వున్న రివాల్వర్ని కారు ఫ్రంట్ సీట్లో పడేలా విసిరాడు.

విశ్వం అతని సాహసానికి తెల్లబోయాడు.

"ఇప్పుడిద్దరం నిరాయుధలమే. కమాన్। నాతో తలపడి ఆ పేపర్ పట్టుకుపో___"

విశ్వం షర్టు చేతుల్ని వెనక్కి జరిపాడు.

ఆ వ్యక్తి ఆరున్నర అడుగుల ఎత్తులో వున్నాడు। నల్లటి షర్టులోంచి బిగువైన కండరాలు వుక్కు కడ్డీల్లా కనిపిస్తున్నాయి.

విశ్వానికి తెలుసు అతనిముందు నిలబడటం కష్టమని. అయినా పౌరుషం, వృత్తిధైర్యం వగైరా అతన్ని ముందుకు నడిపించాయి.

3

సమయం ఆరయింది.

ఉదయం పన్నెండున్నర ప్రాంతంలో క్రాంతిపేపర్ కోసం వెళ్ళిన సార్జెంట్ ఇంతవరకూ రాలేదు. ఒక పేపర్ కోసం వెళ్లిన సార్జెంట్ దాన్ని కొనటానికి ఆరు గంటల వ్యవధి తీసుకుంటాడా?

ఇన్స్పెక్టర్ సంజయ్ అసహనంగా కుర్చీలో అటూ, ఇటూ కదిలాడు.

విశ్వాన్ని ఎవరైనా ట్రాప్లో బిగించారా?

అతను కలవరంగా లేచినిల్చొని టేబిల్ పైనున్న బెల్ మోగించాడు.

శ్రీ నాట్ శ్రీ వచ్చి ఇనస్పెక్టర్‌కి సెల్యూట్ చేసాడు.

"నేను పనిమీద బయటికి వెళ్తున్నా. స్టేషన్ చూస్తుండు" అని హేటుని తలకి తగిలించుకొని, నాలుగు అడుగులు వేశాడు.

హఠాత్తుగా ఫోనులో మాట్లాడిన మనిషి మాటలు గుర్తొచ్చాయి. తను అలా వెళ్ళాకా అతను ఏమైనా ట్రిక్స్ ఉపయోగించి, రాకాని విడిపించుకుపోతే?

ఇనస్పెక్టర్ నిస్సహాయంగా మళ్లీ వెనక్కి వచ్చేసి కుర్చీలో కూలబడ్డాడు.

"వెళ్ళరా సార్?" 3 0 3 ప్రశ్నించాడు.

"నో."

"అదేం సార్."

ఇనస్పెక్టర్ పేపర్‌వెయిట్ తిప్పుతూ మౌనంగా వుండి పోయాడు. అతని మెదడులో రాకా అన్నమాటలు మెదిలాయి.

నీ మనుషులే ఎవరో నాకీ నవల ఇచ్చివుండాలి అన్నాడు రాకా. పైవాళ్ళు ఎవరూ అతన్ని చూడరాలేదు. రాకాని జైల్లో పెట్టటానికి కారణం ఏమిటో అంత పెద్దగా లేదు. అతనో యువతి గురించి పోలీసుల్తో తగవుపడ్డాడు. పోలీసుల్ని కొట్టాడు. రోడ్‌పై వెళ్తున్న అమ్మాయిని పోలీస్ ఏదో అన్నాట్ట. రాకా అతన్ని కొట్టాడు. ఆ కారణంగా అతన్ని జైల్లో పెట్టారు.

అలా అరెస్ట్ అయిన రాకాకి అగాధ క్రిష్టి నావెల్ యెలా దొరికింది? అతను అన్నట్లు తమ మనుషులెవరో ఆ నవల యిచ్చారా?

త్రీ నాట్ త్రీ వైపు చూసాడు.

ఇనస్పెక్టర్‌నే చూస్తున్నాడతను.

"చూడు. నాకేదైనా నవల కావాలి. ఇవ్వగలవా?"

"అగాథక్రిష్టీ నవల తెమ్మంటారా?"

ఇనస్పెక్టర్ సంజయ్ చెయ్యి చురుగ్గా పాంటు జేబులోకి వెళ్ళింది, రివాల్వర్ కోసం.

అయితే అతనికన్నా ముందు 303 చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమైంది.

"హేండ్సప్" అర్చాడతను.

"కన్నింగ్ బాస్టర్డ్! నీ వృత్తికే నువ్ ముప్పు తెస్తావా!" ఇనస్పెక్టర్ కుర్చీలోంచి లేవబోయాడు.

"ఇనస్పెక్టర్! డోంట్ మూవ్ అండ్ డోంట్ డూ ట్రిక్స్."

"యూ! పోలీస్ స్టేషన్‌లో, పోలీస్ మనిషివి నీకెంత గుండెధైర్యం. చట్టానికి దొరికావో నిన్ను కాల్చి పారేస్తుంది" ఇనస్పెక్టర్ ఉద్రిక్తతగా అరిచాడు.

"చట్టం! అది ప్రమాదాలన్నీ జరిగాకా అప్పుడు నిద్ర మేల్కొంటుంది. ఈ లోగా పోయే ప్రాణాలు ఎన్నో!"

303 కుడిచేత్తిలో రివాల్వర్ వూగుతున్నది. ఎడం చెయ్యి పాంటు జేబులోకి వెళ్ళింది. ఏదో గుండులాంటిది తీసి, టేబిల్‌మీద జల్లాడు.

గుప్పున పొగలాంటిది పైకిలేచింది. గాల్లో మేఘాల సృష్టి జరిగినట్లు రింగురింగుల పొగ పైపైకి లేస్తోంది.

ఇనస్పెక్టర్ ఊపిరి బిగబట్టి ఆ ప్రమాదం నుంచి తప్పించుకొనే ప్రయత్నం చెయ్యటానికైనా అవకాశం దొరక్కుండా పొగ అతన్ని ఆవరించి వుక్కిరి బిక్కిరి

చేసేసింది.

తక్షణం అతను స్పృహ తప్పిపోయాడు.

4

కళ్లు తెరచాడినస్పెక్టర్.

అతను కుర్చీలోంచి లేచి నిల్చొనేసరికి అతని కళ్ళకి కన్పించింది—303 శవం.

కళ్ళు రెండూ నలుపుకొన్నాడతను.

తన్ని బెదిరించిన 303 మరణించాడా?

ఇనస్పెక్టర్ అతని దగ్గరగా వెళ్ళాడు.

303 శవంప్రక్క సుద్దముక్కతో "నన్ను మన్నించండి సార్!" అని వ్రాసివుంది. ఆ ప్రక్కగా రివాల్వర్.

ఇనస్పెక్టర్‌కి బుర్ర పన్చెయ్యటం మానేసింది కొంత సేపు. తన్ను బెదిరించి స్పృహ పోగొట్టిన 303 ఆత్మ హత్య చేసుకొన్నాడా? ఎందుకూ? అతనికి వెంటనే రాకా గుర్తొచ్చాడు.

పరుగులాంటి నడకతో నలభై యెనిమిది సెల్‌వైపు నడిచాడు.

ఆ సెల్ ఖాళీగావుంది. గట్టుమీద అగాధక్రిష్టి నవల ఇనస్పెక్టర్‌ని వెక్కిరిస్తోంది.

గుండె బేజారయిపోయిందినస్పెక్టర్‌కి.

పరుగున లోపలికి వెళ్ళి ఆ నవల తీసి చూశాడు. ఆ పేజీలో 'రాకా! నిన్ను విడిపిస్తున్నాను' అని రాసి వుంది.

రాకా తప్పించుకుపోయాడు. అతన్ని తప్పించిందెవరు? 303 తప్పించాడా? అతన్ని తప్పించి తనెందుకు ఆత్మ హత్యకి పాల్పడ్డాడు. అతన్ని బెదిరించి రాకాని విడిపిం చాడా ఫోన్‌లో మాట్లాడిన మనిషి. తన వృత్తికి వంచన

చేసానన్న బాధతో 303 రివాల్వర్‌తో కాల్చుకు చచ్చి పోయాడా!

ఇనస్పెక్టర్ తన గదిలోకి వచ్చి, టేబిల్‌పై నున్న బెల్లు మ్రోగించాడు.

బిలబిలమంటూ పోలీసులు వచ్చారు. అంతా 303 శవాన్ని చూసి బిత్తరపోయారు.

"మీరంతా యెక్కడ చచ్చారు?" గొంతు చించుకు అరిచాడు.

"సెల్స్ దగ్గర కాపలా కాస్తున్నాం సార్!" ఓ కానిస్టేబుల్ భయంగా చెప్పాడు.

"స్టుపిడ్స్! అంతా కాపలా కాస్తుండగా నెంబర్ నలభై ఎనిమిది ఖైదీ యెలా తప్పించుకుపోయాడు. మీలో కొందరు వెళ్ళి, ప్రతీట్రాఫిక్ జంక్షన్‌వద్ద కార్లని, బస్‌లని ఆపి చెక్ చెయ్యండి" ఇనస్పెక్టర్ కంఠనాళాలు తెగేలా అందరికీ ఆదేశాలిస్తున్నాడు.

అంతట్లో కమీషనర్‌గారి మనిషి వచ్చి "మిమ్మల్ని అయ్యగారు వున్నపాటున బయలుదేరి రమ్మన్నారు" అని

చెప్పాడు.

ఇనస్పెక్టర్ మరోసారి అందర్నీ హెచ్చరించి బయటికి నడిచాడు.

ఓ టాక్సీ యెక్కి కమీషనర్ ఆఫీసుకు బయలుదేరాడు.

ఇనస్పెక్టర్ని చూడగానే కమీషనర్ ముఖం ఎర్రబడింది.

"మిస్టర్ సంజయ్! నువ్వు బాధ్యతగల పోలీస్ అధికారి వనే అనుకొన్నాను. కాని ఇలా బాధ్యతారహితంగా ప్రవర్తిస్తావనుకోలేదు" అన్నాడాయన మండిపడ్తూ.

"వ్వాట్ సార్! నేనేం చేసాను. నా డ్యూటీకోసం ప్రాణాలైనా యివ్వటానికి సిద్ధంగా వున్నాను" రోషంగా అన్నాడు.

"నీ ప్రాణం దార్జాగా వుంది. కాని యెన్ని ప్రాణాలు పోతున్నాయో తెల్సుకొన్నావా? ఇప్పటికి పదిమంది డాక్టర్స్ మాయమైనారు. వారిలో నలుగురు ఒకే రోజులో శవాలుగా మారారు. డాక్టర్లు మాత్రమే మాయమవ్వటానికి, హత్య గావించబడటానికి కారణం బోధపడక, ఆందోళనతో నీకు ఓ పాతికసార్లు ఫోన్ చేసాను. నీ నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాలేదు నాకు."

"నాకా?" తెల్లబోతూ చూసాడినస్పెక్టర్.

"సంజయ్! నీ ప్రశ్న వింటే నువ్వా పోలీస్ స్టేషన్‌లో ఖాళీ సెల్‌లో కూర్చొని కానిస్టేబుల్స్‌ని పోగుచేసుకొని అష్టా చెమ్మా ఆడ్తూ కూచున్నట్లనిపిస్తోంది" మండిపడ్తూ అన్నాడాయన.

"నో, నో బిలీవ్ మీ సార్! ఏదో మోసం జరుగుతున్నది. ఇదంతా ఏదో ముఠా చేస్తున్న కుట్ర. నేను వుదయం నుంచి నా గదిలోనే అన్నాను. మీ దగ్గర్నుంచి ఒక్కసారి కూడా ఫోన్‌కాల్ రాలేదు." ఈ సారి తెల్ల

పోవటం కమీషనర్ వంతయింది.

"ఈజిట్?"

"ప్రామిస్ సార్! అదీ కాకపోయినా నా జైల్లో జరగ రాని ఘోరాలు జరిగిపోయాయి" ఇనస్పెక్టర్ అంతా చెప్పాడు.

కమిషనర్ ముఖం పాలిపోయింది.

"మిస్టర్ సంజయ్! క్రాంతీపేపర్‌లో ఏముంది? ఆ పేపర్‌కోసం వెళ్ళిన విశ్వం ఏమైనాడు. నేను చేసిన ఫోన్ కాల్స్‌కి నీదాకా ఎందుకు రాలేదు? ఏమిటీ మిస్టరీ?"

"నా మైండ్‌కు అర్ధంకాని ప్రశ్నలు ఇవే సార్!" అతను ఇంకా ఏదో అనబోతుండగా టేబిల్‌పై నున్న టెలి ఫోన్ గణ గణ మ్రోగింది.

కమీషనర్ టెలిఫోన్ అందుకొన్నారు.

క్షణంసేపు రిసీవర్‌ని చెవికి ఆనించుకొని ఆపై "ఆఁ వున్నాడు." అని రిసీవర్ సంజయ్‌కి అందస్తూ "నీకు ఫోన్‌కాల్" అన్నారు.

అతను ఆత్రంగా రిసీవర్ చెవికి ఆనించుకొని "హలో సంజయ్ స్పీకింగ్," అన్నాడాదుర్దాగా.

"హలో సంజయ్! నువ్వు హాస్పటల్‌లో మెంటల్ ట్రీట్‌మెంట్ పొందే అవస్థలో వుంటావనుకొన్నాను. కాని నీ బ్రైన్ ఇంకా నీ కండిషన్‌లో వుందంటే నీ గుండె నిబ్బరానికి నా జోహార్లు___"

మొట్టమొదట ఫోన్ కాల్ మనిషే అని గుర్తించాడు అతను.

"ఎవర్నువ్? యెందుకీ అరాచకాలన్నీ లేవదీస్తున్నావ్? నీ ప్లానేమిటి?" కొంత ఆవేశంగాను, మరికొంత ఆందో ళనగాను అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"యూ ఫూల్! హంతకుడు ఎవరినైనా చంపేముందు చాటింపుకొట్టి మరీ చంపుతాడా?"

"మిస్టర్."

"నా పేరు గాంధీ."

"సిగ్గులేదూ ఆ పేరు వుచ్చరించటానికి."

గాంధీ నవ్వు తెరలు తెరలుగా విన్పించింది.

"సిగ్గెందుకూ. మన నాయకుల్లో కొందరు వెనక ఆ పేరు తగిలించుకొని చెయ్యగలిగినన్ని దారుణాలు చేసే సారుగా. అయినా ఆ పేరులేని ప్రబుద్ధులు మాత్రం ఏం చేస్తున్నారేంటి?"

"గాంధీ! నీ దేశాన్ని నువ్వే విమర్శించడం తప్పు!"

"నేరం తల్లి చేసినా, తండ్రి చేసినా విమర్శించవచ్చన్నది నీ చట్టమే."

"ఇంతకీ విశ్వాన్ని ఏం చేశావ్?"

"పేపర్ చూస్తే తెలిసేదిగా" అవతల ఫోన్ పెట్టేసిన ధ్వనయింది.

ఇన్స్పెక్టర్ రిసీవర్ పెట్టేసి పిచ్చిగా తల గోక్కున్నాడు.

"సంజయ్! ఎవరా గాంధీ." కమీషనర్ కలవరంగా అడిగాడు.

"ఇన్ని దారుణాలకి కారకుడు."

"అతనెందుకిన్ని దారుణాలు చేస్తున్నాడు? డాక్టర్స్‌ని హత్య చెయ్యటానికి కారణం ఏమిటి? పోలీస్‌స్టేషన్‌పై ఈ కసి దేనికి?"

"సార్! ఈ రెంటికి, అతని చర్యలకి వెనక ఏదో కారణం వుంది."

"అయితే కర్తవ్యం?"

"క్రాంతీపేపర్ చూసాకా ఆలోచించాలి."

కమీషనర్ టెలిఫోన్‌దగ్గరికి పరిగెట్టాడు. ఏదో నెంబర్ డైల్ చేసి, ఎవరితోనో మాట్లాడారు.

ఆయనేం మాట్లాడుతున్నది తలకి ఎక్కటం లేదు ఇన్ స్పెక్టర్‌కి. ఒక్కరోజులో పోలీస్ స్టేషన్‌ని ఇంతలా ఖంగారుపెట్టేస్తున్న గాంధీకోసం తీవ్రంగాఆలోచిస్తున్నాడు.

కమీషనర్ ఫోన్ పెట్టేసి "నీకు ఐదు నిమిషాల్లో క్రాంతీపేపర్ వస్తుంది" అన్నారు.

ఆ ఐదు నిముషాలు ఇద్దరూ మతులుపోయిన వాళ్ళలా కూర్చున్నారు. ఆ ఐదు నిముషాల తర్వాత ఓ మనిషి లోపలికి వచ్చాడు. అతని చేతిలో క్రాంతీపేపర్ వుంది.

అతను కమీషనర్‌గారికి నమస్కరించి "యస్.బి. గారు ఈ పేపర్ మీకిచ్చి రమ్మన్నారు సార్. మరో అరగంటలో జరిగే కాన్ఫరెన్స్‌కి మిమ్మల్ని రమ్మని చెప్పమన్నారు" అన్నాడు.

సంజయ్ అతని చేతిలో పేపర్ లాక్కొని ఆతృతగా రెండోపేజీ తిప్పాడు.

"పోలీస్‌స్టేషన్ నిద్రపోతోంది" అది పైన హెడ్డింగ్.

"ఇప్పటికి పదిమంది డాక్టర్స్ మాయమయ్యారు. నలుగురు హత్యగావించబడ్డారు. అయినా విచిత్రం ఆ విషయం పోలీసుల దృష్టిలోకి ఇంతవరకూ పోలేదు.హతులైనవారి మనుషులు ఈ దారుణ కాండను ఆపాలంటూ పోలీస్ డిపార్ట్‌మెంటువారితో మొరపెట్టుకొంటే వాళ్ళు వాళ్ళని మెడపట్టి మరీ గెంటేసి, ఆ స్టేషన్‌లో సినిమాల చర్చ జరుపుకొంటున్నారు. ప్రజల్ని కాపాడవల్సిన పోలీస్ డిపార్ట్‌మెంటే మీరు చస్తే చాలని చూస్తోందని స్పష్టం చేస్తోంది.

అలా రోజుకో నలుగురు డాక్టర్స్ చనిపోతుంటే పోలీసులు ఎందుకు కలుగజేసుకోవటంలేదు. కనీసం రోడ్ల మీద హతుల శవాలనైనా పరీక్షించటానికి ఓ పోలీస్ మనిషి రాగలిగాడా? ఈ వ్యవహారమంతా చూస్తుంటే యీ మర్డర్స్‌కి, పోలీసుల నిర్లక్ష్యానికి ఏదో కాంట్రాక్ట్ వుందనిపిస్తోంది....

ఇప్పుడే అందిన మరో వింత. ఆర్ట్స్ రోడ్‌లో ఓ డాక్టర్ శవం పడి యేడుస్తోంది. ఇది ఐదో శవం. దాన్ని చూసే ఓపిక అయినా మన పోలీస్ డిపార్టుమెంటుకు వుందా?"

ఇన్‌స్పెక్టర్ గుండె జారిపోయింది.

పేపర్ మౌనంగా కమీషనర్‌కి అందించాడు.

5

ఆర్ట్స్ రోడ్డు దగ్గర జనం గుంపులు గుంపులుగా మూగివున్నారు.

ఇన్‌స్పెక్టర్ సంజయ్ తన బలగంతో వచ్చాడక్కడికి. అతన్ని చూడగానే జనం అంతా దూరంగా జరిగిపోయారు. ఇన్‌స్పెక్టర్ చూపులు హతునిపై పడ్డాయి.

ఫుల్ వైట్ డ్రెస్‌లో వున్నాడతను.

పోలీస్ డాక్టర్, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్టు, ఫోటోగ్రాఫర్ తమ తమ పనుల్లోకి దిగారు.

"హతుడు నిన్నరాత్రి పన్నెండుకి, పన్నెండున్నరకి మధ్య ప్రాంతంలో మరణించాడు. అతని శరీరంలోంచి రక్తాన్ని పూర్తిగా తీసేశారు" డాక్టరు శవాన్ని పరీక్షించి చెప్పాడు.

శవాన్ని చూసాడినస్పెక్టర్. శవం పాంటుజేబులు చెక్ చేసాడు. మనీపర్స్, ఏవో కాయితాలు వున్నాయి. పర్స్

తెర్చి చూసాడు. అడ్రస్ కార్డు, రెండువందనోట్లు, వున్నాయి. అతను అడ్రస్ కార్డు చూసాడు.

డాక్టర్ పరశురామ్, పెరియార్ రోడ్, టి. నగర్— అని వుంది.

6

ఇన్‌స్పెక్టర్ సంజయ్ 303 అయిన వైకుంఠరావు యింటి తలుపు తట్టాడు.

వైకుంఠరావు భార్య తలుపు తీసింది.

ఇన్‌స్పెక్టర్‌ని చూడగానే ఆవిడ బోరుమని ఏడవడం ప్రారంభించింది.

"వైకుంఠరావు ఆత్మహత్య నాకో పజిల్ అయింది. అతను హంతకుల్తో చేతులు కలిపాడన్నది స్పష్టమౌతోంది. దయచేసి మీకు ఏమైనా తెలిస్తే చెప్పండి" అన్నాడతను.

ఆమె అతన్ని లోపలికి ఆహ్వానించి కూర్చోబెట్టింది.

"ఇప్పుడే వస్తానుండండి" అని పక్కగదిలోకి వెళ్లి రెండు నిముషాల్లో తిరిగొచ్చింది. ఇప్పుడామె చేతిలో ఓ గులాబిరంగు కవరుంది.

"ఇది చదవండి. నా భర్త చావుకి, ప్రవర్తనకి కారణం తెలుస్తుంది" అంది. ఆమె కంఠం పూడుకున్నట్లుంది.

సంజయ్ ఆ కవరులోంచి ఓ కాయితాన్ని పైకి తీసాడు. దాన్లో సారాంశం ఇది.

"వైకుంఠరావు: నీ ముద్దుల కొడుకు డాక్టర్ రమేష్ ప్రస్తుతానికి నా బందీ. నీ ఒకే ఒక వంశాంకురాన్ని ప్రాణాల్తో చూసుకోవాలంటే ఈ రాత్రి పన్నెండు గంటలకి ప్లేగ్రౌండ్ రోడ్ దగ్గరకి రా. నేను నీ కోసం

యెదురు చూస్తుంటాను. మరో విషయం—ఇది యెవరికైనా తెల్సిందో, నీ రమేష్ శవాన్ని చూస్తావ్!

గాంధీ."

కాయితం మడతపెట్టి, కవర్లోపెట్టి, కవరు జేబులో పెట్టుకొని ఆమెవైపు చూసాడు.

"గాంధీని కలిసాడు కదూ!" అన్నాడు.

తలూపిందామె,

"రాకాని విడిపిస్తే రమేష్‌ని అప్పగిస్తాడన్నాడు. అవునా?"

మళ్ళీ తలూపింది.

నిట్టూర్చాడు ఇన్‌స్పెక్టర్.

"వైకుంఠరావు తను చట్టవిరుద్ధంగా ప్రవర్తించినందుకు ఆత్మహత్య చేసుకొన్నాడు. కాని గాంధీ ఏం చేసాడు? మీ అబ్బాయిని మీకు తిరిగి అప్పగించాడా? లేదు. వైకుంఠరావు ఒక్కసారి జరిగింది నాతో చెప్తే! ప్చ్" ప్రయోజనం లేదన్నట్లు పెదవి విర్చి, పైకి వచ్చాడు.

గాంధీ అన్నట్లు అతని బ్రైన్ యెక్కడో దెబ్బ తింటోంది.

ఏది ఎలా ఎక్కడ పరిష్కరించాలో అర్థంకావటం లేదు. యే పని ముందు చెయ్యాలో తెల్సిరావటంలేదు.

అతను కారు ఎక్కాడు.

మరుక్షణం కారు పెరియార్ రోడ్డు వైపుకు సాగిపోయింది.

పెరియార్ రోడ్‌లో డాక్టర్ పరుశురామ్ ఇంటిముందు కారు ఆపాడు.

కారు దిగి, ముఖాన పట్టిన చెమటల్ని అరచేత్తో



తుడుచుకొని లోపలకి వెళ్లాడు.

కాలింగ్ బజర్ నొక్కాడు.

కొద్దిక్షణాల్లో తలుపు తెరిచారెవరో.

ఓ యువకుడు నిల్చొని వున్నాడు. డ్యూటీ దుస్తుల్లో వున్న ఇన్‌స్పెక్టర్‌ని చూడగానే అతని భృకుటి ముడి పడింది.

"నేను క్రైమ్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్‌ని. డాక్టర్ పరశురామ్‌గారి హత్యకేసు పరిశోధించటానికి వచ్చాను," అన్నాడు.

వ్యంగ్యంగా నవ్వాడా యువకుడు.

"ఏం పరిశోధన సార్! దొంగలుపడ్డ ఆర్నెల్లకి కుక్క మొరిగిందన్నట్లు. ఈ వీధిలో ఐదుగురు డాక్టర్స్ హత్య చెయ్యబడ్డారు. మీకు ఫోన్‌మీద ఫోన్‌చేస్తే ఒక్కసారి రాగలిగారా? ఇదా మీ డ్యూటీ." ఆ యువకుడు రెచ్చి పోతున్నట్లు అంటుంటే ఇన్‌స్పెక్టర్‌కి ఏం చెప్పాలో తోచలేదు.

"మీ డిపార్ట్‌మెంట్ చాతకానిది, చేయలేనిది అంటే

అది కిట్టనివాళ్ళ పుకారనుకొన్నాను. కాని పూర్తిగా నిద్ర పోతోందని ఇప్పటికి అర్థమైంది."

"మిస్టర్! మీకు జరిగినవే చెప్పుకొంటున్నారు. కాని మాకు జరిగినవి మీకేం తెలుస్తాయి. ఫోన్‌లో మీకు మా నుంచి ఎలాంటి రెస్పాన్స్ రానప్పుడు డైరెక్టుగా పోలీస్ స్టేషన్‌కి రావచ్చుగా."

మరింత వ్యంగ్యంగా నవ్వాడతను.

"ఈ ఆలోచన మాకు రాలేదనుకోకండి. మేమంతా మీ స్టేషన్‌కి వస్తే మీ కానిస్టేబాల్ 303 మీరు లేరనిచెప్పి మమ్మల్ని తగిలేసాడు."

నిట్టూర్చాడు ఇన్‌స్పెక్టర్.

ఏ కోణంలోంచి చూసినా పోలీస్‌వార్ని దోషులుగా నిలబెట్టాడు గాంధీ. ఎందుకిలా చేస్తున్నాడతను? అతనిలో ఈ రాక్షస ప్రవృత్తికి కారణం ఏమిటి?

ఇన్‌స్పెక్టర్ తన ఆలోచనల్ని ఆపి ఆ యువకునివైపు చూసాడు.

"మిస్టర్! నీకు నేను యిప్పుడు అన్నీ వివరించి చెప్ప లేను. అందుకు టైమ్ చాలదు. నేనడిగిన వాటికి మీ నుంచి సరైన ఆన్సర్స్ కావాలి" గంభీరంగా అన్నాడు.

అతను యేమనుకొన్నాడో ఏమో ఇన్‌స్పెక్టర్‌ని లోపలకి ఆహ్వానించాడు.

పరశురామ్ భార్యా, తల్లీ వరండాలో కూర్చొని వున్నారు.

"మా అన్నయ్య భార్య, ఆవిడ మా అమ్మగారు. నా పేరు దినకర్—" అతను అందర్నీ పరిచయం చేసుకొన్నాడు.

"పరశురామ్ మీ అన్నయ్యన్నమాట. ఆయన ఏ రోజు

మాయమైనారో వివరంగా చెప్పగలరా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మొన్న శనివారం సాయంత్రం అన్నయ్యా మేమంతా కల్సి ఈ హాల్లో మాట్లాడుకొంటున్నాం. అంతలో బయట బజర్ మ్రోగింది. వదిన వెళ్ళి తలుపు తీసింది. రెండు నిమషాల్లో వదినతో యెవరో అమ్మాయి వచ్చింది. అన్నయ్యకి మూడువందలు ఇచ్చి తన అక్క చావు బ్రతుకుల మధ్య వూగిసలాడ్తోందని చెప్పి, అన్నయ్యని రమ్మంది. అన్నయ్య డ్రెస్ చేసుకొని ఆమెతో వెళ్ళాడు.

అలా వెళ్ళినావాడు రాత్రి పది అయినా ఇంటికి రాలేదు. అంతా ఖంగారుపడ్డాం. ఆ మర్నాటి వుదయానికైనా అన్నయ్య రాకపోయేసరికి పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేసాను. మీ నుంచి నో రెస్పాన్స్. ఆఖరికి అన్నయ్య శవం దొరికింది మాకు. అన్నయ్యలాగే ఈ వీధిలో నలుగురు డాక్టర్స్ మరణించారు. అన్నయ్యతో సహా మిగతా నలుగురూ ఒకేలా చంపబడ్డారు.

అందరి వంట్లో రక్తం తీసి వెయ్యబడింది. ఈ వీధిలో అంతా గజగజలాడిపోతున్నారు. మా వీధికి పోలీస్ రక్షణ కావాలని అంతా మీ పోలీస్‌స్టేషన్ కొచ్చాం. మీ కానిస్టేబుల్ 303 మమ్మల్ని పొమ్మన్నాడు" అతను చెప్పటం ఆపాడు.

ఇన్‌స్పెక్టర్ లేచి నిల్చొని, "మీరు మిగతా డాక్టర్స్ ఇళ్ళకి ఓసారి నన్ను తీసుకెళ్లండి" అన్నాడు.

దినకర్ ఇన్‌స్పెక్టర్ వెనక వెళ్ళాడు.

ఆ వీధిలో నలుగురు డాక్టర్స్ లక్షాధికార్లే.

7

విశ్వం కళ్లు తెర్చాడు.

చుట్టూ చూసాడు.

అదొక రూమ్. డీసెంట్‌గా వుంది. తెల్లటి బెడ్. పక్కన బల్ల. దానిపై టానిక్కులు.

అది హాస్పటల్ అని గ్రహించాడతను.

నేను బ్రతికానా! ఎలా? ఆశ్చర్యపోయాడతను.

అంతలో బయట టక్ టక్‌మని బూట్ల ధ్వని వినిపించింది.

ఇన్‌స్పెక్టర్ సంజయ్, డాక్టర్ హెడ్‌సన్ లోపలకి వచ్చారు.

"సార్! విశ్వం అతన్ని చూసి ఆనందంగా లేవబోయాడు.

"పడుకో. వీక్‌గా వున్నావు" ఇన్‌స్పెక్టర్ ఆప్యాయంగా అన్నాడు.

"మిమ్మల్ని చూస్తానని అనుకోలేదు సార్!" విశ్వం సంతోషంగా అంటున్నవాడల్లా భృకుటి ముడిచి, "అవునూ నేనెలా బ్రతికాను?" అన్నాడు.

భారంగా శ్వాస పీల్చి వదిలా డిన్‌స్పెక్టర్.

"నేను క్రాంతీ పేపర్ తాలూకా ఎడిటర్ దగ్గరకి వెళ్లి తిరిగి వస్తుండగా క్రాస్‌రోడ్‌లో నువ్వు గాయాలతో కనిపించావు. ప్రాణం పోయిందనే భయపడ్డాను. కాని అదృష్టం. నీలో కొన వూపిరి వుంది. నిన్ను వెంటనే హాస్పిటల్లో యెడ్మిట్ చేసాను" చెప్పా డిన్‌స్పెక్టర్.

విశ్వం ముఖం చిన్నబోయింది.

"గాంధీ చాలా బలవంతుడు. తప్పనిసరిగా అతని చేతిలో చావుదెబ్బ తినాల్సివచ్చింది."

"పేపర్‌కోసం వెళ్లినవాడివి గాంగీ చేతికి యెలా దొరి కావు?" అడిగా డిన్‌స్పెక్టర్.

విశ్వం జరిగిందంతా చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ తన అనుభవాలని చెప్పుకొన్నాడు.

"సార్! గాంధీని మనం పట్టుకోకపోతే లాభంలేదు. లేకపోతే ప్రజలంతా యేకమై మన స్టేషన్‌మీద దాడి ప్రారంభిస్తారు" అతను కలవరంగా అన్నాడు.

"వూళ్ళో మళ్ళీ యెక్కడా హత్యలు జరగలేదు. ప్రతీ డాక్టర్ యింటా పోలీస్ బందోబస్తు పెట్టించాను. మన వాళ్ళంతా చాలా జాగరూకతతో వ్యవహరిస్తున్నారు."

"రాకా గురించి ఏమైనా తెల్సిందా?"

"రాకా డిగ్రీహోల్డర్. కరాటే, జూడోల్లో ఆరితేరిన మనిషి. అతడు గాంధీ సహచరుడు" ఇన్‌స్పెక్టర్ చెప్తున్నంతలో సిస్టర్ వచ్చింది. ఆమె చేతిలో ఓ న్యూస్‌పేపర్ వుంది.

ఇన్‌స్పెక్టర్ ఆ పేపర్ అందుకొని మొదటిపేజీ విశ్వానికి చూపించాడు.

అందులో సార్జెంట్ విశ్వం ఫోటో వుంది.

కింద—"ఓ కేసు నిమిత్తం ప్రత్యర్థితో ముష్టియుద్ధం గావించి, మరణం పొందిన సార్జంట్ విశ్వం ఆత్మశాంతికి పోలీస్ సిబ్బందంతా శ్రద్ధాంజలిఅర్పించింది—"అని వుంది.

చదివి ఇద్దరూ తెల్లబోయారు.

8

'డాక్టర్ బాషా, యమ్. బి. బి. యస్.'

ఆ వ్యక్తి ఓసారి బోర్డు చూసాడు!

పై అక్షరాలు రంగు రంగుల బల్బులతో ఆరి వెలుగుతున్నాయి.

ఆ వ్యక్తి అటూ, ఇటూ చూసాడు. మనుషులు తిరుగుతున్నారు.

తనను యెవరూ గుర్తించలేదనుకొన్నాడు. ఆ యింటి వ్యక్తుల్తో బాగా పరిచయమున్నవాడిలా దర్జాగా లోపలకి నడిచాడు.

హాలంతా మార్బుల్ స్టోన్ కట్టడంతో అందంగావుంది. ఖరీదైన ఫర్నిచర్ వుంది.

ఆ వ్యక్తి పోడి దగ్గు దగ్గాడు—తను వచ్చినట్లు గుర్తుగా....

అంతలో ఓ సర్వెంట్ వచ్చాడు. అతను ఖరీదైన డ్రెస్‌లో వున్నాడు.

"హూం ఆర్ యూ!" సర్వెంట్ ఇంగ్లీషు మాట్లాడటం అతనికి ఆశ్చర్యాన్ని కల్గించింది.

"నా పేరు వేలాయుధం. డాక్టర్ బాషాగారి కోసం వచ్చాను."

"సార్! బాషాగార్ని చూడాలంటే యాభై రూపాయల ఫీజు చెల్లించాలి" అన్నాడతను.

వేలాయుధం కళ్లు ఎర్రబడ్డాయి.

"మీ డాక్టరేం దేవుడా. ఆ ఏడుకొండల వెంకటేశ్వరుని చూట్టానికే అంతఫీజు లేదే. మీ డాక్టర్‌లో వున్న స్పెషాల్టీ యేమిటి యాభై రూపాయల ఫీజుకి."

నవ్వాడు సర్వెంట్.

"స్పెషాల్టీవున్న దేవుడికే ఫీజు తీసుకొంటున్నపుడు ప్రాణం నిలబెట్టాల్సిన డాక్టర్ ఫీజు కోరితే తప్పా. అయినా నీ పేరు వేలాయుధం అంటున్నావు. వెంకటేశ్వరుని ఫీజుగురించి మాట్లాడుతున్నావు. నీ దేవుడి ఫీజెంత?"

వేలాయుధం గొంతులో పచ్చివెలక్కాయ అడ్డం పడింది. మారు మాట్లాడకుండా జేబులోంచి యాభై నోటు తీసి సర్వెంట్ చేతిలో పెట్టాడు. అతను వెళ్ళబోతుంటే జబ్బపట్టి ఆపి "చూడు! మీ డాక్టర్ దగ్గర నీ అధిక ప్రసంగం తగ్గటానికి ఏదైనా మందు పుచ్చుకో. లేకపోతే నా లాంటివాళ్ళకి నువ్వో హెడ్డేక్ అవుతావు" అన్నాడు.

సర్వెంట్ నవ్వి వెళ్ళిపోయాడు.

వేలాయుధం సోఫాలో కూర్చున్నాడు.

వీడే యిలా పదునైన చురకత్తిలా వున్నాడు. ఇక వీణ్ని మేపే ఆ డాక్టర్ యెలా వుంటాడో?

ఏదో టెన్షన్, తెలియని ఎక్సయిట్‌మెంట్ పురకలు వేస్తోందతనిలో. గోళ్లు కొరుక్కుంటూ కూర్చున్నాడతను.

మరో పావుగంట అతనలాగే యిబ్బందిగా గడిపాకా గదిలోంచి బూట్లధ్వని విన్పించింది.

వేలాయుధం గుండెవేగం హెచ్చింది.

తిరిగతనిలో ఎక్సయిట్‌మెంట్ జనించింది. చురకైన చూపుల్తో ద్వారం కేసి చూడసాగాడు.

ఫుల్ వైట్ డ్రెస్‌లో కన్పించాడు బాషా.

కళ్ళకి నల్లగాగుల్స్ పెట్టాడు. చిన్న పిల్లగెడ్డం. దుబ్బగా కత్తిరింపబడ్డట్టున్న కనుబొమలు. ఈగమీసం, చెంపమీద చిన్న వులిపిరికాయ.

బాషా నడచివచ్చాడు. అతని నడకలో డబ్బుదర్పం, చూపులో వృత్తిగర్వం పసిగట్టాడు వేలాయుధం. మర్యాదగా లేచి నిల్చున్నాడు.

డాక్టర్ బాషా సునిశిత దృక్కుల్తో వేలాయుధాన్ని పరిశీలించాడు.

ఆరున్నర అడుగుల విగ్రహం అతనిది. పచ్చటి దేహ

చ్చాయ. వెనక్కి దువ్విన వత్తైనజుత్తు. సన్నని మీసంతో అందంగా ఆకర్షణీయంగా కవ్విస్తున్నాడు.

బాషా తన సీట్లో కూర్చున్నాడు.

వేలాయుధం సర్దుకు కూర్చున్నాడు.

"నా పేరు వేలాయుధం! నాకు పెద్ద ఇండస్ట్రీ వుంది."

"అయితే?"

"నేను ఈ మధ్యనే పెళ్ళి చేసుకొన్నాను. నా భార్యపేరు మణి. దానికో జబ్బుంది."

"ఏమిటా జబ్బు?"

"పెళ్ళి అయిన ఫస్ట్‌నైట్ నా దగ్గరకి రావటానికి హిస్టీరియా వచ్చినదాన్లా వణికిపోయింది. అది మొదలు...."

అతను తన మాటల్ని ఆపి బాషా ముఖంలోకి చూసాడు.

అతను శరీరాన్నంతటిని కదిలిస్తూ నవ్వాడు.

"అంటే పెళ్ళయినా నిన్ను బ్రహ్మచర్యం పట్టి పీడిస్తోందన్న మాట" అని నవ్వి తిరిగి, "నీకు కావల్సిన సుఖాన్ని బయట కొనుక్కోవచ్చుగా" అన్నాడు వుచిత సలహా పారేస్తూ.

వేలాయుధం యూ ఆర్‌ఫూల్ అన్నట్లు చూసాడు. సర్వైట్ కాదు డాక్టర్‌కూడా అనవసర ప్రసంగి, అసందర్భ ప్రలాపి అనుకొన్నాడు. అయినా అవసరం తనది. వాళ్ళు విసిగించినా తను శాంతం వహించాలి.

"నేను ఏకపత్నీవ్రతుణ్ని. అదీ కాకపోయినా మణిని నేను ప్రేమించి, పెళ్ళాడాను."

"ప్రేమించటానికి వున్న చొరవ నీతో వుంటానికి లేదా నీ భార్యకి."

విసుక్కొంటున్నట్లు చూసాడు వేలాయుధం.

"ప్రేమించింది నేనన్నాను కాని ఆవిడ కాదు. మణి



తండ్రి చాలా పూర్ ఫెలో. నేను మణిని పెళ్ళి చేసుకొంటా ననగానే మా యిద్దరి పెళ్ళి జరిపించేసాడు. పెళ్ళినాటి రాత్రే మణి సత్తా తెల్సివచ్చింది నాకు" విచారంగా ముఖం పెట్టాడు.

"పగలెలా వుంటుంది నీ భార్య?"

"చాలా సరదాగా వుంటుంది. ఇద్దరం కల్సి సినిమాలకి, షికార్లకి కల్సి వెళ్తాం. అన్ని వేళల్లో చాలా వుషారుగా వుండే మనిషి ఆ టైమ్‌లో మూర్ఛపోతుంది."

"ఏ టైమ్?" వుత్సుకతగా వుందతని ప్రశ్న.

బుర్ర గోక్కున్నాడు వేలాయుధం.

"ఆదే....రాత్రి సమయంలో" నీళ్ళు నమిలాడు.

"నువ్వు ఎప్పుడైనా నీ భార్యని ముద్దు పెట్టుకున్నావా?" డాక్టర్ ప్రశ్నకి గుర్రుగా చూసాడతను.

"ఏం మీ భార్యని మీరు ముద్దెట్టుకు ఎరగరా" ఒళ్లు మండి అడిగాడు.

గలగలా నవ్వాడు బాషా.

"నాకింకా పెళ్ళికాలే" అన్నాడు ముసిముసిగా నవ్వుతూ.

అదా సంగతి అనుకొన్నాడు వేలాయుధం.

"అలాంటి సీక్వెన్స్‌కే నా భార్య బెదిగిపోతుంది" అన్నాడు.

"సరిగ్గా చెప్పండి" బాషా వుత్సాహంగా ముందుకు వంగి అన్నాడు.

"నేను తన్ని స్పర్శించనంత వరకూ ఫ్రీగా అంటే ఫ్రెండ్లీగా వుంటుంది" అని ఆ మాటల్లోనే అర్థాన్ని యిమిడ్చి పలికేసాడు.

బాషా దీర్ఘంగా ఆలోచించాడో రెండు నిముషాలు.

"ఇదో కొత్త కేసు" అన్నాడు.

"అవును. మీరు ఇలాంటి కేసులు ఎన్నో సక్సెస్ చేసారని వినే మీ దగ్గరికి వచ్చాను" దీనంగా చూసాడు.

"నీ భార్యని తీసుకురాలేకపోయావా?"

"ఆడపిల్ల యెదురుగా మనం యిలా మాట్లాడుకోవటం బాగుండదు కదా. మీకు అన్నీ చెప్పి ఇంటికి తీసుకు వెళదామని వచ్చాను" అన్నాడు.

"నే నింటికి రావాలంటే నా ఫీజు ఎంతో తెలుసా?"

విటూరుగా అయాడు వేలాయుధం.

లేచి నిల్చోని, రెండు పాంటుజేబుల్లోకి చేతులుపోనిచ్చి నోట్లకట్టలు తీసి విసురుగా బల్లపై పడేసాడు.

బాషా కళ్ళతోపాటూ నోరు కూడా తెరిచాడు.

"ఈ డబ్బు చాలా."

బాషా నోరుమూసి నవ్వాడు.

"నువ్వు చాలా ఆవేశపరుడిలా వున్నావు."

"కాదు. నా భార్య నాది కావాలన్న ఆందోళనలో వున్నాను."

"అచ్చా! నీ యింటికి వస్తాను పద" అంటూ లేచాడు డాక్టర్ బాషా.

9

ఇనస్పెక్టర్ సంజయ్ వాచీ చూసుకొన్నాడు.

ఎనిమిదిన్నర పైన అయింది టైమ్.

డాక్టర్ బాషావేషంలో సార్జెంట్ విశ్వం ఆ యింటి లోపలకి వెళ్ళి అప్పటికే అరగంటకి పైనే అయింది. ఇంతవరకూ బయటకు రాలేదు.

"సార్! ఆ దొంగవెధవ విశ్వాన్ని ఏమైనా చేస్తే!" ఓ కానిస్టేబుల్ భయంగా అన్నాడు.

చిరాగ్గా చూసాడినస్పెక్టర్.

"నేను లోపలకి వెళ్తాను. ఏదైనా ప్రమాదం జరిగితే విజల్ వేస్తాను. వెంటనే ఈ ఇంటిని అంతా చుట్టు ముట్టండి" ఇనస్పెక్టర్ పాంటు జేబులో రివాల్వర్ని తడుముకొని ముందుకు నడిచాడు.

గేటు తెరుచుకొని లోపలకి అడుగు పెట్టాడు.

బయటంతా చీకటిగా వుంది. హాల్లో కూడా చీకటే ఆవరించుకు వుంది.

ఇనస్పెక్టర్ వెనకవైపు వచ్చాడు!

పైన ఎత్తైన డాబా కన్పిస్తోంది.

కింద పింకోనా చెట్లు గాలికి దెయ్యాల్లా వూగుతున్నాయి.

ఇనస్పెక్టర్ ఓ చెట్టు పట్టుకు పైకి ఎగబ్రాకాడు.

కడుపంతా చీరుకొంటోంది. అతి కష్టంమీద పిట్టగోడ దాకా ఎగబ్రాకిపోయాడు. అతని బరువుకి చెట్టు వూగుతోంది. గాలిలోకి శరీరాన్ని వదలి, అతను గబుక్కున పిట్టగోడమీదకి జంప్‌చేసాడు. ఏ మాత్రం బేలన్స్ తప్పినా ఆపైనుంచి కింద పడేవాడే. అలాగాని పడితే అతని ఎముకలు వాటిస్థానంలో వుండేవికావు.

పిట్టగోడమీద నిల్చోని డాబామీదకి ఎక్కాడు.

డాబా అంతా ఖాళీగావుంది. దానికి యెడంవైపుకు మెట్లు వున్నాయి. మెల్లగా మెట్లు దిగాడు అతను.

కింద హాలులోకి చేరాయా మెట్లు. హాలంతా చీకటిగా వుంది. ఇనస్పెక్టర్ పాంటుజేబులోంచి రివాల్వర్ తీసి స్టడీగా పట్టుకొన్నాడు. చీకటిలోనికి గుచ్చిచూసాడు. ఫర్నిచర్ తప్పించి మరేం కన్పించటంలేదు.

హాల్లోంచి గదికి దారివుంది. అతనా గదివద్దకు వెళ్ళి, తలుపుల దగ్గర నిల్చున్నాడు. లోపల్నుంచి ఎలాంటి శబ్దం వినరాలేదు.

లోపల గడియపెట్టబడి వుందని తెల్సి వుస్సూరు మన్నాడు. అ వరండా దాటి ఆ గది వెనక్కి వచ్చాడు. గాజద్దాల కిటికి కన్పించింది.

గాజద్దాల కిటికీలోంచి లోపిలకి చూసినతను షాక్ తిన్నట్లు వుండిపోయాడు.

లోపల బెడ్‌మీద బాషా వెల్లకిల్లా పడివున్నాడు. అతని చేతులు, కాళ్ళు-కట్టివేయబడి వున్నాయి. అతనికి కొద్ది దూరంలో ఓ కుర్చీలో ఓ మనిషి వున్నాడు. ఆ కుర్చీకి కట్టివేయబడి వున్నాడు. అతని పక్కన గాంధీ నిల్చోని వున్నాడు.

బాషా యెదురుగా తెల్లటి దుస్తుల్లో మరో మనిషి వున్నాడు. అతను గాంధీతో మాట్లాడుతూ యేమిటో సౌజ్ఞలు చేస్తున్నాడు.

ఇంకా ఆలస్యం చేస్తే బాషా ఒంట్లోని రక్తమంతా హరించుకుపోతుంది. క్షణం ఆలస్యం చేయకుండా ఇన్‌స్పెక్టర్ రివాల్వర్ పేల్చి గాజుకిటికీ బద్దలుచేసాడు.

ఫెళ్లున గాజుముక్కలు పడ్డశబ్దం అయేసరికి అంతా

తలలు తిప్పిచూసారు.

ఇనస్పెక్టర్ సంజయ్ లోపలకి గెంతి, గాంధీ కంఠాన్ని వడిసిపట్టుకొని, రివాల్వర్ వైట్ డ్రెస్ అతనికి గురిపెట్టి "స్కౌండ్రల్! బాషా కట్లువిప్పు. లేదా నీ బాస్‌ని కాల్చి పారేస్తాను" అని గర్జించాడు.

వైట్ డ్రెస్ మనిషి గాంధీ ముఖంలోకి ఏం చెయ్యను అన్నట్లు చూసాడు.

"ప్రకాష్! అతని కట్లు విప్పెయ్. లేదా ఈ ఇనస్పెక్టర్ అంత పనీ చేస్తాడు" గాంధీ నవ్వుతూ అన్నాడు.

ప్రకాష్ బాషాకట్లు విప్పాడు.

చురుగ్గా లేచి విల్చున్నాడతను.

"థాంక్యూ సర్! సమయానికి వచ్చి నన్ను కాపాడారు. లేకపోతే నాకు నిజంగా డెత్ సర్టిఫికెట్ లభించేది."

"ఇనస్పెక్టర్! అతను....అతను" గాంధీ భృకుటి ముడివడింది.

ఇనస్పెక్టర్, గాంధీని ప్రకాష్‌మీదకి తోశాడు.

"నువ్ చంపావనుకొన్న నా సార్జెంటు విశ్వం" గర్వంగా చూసాడు.

"విశ్వం! ఆ కుర్చీలోని మనిషి కట్లువిప్పు" ఆజ్ఞాపించాడు సంజయ్. సార్జెంటు విశ్వం ఆ మనిషి కట్లు విప్పాడు.

"గాంధీ! ఒక్క నలభై నాలుగు గంటల్లో ఈ నగరాన్నంతటిని అల్లకల్లోలం చేశావు. ఐదుగురు డాక్టర్ప్ ప్రాణాలని బలి తీసుకొన్నావ్. కారణం ఏమిటి?"

గాంధీ, విశ్వం కట్లువిప్పిన మనిషిమీదకి చూపులు నిలిపాడు.

"వాడే....వాడే నన్నీస్థితికి తెచ్చింది" ఆవేశంగా

అర్చాడు.

"ఇనస్పెక్టర్! నేనూ నీలా నీతి, నియమాల కోసం పాకులాడే మనిషినే. నా తల్లీ, తండ్రి నన్ను గాంధీ అంతటివాణ్ని చెయ్యాలని కాబోలు ఆ పేరు పెట్టారు. ఆయన అడుగుజాడల్లోనే నడిపించేవారు నన్ను. బి. కామ్. ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. డిగ్రీ వచ్చాక నా పాట్లు మొదలైనాయి. డిగ్రీ వచ్చాక నేనున్నది పవిత్రదేశంలో కాదు వూబిలో అని తెల్సివచ్చింది.

ఉద్యోగంకోసం యెక్కడికి వెళ్ళినా రికమండేషన్, లేదా లంచం కావాలి. ఆ రెండూ నాకు లేవు. నాన్న రిటార్డైపోయారు. ఇల్లు గడవటం దుర్భరమైపోయింది. అమ్మా, నాన్నలకి తెలియకుండా కూలిపన్లుచేసి, ఆ డబ్బుల్తో ఓ పూట తిని, మరోపూట తినక వుంటున్నాం. తిండి సరిగ్గాలేకా అమ్మకి టీ.బి. ఎటాక్కయింది. ఏ డాక్టర్ దగ్గరికి వెళ్ళినా మనిషిని చూట్టానికే వందలు కావాలనే వారు.

ఆఖరికి మందులకోసం మా బాధలు చూసి, అమ్మ నూతిలోదూకి ఆత్మహత్య చేసుకొంది. మెంటల్ షాక్ తగిలింది నాకు. అర్నెల్లు పిచ్చాసుపత్రిలో గడిపాను. నాలో ఒకే ఒక భావం. డాక్టర్ అంటే హృదయం లేని పాషాణం అని.

నాన్న తన రక్తం ధారపోసి నన్ను మళ్ళీ మనిషిని చేసాడు. మెంటల్ హాస్పిటల్ నుంచి వచ్చాక నాన్న రాళ్లు, ఇటుకలు మోసి జీవిస్తున్నాడని తెల్సుకొన్నాను.

నేనూ పన్చేస్తానంటే వద్దన్నాడు నాన్న. ఈ డాక్టర్ హరి పెద్దబంగళా కట్టిస్తుంటే నాన్న అక్కడ పనికి కుదిరాడు. పైన పని చేస్తున్నాడు నాన్న. నీరసం మీద

పట్టుతప్పి కిందపడ్డాడు. ఈ డాక్టర్ నాన్నని కాపాడ వల్సిందిపోయి, నీ తండ్రి చావుబ్రతుకుల మధ్య వున్నాడు తీసుకుపో, అని నాకు కబురు పెట్టాడు.

రక్తం చాలా పోయింది నాన్నకి. రక్తం యెక్కిస్తే బ్రతుకుతాడట. డాక్టర్ హరి కాళ్లు పట్టుకు ప్రార్థించాను, నాన్నని బ్రతికించమని. నా రక్తం యెక్కించమని కోరాను. నా రక్తం చాలదట. బ్లడ్ బేంకులో రక్తం వుంటుందట. వందలు పోస్తేగాని రక్తం యివ్వరట. అతని మూర్ఖవాదనతో నాన్న మరణించాడు.

నాకు మరోషాక్ తగిలింది. పగ, ద్వేషం తగిలింది. నాకు తోడుగా దొరికారు ప్రకాష్, రాకా. అంతా కల్సి బాగా డబ్బు సంపాదించాం.

తర్వాత, నా తండ్రిని పొట్టన పెట్టుకున్న యీ డాక్టర్ హరిని బంధించాము. వాడి కళ్ళయెదురుగా ప్రతీ డాక్టర్ రక్తాన్ని తీసి యిచ్చేవాళ్ళం. అందర్నీ చంపాకా ఆఖర్న వాణ్ని.... వాణ్ని....'' అంటూ గాంధీ ఆగిపోయాడు. అంతలో బిలబిలమంటూ పోలీసులు లోపలకు ప్రవేశించారు. గాంధీ, రాకా, ప్రకాష్ చేతులకు బేడీలు పడ్డాయి. □

భలే జోక్

"ఎందుకండీ అలా అందరూ గొల్లున నవ్వుతున్నారు?"

"మా అమ్మాయి వ్రాసిన జోకు చదివి!"

"జోకు అంత బాగుందా?"

"దాని మొహం లాగుంది! మేము నవ్వకుంటే అది ఏడుస్తుందని నవ్వుతున్నాం...!!"

—కె. నాగభూషణం, బత్తలపల్లి.

ప్రతాప రవిశంకర్

చావుభయం

రెస్టు తీసుకుందామనుకున్నామ. కాని కుదర్లేదు. ఓ కేసు పూర్తవగానే మరో కేసు వచ్చింది.

అతని పేరు నటేశనట. నా ఎదురుగానే యిప్పుడు కూర్చుని వున్నాడు.

"మీరు నాకు తప్పకుండా సహాయం చెయ్యాలి"

అన్నాడు నటేశన్.

నవ్వొచ్చింది. నాకు పరిచయంలేని వ్యక్తు లందరూ నా దగ్గరకు సహాయంకోసమే వస్తారు.ఇదే డిటెక్టివ్ వృత్తిలో వున్న గొప్పతనం.

నిజానికి నటేశన్ నా కంటే ధనవంతుడు. అలాగని అతని రూపమే చెబుతోంది. నా కంటే ఎక్కువ పలుకుబడి గలిగిన వ్యక్తి. అయినా నా దగ్గరకు వచ్చాడు. సాటి మనిషి మేధస్సునీ, శారీరక బలాన్ని కూడా డబ్బుతో వుపయోగించుకోవడం....

"మీ గురించి ఒకరిద్దరు చెప్పగా వచ్చాను" అన్నాడు మళ్ళీ.

"చెప్పండి."

"సిగరెట్ కాల్చుకోవచ్చా?"

"నిరభ్యంతరంగా" నేనూ ఓ సిగరెట్ అంటించబోతూ అన్నాను.

పొగ బయటకు వదిలాడు నటేశన్. తర్వాత రెండు నిముషాలు ఆలోచించాడు.

"చెప్పండి. నేను యే విషయంలో మీకు సహాయ పడగలను........" అన్నాను ముందుకు వంగుతూ కుర్చీలో....

"శ్యామ్‌లాల్ నన్ను చంపుతాడేమో....మీరు నన్ను కాపాడాలి" అన్నాడు భయంగా....

చిత్రం....ఆదుర్దాలో ఈ మనుషులు ఏ విషయాన్నీ పూర్తిగా చెప్పరు. నిజానికి శ్యామ్‌లాల్ ఎవరో నాకు తెలీదు.

"శ్యామ్‌లాల్ ఎవరూ?"

"సారీ....చెప్పలేదు కదూ....నా పార్ట్‌నర్."

"ఆయన మిమ్మల్ని చంపుతాడని ఎందుకు అనుకుంటున్నారు?"

"వివరంగా చెబుతాను ...నేను, శ్యామ్‌లాల్ ఫైనాన్సింగ్ బిజినెస్ చేస్తున్నాం....బాగా లాభమొస్తోంది.... బిజినెస్సులో ఎక్కువ వాటా నాకే వుంది. అంటే ప్రాఫిట్ షేరింగ్ రేష్యోలో ఎక్కువ లాభం నాదే....నా కాపిటల్ కూడా ఎక్కువే....దాదాపు పదహారేళ్ళనించీ మేము బిజినెస్ చేస్తున్నాం....ఇన్నాళ్ళూ నన్ను వేధించని ఈ ఆలోచన ఒక నెలరోజులుగా నన్ను పీడిస్తోంది....అదే శ్యామ్‌లాల్ చంపుతాడేమో నన్ను...." సగం కూడా కాలని సిగరెట్టుని నకిశన్ యాష్ ట్రేలో కుక్కేశాడు....

ఇప్పుడు కూడా ఆయన విషయాన్ని పూర్తిగా చెప్పలేదు.

"ఇంకా వివరంగా చెప్పండి....ఆయన మిమ్మల్ని చంపటానికి మూలమయిన కారణం ఏమిటి? మీరు చనిపోతే వ్యాపారమంతా ఆయనొక్కడిదీ అవుతుందా?" అడిగాను.

"ఒక రకంగా కాదు....కాని ఇంకో రకంగా అవుతుంది."

"ఎలా కాదు? ఎలా అవుతుంది?"

"నాలుగేళ్ళ క్రితం నా భార్య ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయింది. నాకు ఒకే ఒక్క కూతురు వుంది. దాని పేరు నాగమణి. ఇప్పుడు దాని వయసు పందొమ్మిది. నాకు గుండెజబ్బు వుంది. ఎప్పుడు పోతానో ఎవ్వరికీ తెలీదు. అందుకే ఒకవేళ నేను చచ్చిపోతే నా ఆస్తి కూతురికీ బిజినెస్సులో వాటా మాత్రం అల్లుడికి చెందేట్టుగా విల్లు రాశాను...." చెబుతున్నాడాయన....కాని నేను మధ్యలోనే

అడ్డుపడ్డాను....

"అలా ఎందుకు చేశారు? బిజినెస్‌లో వాటా కూడా మీ అమ్మాయికి చెందేట్టుగా ఎందుకు రాయలేదు?" అడిగాను....

"చెప్పుకోవడం బావుండదు జగదీష్‌గారూ....!.... అమ్మాయికి కొన్ని వ్యసనాలు వున్నాయి. డబ్బును నీళ్లలా ఖర్చుపెడుతుంది....అందుకే అలా రాశాను...." అన్నాడాయన.

"మీ అమ్మాయికి పెళ్ళయిందా?"

"ఇంకా కాలేదు....చేసుకుంటానంటోంది....ఎవర్నో అయితే నేను యింతగా భయపడిపోయేవాడినికాదు. నా పార్ట్‌నర్ శ్యామ్‌లాల్ కొడుకును అమ్మాయి పెళ్ళి చేసుకుంటుందిట....అదీ అతనూ ప్రేమించుకున్నారుట....అతన్ని తప్ప మరో మగవాడ్ని తను పెళ్ళి చేసుకోదుట....ఎంతగానో ప్రయత్నించాను దాని మనసు మార్చాలని....కాని నా వల్ల కాలేదు...."

"మీ అమ్మాయి అతన్ని చేసుకోవడం మీకు ఎందుకు ఇష్టంలేదు?"

"నా విల్లు సంగతి శ్యామ్‌లాల్‌కి తెలుసు. నా కూతుర్ని అతని కొడుకు చేసుకుంటే అతను నా అల్లుడవుతాడు. అప్పుడు నేను చచ్చిపోతే బిజినెస్సులో వాటా అతనికి దక్కుతుంది. అంటే అప్పుడు తండ్రీ కొడుకులే వాటాదారులు అవుతారు....నేను చచ్చిపోవడం శ్యామ్‌లాల్‌కు యిలా కలిసివస్తుంది....మామూలు పార్టనర్‌షిప్ డీడ్ ప్రకారం నేను చచ్చిపోతే శ్యామ్‌లాల్‌కి ఏమీ రాదు...." ఆగాడు నటేశన్....

నటేశన్ ఉద్దేశం నాకు అర్థమయింది. అతను కేవలం జరగబోయేదాన్ని వూహించి భయపడుతున్నాడు....అంతే గానీ తన భాగస్వామి తనని చంపుతాడనటానికి ఇతరత్రా ఎలాంటి పగగానీ, ద్వేషంగానీ లేవు....

"కేవలం మీరు విల్లు అలా రాయబట్టే గదా శ్యామ్‌లాల్ గురించి మీరు భయపడుతున్నది" అడిగాను మరో సిగరెట్టు ముట్టిస్తూ....

"అవును" అని తల వూగించాడు నటేశన్....

"విల్లును యిప్పుడు మార్చి రాయండి....బిజినెస్సులో వాటా కూడా మీ అమ్మాయి పేరనే రాయండి...." అన్నాను....

"రాయొచ్చు....కాని దాని సంగతి చెప్పాను కదా.... నిలవదు. అందుకే రాయడం కుదరదు."

"మరి మిగిలిన ఆస్తి మాత్రం ఎలా రాశారు ఆ అమ్మాయి పేర్న? అది కూడా కాబోయే అల్లుడికే చెందేట్టు రాయలేకపోయారా?"

"అలాగే రాయొచ్చు....కాని అల్లుడు ఆస్తంతా తనదే నని అమ్మాయికి అన్యాయం చేస్తే? అందుకే అలా రాశాను...."

"ఇంతకీ మీమీద హత్యాప్రయత్నంలాంటి దేమయినా జరిగిందా....?" సూటిగా నటేశన్ కళ్ళలోకి చూస్తూ అడిగాను.

"అవును జరిగింది....వారంరోజుల క్రితం శ్యామ్‌లాల్ నేను ఆఫీసు మెట్లు దిగుతున్నాం. రెండు మెట్లు దిగగానే నేను దబ్‌న పడిపోయాను....అలా పడినవాణ్ని సగం వరకు దొర్లుకుంటూ వచ్చాను. శ్యామ్‌లాలే గబగబా వచ్చి

నన్ను పట్టుకున్నాడు....తలకు చిన్న దెబ్బ తగిలింది" అన్నాడు తలమీద చెయ్యి వుంచుకుని.

"మీ ఉద్దేశం ఏమిటి? శ్యామ్‌లాల్ మిమ్మల్ని నెట్టి వుంటాడనా?"

"అవును" తలాడించాడు నటేశన్.

"మీరే కాలుజారారో, తూలుడు లాంటిదో వచ్చి పడ్డారేమో" అన్నాను.

"కాదు....కాలు జారలేదు."

"మీకు ముందుకు నెట్టినట్లు అనిపించిందా?"

"ఏమో! అదే తెలీలేదు."

"ఇలాంటప్పుడు నిర్ణయించటం కష్టం" అన్నాను.

"అయితే ఏమంటారు? శ్యామ్‌లాల్ నన్ను హత్యచేసే అవకాశం లేదంటారా?" అడిగాడు నటేశన్.

"చెప్పలేను. అసలు శ్యామ్‌లాల్ ఎలాంటి మనిషి?"

"డబ్బుకోసం అతను కక్కుర్తి పడతాడని నాకు తెలుసు. అయితే అతను కష్టపడి పైకొచ్చిన మనిషి.... మధ్యలో కొంత అక్రమంగా కూడా సంపాదించాడని కొంతమంది చెప్పుకుంటారు."

"అంత మాత్రాన అతను దుర్మార్గుడని అనలేము."

"నిజమే....కాని ఎందుకో అతను నన్ను చంపుతాడని అనిపిస్తోంది."

"అది కేవలం మీ భయం."

"కావచ్చు....ఈ విషయంలో మీ సహాయం నాకు లభిస్తుందో లేదో చెప్పండి...." అన్నాడు నటేశన్ భారంగా.

"సారీ....తగిన కారణం వుంటేగానీ నేను కేసు టేకప్ చెయ్యను....మీరు కేవలం భయపడుతున్నారు. మీ భయా

నికి తగిన ఆధారాలు లేవు. అలాంటప్పుడు ఇందులో నా అవసరం ఏమాత్రం వుండదు. మీరు పోలీసు రిపోర్టు ఇవ్వండి" అన్నాను.

"అంతేనంటారా?" అన్నాడు నటేశన్ నిరాశగా.

"సారీ....అంతే" అన్నాను సిగరెట్టును యాష్‌ట్రేలో పడేసి.

"థాంక్యూ జగదీష్....వెళ్ళొస్తాను" అని మెల్లగా డోర్ నెట్టుకుని బయటకు వెళ్ళాడు నటేశన్.

2

మర్నాడు ఉదయం.

ఎనిమిది గంటలవుతోంది. ఆఫీసురూంలో కూర్చుని సిగరెట్టు కాలుస్తూ పేపర్ చూస్తున్నాను.

మొదటిపేజీలో వున్న ఆ వార్త నన్ను ఆకర్షించింది. గబగబా చదివాను.

హైద్రాబాదు, నవంబరు ఇరవై ఏడు: గతరాత్రి ప్రకాష్ నగర్‌లోని అర్జునా ఫైనాన్స్ భాగస్వామి శ్యామ్‌లాల్ ఇంట్లో దారుణమయిన హత్య జరిగింది. ఆయన కొడుకు పన్నాలాల్‌ని యెవరో కత్తితో పొడిచి చంపారు. హంతకుడి జాడలు దొరకలేదు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరోసారి ఆ వార్తను చదివాను. నా మెదడులో ఒక్కసారి ఆలోచనలు నిండిపోయాయి.

అనుకున్నదొకటి.

జరిగింది మరొకటి.

నటేశన్ తనని శ్యామ్‌లాల్ చంపుతాడేమోనని భయపడ్డాడు. కాని వూహించని విధంగా శ్యామ్‌లాల్ కొడుకునే ఎవరో హత్య చేశారు.

ఎవరు చేసివుంటారు?

ఇంకెవరు? బహుశా నటేశన్ హత్య చేసి వుండొచ్చు. అతను తన కూతుర్ని చేసుకుంటే తనకు చావు రాసిపెట్టి వుందని భయపడుతున్నాడు. అలాంటప్పుడు అతన్నే చంపేస్తే తన గురించి భయం వుండదు.

గబగబా బయటకు వచ్చాను. రూమ్ లాక్ చేసి స్కూటరు స్టార్టు చేశాను.

నున్నటి తారురోడ్డుమీద రివ్వున దూసుకు పోతోంది స్కూటరు.

నటేశన్ తెలివయినవాడు.... నిన్న నేను అతని కేసు టేకప్ చేసివుంటే పన్నాలాల్ చావు జరిగేది కాదేమో!

ప్రకాష్ నగర్‌లో ప్రవేశించాను.

శ్యామ్‌లాల్ ఇల్లు సులభంగానే తెలిపింది. పెద్ద మేడ. ముందు గార్డెన్. గేటు దగ్గర గూర్ఖా వున్నాడు.

స్కూటర్‌ని లోపలకు పోనిచ్చాను.

తలుపులు తెరిచే వున్నాయి. ఐనా కాలింగ్ బెల్ నొక్కాను.

నిమిషం తర్వాత నౌకరు వచ్చాడు. ఎవరు కావాలని అడిగాడు.

చెప్పాను.

"కూర్చోండి" అన్నాడు పక్కనే వున్న విజిటర్స్ రూము చూపి.

కూర్చున్నాను.

ఐదు నిముషాల తర్వాత పంచె కట్టుకుని వచ్చాడు శ్యామ్‌లాల్. ఆయన ముఖం పీక్కుపోయి వుంది. కళ్ళు వుబ్బివున్నాయి. బాగా ఏడ్చివుంటాడు.

నన్ను నేను పరిచయం చేసుకున్నాను. అయితే నటే

శన్ క్రితంరోజు నన్ను కలుసుకున్నట్టుగా ఆయనతో చెప్ప లేదు. నా యింట్రస్టుకొద్దీ నేనే యీ కేసు పరిశోధించాలని వచ్చానని చెప్పాను.

"సంతోషం....ఇలా జరుగుతుందని అనుకోలేదు. ఒకే కొడుకు....అల్లారుముద్దుగా పెంచాను. ఎవడో దుర్మార్గుడు పొట్టన పెట్టుకున్నాడు" అన్నాడు బాధగా. ఆయనకు మళ్ళీ దుఃఖం వచ్చింది.

"క్షమించండి ...మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడుగుతాను. మీకు తెలిసినంతవరకు నిజమే చెప్పండి. మీరు సహాక రిస్తే తప్పకుండా మీ కొడుకును చంపిన హంతకుడిని పట్టు కుంటాను."

"అడగండి" అన్నాడాయన.

"పన్నాలాల్‌కి యెవరయినా శత్రువులున్నారా?"

"నాకు తెలిసి యెవ్వరూ లేరు....వాడు చాలా నెమ్మద స్తుడు....త్వరపడి యెవ్వరి జోలికీ వెళ్ళడు."

"పన్నాలాల్ చనిపోవడంవల్ల యెవరికయినా లాభం వుందా?"

"ఎవ్వరికీ లేదు....అయితే పన్నాలాల్ పోతే నా ఆస్తంతా నా తమ్ముడి కొడుకు భూర్‌మల్‌కు చెందు తుంది...."

"ఒకవేళ అతను ఈ హత్య చెయ్యటానికి అవకాశం వుందా?"

"అతను చేసి వుండడు....పన్నాలాల్ పోయినా భూర్ మల్‌కి యిప్పుడు ఆస్తి రాదు. యెందుకంటే నేను బతికే వున్నాను. ఎప్పుడో వచ్చే ఆస్తికోసం ఇప్పుడు యెవ్వరూ హత్యలు చెయ్యరనుకుంటాను."

తల వూగించాను.



"అయితే మీరు ఈ హత్య విషయమై యెవ్వర్నీ అను మానించటం లేదా?"

"ఒకే ఒక వ్యక్తిని అనుమానిస్తున్నాను."

"ఎవరు అతను!"

"నా భాగస్థుడు నటేశన్."

"ఎందుకు?"

"అతను వ్యాపురంలో తన భాగాన్ని తనకు కాబోయే అల్లుడిపేర విల్లు రాశాడు. ఆయన హార్టు పేషెంటు. అందుకే ముందుగా విల్లు రాశాడు. న్యాయంగా ఆయన తార్వాత వ్యాపారంలో ఆ భాగం నా కొడుక్కి చెందుతుంది. ఎందు కంటే నా కొడుకు నటేశన్ కూతురు నాగమణి ప్రేమించు కుని పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. నేను ఒప్పుకున్నాను. కాని నటేశన్ ఒప్పుకోలేదు.

వ్యాపారంలో భాగం కాజెయ్యటానికి, నేనుగానీ నా కొడుకుగానీ ఆయన్ని చంపుతామని ఆయన భయం. ఆయన ఈ వుద్దేశాన్ని ఒకటి రెండుసార్లు నా ముందు బయట పెట్టాడు. పన్నాలాల్‌ని బెదిరించాడు. తన కూతురుకీ ఎంత గానో చెప్పాడు. ఎవ్వరూ వినలేదు. తర్వాత వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించటానికే ఒప్పుకున్నాడు.బహుశ అది నాటకమై వుండొచ్చు. తన ప్రాణంమీది భయంకొద్దీ పన్నాలాల్‌ని అడ్డు తొలగించుకోటానికి హత్యచేసి వుండవొచ్చు" అన్నాడు శ్యామ్‌లాల్.

అతను ఈ విషయాలు దాచకుండా చెప్పినందుకు సంతోషం కలిగింది.

శ్యామ్‌లాల్‌ని ఆ తర్వాత మరికొన్ని ప్రశ్న లడిగాను. అన్నింటికీ జవాబులు చెప్పాడు. చివరకి హత్య జరిగిన గదిని ఓసారి చూడాలన్నాను.

మేడమీదికి తీసుకువెళ్ళి చూపించాడు.

ఆ గదిలో ఏమీలేదు. మామూలుగా వుంది. కాని ఆ గదిని క్షుణ్ణంగా పరిశీలించాలనిపించింది. అతను వుండగా అది సాధ్యం కాదు. శ్యామ్‌లాల్‌ని బయటకు పంపటం ఎలాగా అని ఆలోచిస్తున్నాను. ఇంతలోనే నౌకరు పైకి వచ్చాడు.

"మీ కోసం పోలీసులు వచ్చారు. కింద వున్నారు" అని చెప్పాడు.

"ఇప్పుడే వస్తాను" అని శ్యామ్‌లాల్ కిందికి వెళ్ళి పోయాడు.

థాంగ్ గాడ్ అనుకుని గబగబా వెతకటం మొదలు పెట్టాను. అనుమానించదగ్గ వస్తువేదీ ఆ గదిలో దొరక లేదు.

నిరాశ కలిగింది. అయినా వెతుకుతూనే వున్నాను.

నా దృష్టి అలమార్లో వున్న చిన్న తెల్లకాయితంమీద పడింది....దుమ్ముపడి వుంది దానిమీద....బహుశ ఇప్పటి వరకు దానిమీద బరువయిన వస్తువేదో వుండివుంటుంది.

దాన్ని తీసి వెనక్కు తిప్పాను. బ్యాంక్ స్ట్రీట్‌లో వున్న జయా బ్యాంకులోని సేఫ్ డిపాజిట్ లాకర్‌లో పన్నాలాల్ దేన్నో దాచినట్టుగా రాసివుంది.

వెంటనే దాన్ని జేబులో పెట్టుకున్నాను.

అప్పుడే లోపలకు వచ్చాడు శ్యామ్‌లాల్.

"ఈ పోలీసులు సందేహాలు తీర్చుకోవటమేగానీ హంతకుడిని పట్టుకోరు. ఏవో ప్రశ్నలు అడగటానికి వచ్చారు. మనిషి దుఃఖంలో వున్నాడనే విషయం కూడా గ్రహించరు. మీకేదయినా క్లూ దొరికిందా?" అడిగాడు.

"లేదు...." అన్నాను.

"పోలీసులు నిన్న గదిని శల్యపరీక్షచేశారు" అన్నాడు.

"హత్య జరిగిన రాత్రి మీకు అరుపులు వినిపించాయా?"

"లేదు. నేను కింద పడుకుంటాను. పైన పడుకునేది పన్నాలాల్ ఒక్కడే."

"మీ భార్యను ఒక్కసారి కలుసుకోవచ్చా?"

"అది మీకు సాధ్యం కాదు. ఆమె వేరే లోకంలో వుంది" బాధగా అన్నాడు శ్యామ్‌లాల్.

"సారీ. అవసరమయితే మిమ్మల్ని మళ్ళీ కలుస్తాను" అని శ్యామ్‌లాల్‌కి థాంక్స్‌చెప్పి బయటకు వచ్చాను.

నా మెదడు తీవ్రంగా ఆలోచిస్తోంది.

పన్నాలాల్ హత్యకు మోటివ్ ఏమిటో తెలీటం లేదు.

నటేశన్‌ని ఆయన కూతుర్ని కలుసుకుంటేగానీ నా ఆలోచనలు ఒక దారికి రావు.

3

స్కూటర్‌ని నటేశన్ ఇంటివైపే పోనిచ్చాను.

అప్పుడే కార్లో యెక్కడికో బయల్దేరాడు ఆయన.

నన్ను చూసి ఆగాడు. కార్లోనించి దిగాడు.

"మీరు ఇక్కడకు వస్తారని నాకు తెలుసు" అన్నాడు.

"ఎలా?"

"న్యూస్ పేపర్లో పన్నాలాల్ హత్యవార్త చదివిన తర్వాత నన్ను కలుసుకుంటారనుకున్నాను."

"మీతో మాట్లాడాలి" అన్నాను.

"పదండి. లోపల కూర్చుని మాట్లాడుకుందాం."

ఇద్దరం లోపలకు వెళ్లాము.

ఓ గదిలో కూర్చున్నాం. నటేశన్ హార్లిక్స్ తెప్పించి ఇచ్చాడు.

"ఏం మాట్లాడాలి?" అడిగాడు.

"పన్నాలాల్ హత్య గురించి మీతో మాట్లాడాలని వచ్చాను."

"మీ కేమిటి ఇంట్రెస్టు? మీరు శ్యామ్‌లాల్ తరపున వస్తేస్తున్నారా?" అడిగాడు.

"లేదు. నా ఇంట్రెస్టుకొద్దీ."

"సరే. మీరు ప్రశ్నలు అడగండి."

"పన్నాలాల్‌ని మీరే హత్యచేశారని నేను అనుమానిస్తున్నాను."

నటేశన్ నవ్వాడు.

"ఈ హత్య నేను చెయ్యలేదని మీకు తెలుసు. కావాలని మీరు ఇలా మాట్లాడుతున్నారు" అన్నాడు.

"కాదు. మీరే ఈ హత్య చేశారు.... నేను మీ కేసు తీసుకోవడానికి ఒప్పుకోలేదు. అందుకే మీరు శ్యామ్‌లాల్ గురించి భయపడ్డారు. అసలు పన్నాలాల్‌ని హత్యచేస్తే ఏ గొడవా వుండదని అతన్ని హత్యచేశారని అంటాను. దీనికి మీరేమంటారు?" అని కళ్ళలోకి చూస్తూ అడిగాను.

"మీరు అనొచ్చు జగదీష్‌గారూ! కాని ఈ హత్య నేను చెయ్యలేదు. నాకు ఎలిబీవుంది. హత్య జరిగిన రాత్రి నేను కొంతమంది పెద్దమనుషుల సమావేశంలో వున్నాను. కావాలంటే రుజువు చెయ్యగలను" అన్నాడు.

నటేశన్ అంత గట్టిగా మాట్లాడుతున్నాడంటే నిజంగానే అతనికి గట్టి యెలిబీ వుండివుంటుంది.

"మీ అమ్మాయి నాగమణితో మాట్లాడవచ్చా?" అడిగాను.

"అలాగే. ఆ గదిలో వుంది. వెళ్ళండి."

నటేశన్ చూపించిన గదిలోకి నడిచాను.

బెడ్‌మీద పడుకుని ఇంగ్లీషు జర్నల్ పేజీలు తిప్పుతోంది ఓ అమ్మాయి.

అందంగా వుంది.

నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"కూర్చోండి" అన్నది కుర్చీ చూపి. తనూ ఓ కుర్చీలో కూర్చుంది.

"నిజంగా ఇది మీకు గొప్ప షాక్. పన్నాలాల్ హత్యకు నేను విచారిస్తున్నాను" అన్నాను.

"పోనివ్వండి....అలాంటి వాడు చావటమే మంచిది" అన్నది కసిగా.

ఉలిక్కిపడ్డాను.

నాగమణి ఇలా మాట్లాడుతుందేమిటి? ఇందుకు ఏదో

బలమయిన కారణమే వుంటుంది.

"మీ రిద్దరూ ప్రేమికులని నటేశన్‌గారు చెప్పారు."

"నిజమే. పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకున్నాం. కాని ఆ బ్రూట్ నిజరూపం వాడు నావటోయేముందు తెలిసింది."

"వివరంగా చెప్పండి. పన్నాలాల్ ఎలాంటి మనిషి?" నాగమణి మొహంలోకి చూస్తూ అడిగాను.

"వాడు బ్లాక్ మెయిలర్. వాడో జలగ. ఎంతోమందిని వాడు కొన్ని సందర్భాల్లో రహస్యంగా ఫోటోలు తీశాడు. ఇదంతా నాకు ముందు తెలీదు. ఈ మధ్య నాకు ఒక ఆకాశరామన్న ఉత్తరం వచ్చింది వాడి గురించి. నిలదీసి అడిగాను—తన గురించి అంతా తెలిసిపోయిందని, దొరికిపోయాడు. అంతే. ఇక జన్మలో వాడి మొహం చూడనని చెప్పి వచ్చేశాను" కోపంగా అన్నది నాగమణి.

చాలావరకు అర్థమయింది.

"ఆ ఆకాశరామన్న ఉత్తరం ఓ సారి యిస్తారా?" అడిగాను.

టేబిల్ సొరుగులోనించి తీసి ఇచ్చింది.

దాన్ని చదివి జేబులో పెట్టుకుంటూ: "హత్య జరిగిన రోజు రాత్రి మీరు పన్నాలాల్‌ని కలుసుకున్నారా?" అడిగాను.

"కలుసుకున్నాను. ఆ రాత్రే వాడి నిజం రూపం తెలిసింది."

"అతన్ని మీరు హత్యచేసే అవకాశం వుందనుకుంటాను."

"వుంది. కాని పన్నాలాల్ నాతోపాటే బయటవరకూ వచ్చాడు. ఆలా నా వెనుక రావడం ఆ ఇంట్లో నౌకర్లు

వాడు హత్యచెయ్యబడ్డాడు."
ఇంకేమీ మాట్లాడేది లేదనిపించింది.
ప్పి బయటకు వచ్చాను.
ట్లో లేడు. వెళ్ళిపోయాడు అప్పటికే.

4

బయల్దేరాను.
డుతోంది.
ను. హత్యచేసే అవకాశం ఎవరికివుందో
అవసరమేమిటో తెలీటం లేదు. అది
యా బ్యాంక్‌కి వెళ్లాలి. నా అంతట
ర్మేషన్ యివ్వరు. పోలీసే ఇన్
అందుకే స్కూటర్‌ని పోలీస్ స్టేషన్

షరీఫ్ వున్నాడు. అతనికి నేను
నన్ను కలుసుకున్న విషయం
జరిపిన పరిశోధన, నా అను
అతని సహాయం కోరాను.
య్యటానికి ఒప్పుకున్నాడు.
బ్యాంక్ స్ట్రీట్‌కి వెళ్ళాం.
జర్‌తో మాట్లాడాడు ఇన్
లో దొరికిన ఆ కాగితాన్ని

సేఫ్ డిపాజిట్ లాకర్
రు వుంది. దాన్లో కొన్ని

"ఈమె ఎవరూ?" అడిగాడు షరీఫ్.

"నటేశన్ భార్య" చెప్పాను న

పూలదండలతో ఇంతకుముందే నేను

గుర్తుచేసుకుని—ఆ ఫోటోల్లో మగా

క్రీడల్లో వున్నారు.

మేనేజర్‌కి థాంక్స్ చెప్పి ఆ ఫోటో

నుంచి బయటకు వచ్చాము.

"హంతకుడెవరో ఇప్పుడు అర్థమం

షరీఫ్.

"ఈ ఆకాశరామన్న ఉత్తరంలో ద

అయివుంటుంది" అన్నాను.

అవునన్నట్టు తలాడించాడు షరీఫ్

స్కూటర్ పోలీస్‌స్టేషన్ ముందు

వెంటనే షరీఫ్ నలుగురు పో

ప్రాసెసింగ్ యూనిట్‌కు బయ

రితో నేనూ వెనుకే వెళ్లాను.

ఆఫీసులో నటేశన్ లేడు

మమ్మల్ని చూడగానే భయప

ఆకాశరామన్న ఉత్తరంలో

కస్తూరిని పోల్చి చూశాడు

వెంటనే శ్యామ్‌లాల్‌ని అరెస్ట

"ఏమిటిదంతా?" అమా

లాల్.

"నిన్ను బ్లాక్‌మెయిల్

కొడుకునే హత్యచేసిన

చిన్నగా.

"నన్నెవరూ బ్లాక్‌మె